ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 18, మార్చి 2025

వైసీపీ కాలంలో డీసీసీబీలో
భారీ దోపిడీ

- అసెంబ్లీలో ప్రస్తావించిన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల
- రాష్ట్రవ్యాప్తంగా సహకార సంస్థల్లో అక్రమాలపై విస్తృత చర్చ

ఒంగోలు మార్చి 17(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో డీసీసీబీలతోపాటు ఆప్కాబ్ నుంచి పీఏసీఎస్‌ల వరకు భారీగా అక్రమాలు, అవినీతి జరిగాయని పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ధ్వజమెత్తారు. ఆ సందర్భంగా ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పెద్దఎత్తున దోపిడీ జరిగిందని,



ప్రభుత్వ పథకాల పేరుతో నాటి వైసీపీ నాయకులు, అధికారులు రైతుల ధనాన్ని దోచుకున్నారని గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. అక్రమాలపై కలెక్టర్ ప్రభుత్వానికి పంపిన నివేదికను ఉటంకిస్తూ చర్యలకు డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, పీఏసీఎస్‌లు, ఆప్కాబ్ వంటి సహకార సంస్థలలో గత వైసీపీ హయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్చ సాగింది. పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రతోపాటు ఇతర జిల్లాల ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు, కూన రవికుమార్, యార్లగడ్డ వెంకట్రావు, బొలిశెట్టి శ్రీనివాస్

మిగతా 6వ పేజీలో

ఒంగోలులోని డ్వామా కార్యాలయం



బదిలీల టెన్షన్



డ్వామాలో ఎట్టకేలకు మార్పు మొదలైంది. ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా బదిలీలకు ప్రభుత్వం తెరతీసింది. దీంతో ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. డ్వామాలో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అంతా గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆపార్టీ కీలక నేతల సిఫార్సులతో నియమితులైన వారే. ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయి అవినీతి, అక్రమాలతో భారీ ఎత్తున ఆర్జించారు. అలాంటి అనేక మంది ఆ శాఖలో వివిధ స్థాయిల్లో ఉన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో క్షేత్రస్థాయిలో ఆ సంస్థ తరఫున పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు మినహా మిగతా వారంతా మారనున్నారు. దీంతో ఎంత దూరం వెళ్లాల్సి వస్తుందోనన్న భయం కొందరు ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

ఒంగోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో ఉపాధి హామీ పథకం పర్యవేక్షకులు అయిన నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ బదిలీ జరిగి కొత్తగా జి.జోసఫ్‌కుమార్ వచ్చారు. మిగిలిన వారిలో ఇంచుమించు అందరూ గతం నుంచి ఆయా పోస్టుల్లో కొనసాగుతున్నారు. ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు (ఈసీ), కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి ఒక్కో మండలంలో పది మంది వరకు ఉంటారు. క్లస్టర్ స్థాయిలో ఏపీడీ, కార్యాలయ సిబ్బంది, వివిధ చోట్ల ఉన్న శిక్షణ కేంద్రాలు (సీఎల్ఆర్‌సీ సెంటర్స్)తోపాటు డ్వామా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది పెద్దసంఖ్యలో ఉన్నారు. వీరిలో ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులు ఉండేది చాలా తక్కువ. డ్వామా జిల్లా

మిగతా 6వ పేజీలో

ఏళ్లతరబడి పాతుకుపోయిన డ్వామా ఉద్యోగులు కదలాల్సిందే!

- ఏపీడీ నుంచి కంప్యూటర్ ఆపరేటర్ వరకు మూడేళ్లు దాటితే స్థానచలనం
- ఐదేళ్లు అయితే తప్పనిసరిగా మార్పు
- పూర్తిస్థాయిలో ప్రక్షాళనతోనే ఫలితం
- త్రిసభ్య కమిటీ నివేదికపై చర్యలు కూడా కొలిక్కి

మహిళా సమాఖ్య
ఎన్నికల్లో అక్రమాలెన్నో..!

- మండల సమాఖ్య అధ్యక్షుల స్థానంలో బినామీలతో ఓట్లు వేయించిన అధికారులు
- తాము అనుకున్న వారే ఎన్నికయ్యేలా బరితెగింపు

ఒంగోలు నగరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళా సమాఖ్య ఎన్నికల్లో అధికారుల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఎన్నికలను పూర్తిగా సహకార చట్టం పరిధిలోనే అధికారులు నిర్వహించాల్సి ఉంది. కొత్తగా ఎన్నికలు నిర్వహిస్తే ఉన్న కార్యవర్గ సభ్యుల్లో సగం మంది పాతవారికి, మూడొంతులు కొత్త వారికి కార్యవర్గంలో అవకాశం కల్పించాలి. ఇతర జిల్లాకు చెందిన సమాఖ్య నుంచి ఇక్కడ జరిగే ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిని నియమించాలి. కానీ ఈ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా అధికారులు రాచర్ల వెలుగు ఏపీఎం రమేష్‌ను ఎన్నికల అధికారిగా నియమించారు. జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకునేందుకు జిల్లాలోని 38 మండలాల సమాఖ్య



జిల్లా మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం (ఫైల్)

అధ్యక్షులు ఓటుహక్కు కలిగి ఉంటారు. కానీ ఈనెల 12న వెలుగు అధికారులు నిర్వహించిన ఎన్నికల్లో మండల సమాఖ్య అధ్యక్షులు కొంతమంది రాకపోయినా వారి స్థానంలో బినామీలతో ఓట్లు వేయించారు. తాము అనుకున్న వారినే నూతన కార్యవర్గంలో ఎన్నిక చేసేందుకు, ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు అధికారులు ప్రయత్నించారు. కానీ పలువురు మండల సమాఖ్య అధ్యక్షులు అధికారుల తీరును ప్రశ్నిస్తూ నిలదీశారు. అయినప్పటికీ ఎన్నికల్లో టంగుటూరు మండల సమాఖ్య అధ్యక్షురాలు గడ్డం కవిత గెలుపొందినట్లు ప్రకటించారు.


కొందరు రాకపోయినా ఓటు వేశారు

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా గడ్డం కవిత గెలుపొందటానికి వెలుగు అధికారులు సంపూర్ణ సహకారం అందించారు. కొన్ని మండలాలకు చెందిన సమాఖ్య అధ్యక్షులు ఎన్నికలకు హాజరు

మిగతా 6వ పేజీలో

90 కొనుగోలు కేంద్రాలు

- కందులు, శనగలు, మినుముల కోసం ఏర్పాటు
- జేసీ గోపాలకృష్ణ



ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు 90 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. కందుల కొనుగోలుకు 45, శనగలకు 35, మినుములకు పది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. కందుల కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,550, శనగలు క్వింటా 5,650, మినుముల కనీస మద్దతు ధర క్వింటా రూ.7,400గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువ ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి రైతులు కనీస మద్దతు ధరను పొందాలని కోరారు. ఈక్రాప్‌లో కంది, శనగ, మినుము నమోదు చేసుకున్న రైతులు ప్రొక్యూర్‌మెంట్ కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రెండు రోజుల్లోపు సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆసమయంలో పంట నూర్పిడి తేదీని కూడా పేర్కొనాలని తెలిపారు. తద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునే తేదీ రిజిస్టర్ మొబైల్ నెంబరుకు మెసేజ్ ద్వారా వస్తుందని పేర్కొన్నారు. పంటను విక్రయించే సమయంలో శుభ్రం చేసి, ఆరబెట్టుకొని ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.





పరీక్ష ప్రారంభానికి ముందు ఒంగోలులోని ఓ కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో) తాళ్లూరులోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

సజావుగా పది పరీక్షలు 7

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు సజావుగా జరిగాయి. విద్యార్థులను గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతించారు. 29,637 మందికి గాను 29,149 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒంగోలులోని రామ్‌నగర్ మునిసిపల్ హైస్కూలు పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.



అర్జీదారులకు భోజనాన్ని వడ్డిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.25 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4.54 (బుధవారం ఉదయం)

మీకోసం వినూత్నం

- అర్జీదారులకు మధ్యాహ్న భోజనం
- స్వయంగా వడ్డించిన కలెక్టర్, జేసీ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వినూత్న కార్యక్రమాలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా శ్రీకారం చుడుతున్నారు. మీ కోసం (ప్రజా ఫిర్యాదుల స్వీకరణ)లో ఇప్పటికే పలు మార్పులు చేశారు. తాజాగా అర్జీలు ఇచ్చేందుకు జిల్లా నలుమూలల నుంచి వస్తున్న వారికి మధ్యాహ్న భోజనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సోమవారం ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ హాలులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు కలెక్టరేట్ ప్రాంగణంలో స్వాగతం పలకడంతోపాటు వారి అర్జీలను కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది రాసి ఇచ్చే విధంగా ఏర్పాటు చేశారు. మరోవైపు గంటల తరబడి అర్జీదారులు నిరీక్షించకుండా ఉండేందుకు అన్నిశాఖల అధికారులతో గ్రీవెన్స్ టేబుళ్లు వేసి వినతులను వారు పరిశీలించిన తర్వాతే కలెక్టర్ వద్దకు పంపుతున్నారు. నెలన్నరగా మంచినీటి సౌకర్యంతోపాటు రాగిజావను అందిస్తూ వచ్చారు. ఇప్పుడు మీకోసం హాలు ముందు భాగంలో టెంట్లు వేసి వచ్చిన అర్జీదారులకు అక్కడే భోజనాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. అన్న క్యాంటిన్ నిర్వాహకులతో ఈ విషయంపై చర్చించి సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్‌తోపాటు జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేషు స్వయంగా అర్జీదారులకు భోజనాలు వడ్డించారు. ప్రతి సోమవారం 500మంది అర్జీదారులకు భోజనాలు అందించనున్నారు.

ఎలా ముందుకెళ్దాం!

ప్రజల మనోభావాలకు అనుగుణంగా పీ4 సర్వే

- సలహాలు, సూచనలు కోరుతున్న ప్రభుత్వం
- వెబ్‌సైట్ ద్వారా సేకరణ
- జిల్లాలో ఇప్పటికే 5వేల మందికిపైగా అభిప్రాయాలు వెల్లడి
- ఉగాది నుంచి అమలుకు ప్రభుత్వం సన్నాహాలు

ఒంగోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం (పీ4) అమలును అందరి మనోభావాలకు అనుగుణంగా చేయాలని భావిస్తోంది. వివిధ వర్గాల ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటోంది. అందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించి తద్వారా 13 అంశాలపై అభిప్రాయాలను సేకరిస్తోంది. ఉగాది నుంచి పీ4 అమలు చేయాలన్న భావనతో ఉన్న ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని కుటుంబాల స్థితిగతులపై సర్వేని పూర్తిచేసిన విషయం విదితమే. గ్రామ సచివాలయం, వార్డు యూనిట్‌గా ఆ పరిధిలో కుటుంబాల ఆర్థిక పరిస్థితి, సామాజిక అంశాల ఆధారంగా అత్యంత పేదరిక జీవితం గడుపుతున్న 20శాతం కుటుంబాల అభివృద్ధే లక్ష్యంగా

మిగతా 6వ పేజీలో



పీ4 సర్వేను పరిశీలిస్తున్న సీపీవో వెంకటేశ్వర్లు (ఫైల్)



సర్వే చేస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు

అడ్డగోలు తవ్వకాలపై సర్వే

- నిబంధనలను ఉల్లంఘించినట్లు నిర్ధారణ
- ఉన్నతాధికారులకు నివేదిస్తామంటున్న అధికారులు

7

బ్యాగ్ కోసి 30 సవర్ల బంగారం చోరీ

- ఒంగోలులో ఘటన

6

బదిలీల టెన్షన్

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలో పంచాయతీరాజ్, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వారితోపాటు కొందరు ఏపీడీలు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. మిగిలిన 95శాతం మంది నిర్దిష్ట కాల పరిమితి (ఎఫ్‌టీఈ), అలాగే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. మూడొంతుల మంది దీర్ఘకాలంగా ఆయా పోస్టుల్లో పాతుకుపోయారు.

నాలుగేళ్లుగా బదిలీలు లేవు

నాలుగేళ్ల క్రితం ఒక స్థాయిలో బదిలీలు జరగ్గా అనంతరం లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కీలకమైన డ్వామా సిబ్బందిని బదిలీ చేయాలని టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అయితే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేవంటూ జిల్లాస్థాయిలో బదిలీలు నిర్వహించలేదు. దీంతో ఎక్కడి వారు అక్కడే పనిచేస్తున్నారు. కొంతమందిపై పెద్దఎత్తున అవినీతి, ఇతర ఆరోపణలు వస్తున్నప్పటికీ కొనసాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం డ్వామా ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 20లోపు జిల్లా పరిధిలో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ పలు మార్గదర్శకాలను ఇచ్చింది. ఆ ప్రకారం అన్ని స్థాయిల్లోని వారు మూడేళ్లు ఒకేచోట పనిచేస్తే వారిని బదిలీ చేయవచ్చు. అదే ఐదు సంవత్సరాలు ఒకేచోట పనిచేస్తుంటే తప్పనిసరిగా స్థాన చలనం కల్పించాలి.

ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఏపీడీలు..

క్లస్టర్ పర్యవేక్షకులైన అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ)లను పూర్వపు జిల్లా యూనిట్‌గా, మండల స్థాయి పర్యవేక్షకులుగా ఉండే ఏపీవోలను ప్రస్తుత జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయనున్నారు. ఇతర ఉద్యోగులను క్లస్టర్ స్థాయిలో, జిల్లా కార్యాలయంలో పనిచేసే వారిని ఐదేళ్లు దాటితే క్లస్టర్‌కు, మూడేళ్లు దాటితే అదే కార్యాలయంలో స్థానాల మార్పునకు అవకాశం ఇచ్చారు. ఏటా వందల కోట్ల రూపాయల ఉపాధి, మెటీరియల్ కోటా నిధులతో ఇతరత్రా పనులు డ్వామా పరిధిలో జరుగుతుండగా అక్రమార్జనకు అంతు లేకుండా పోయింది. స్థానికంగా రాజకీయ నాయకులలోనూ ఈ సంస్థ ఉద్యోగులకు అత్యంత ప్రాధాన్యం ఉంటోంది. దీంతో ఎవరికి వారు తమకు అనుకూల స్థానాలను ఎంపిక చేసుకొని కొనసాగుతుండగా ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన బదిలీ ఉత్తర్వులు, అందులోని మార్గదర్శకాలతో ఆయా ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు.

గత అక్రమాలపై చర్యలకు సిద్ధం

గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైసీపీ నేతల సూచనలకు అనుగుణంగా అప్పటి పీడీ శీనారెడ్డి ఇష్టారీతిన బదిలీలతోపాటు పెద్దసంఖ్యలో డిప్యుటేషన్లు వేశారు. పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా అలా చేసిన విషయాన్ని శీనారెడ్డి అక్రమాలపై విచారణ చేసిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు కమిటీ తన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించింది. దీంతో గతంలో వేసిన డిప్యుటేషన్లను రద్దుచేయడంతోపాటు అప్పట్లో ఇష్టారీతిన జరిగిన బదిలీలను పరిశీలించి ప్రస్తుత బదిలీల్లో జాగ్రత్తలు తీసుకోవాలని పీడీ జోసఫ్‌కుమార్ భావిస్తున్నట్లు సమాచారం. ఇదేసమయంలో లోకేశ్వరరావు కమిటీ ఇచ్చిన నివేదికపై చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ నివేదికపై దాదాపు నెలన్నర రోజులుగా పీడీ జోసఫ్‌కుమార్ నేతృత్వంలో డ్వామా కార్యాలయ సిబ్బంది పరిశీలన చేసి కొందరిపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు తెలిసింది. బదిలీల కన్నా ముందుగానే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొత్తం మీద డ్వామా ఉద్యోగులలో బదిలీల టెన్షన్ బాగతా కనిపిస్తోంది.

వైసీపీ కాలంలో డీసీసీబీలో భారీ దోపిడీ

(5వ పేజీ తరువాయి)

తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు. అందరూ తమ తమ ప్రాంతాల్లో జరిగిన అక్రమాలను సభలో ఏకరువు పెట్టారు. ఆ సందర్భంగా గుంటూరు డీసీసీబీతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని సహకార సంస్థల్లో అక్రమాలపై పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడారు. ప్రత్యేకంగా ప్రకాశం జిల్లా కేంద్ర బ్యాంకు అంశాలపై మాట్లాడారు. పీడీసీసీ బ్యాంకులో సుమారు రూ.11కోట్ల మేర జగనన్న పాల వెల్లువ పేరుతో రుణాలు ఇచ్చారన్న నరేంద్ర.. అమూల్ సంస్థ సేవ కోసం ఈ తరహా రుణాలు ఇవ్వగా వాటిని బినామీలు బొక్కేశారన్నారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా తిరిగి జమకాలేదని దీనికి నాటి ఉన్నతాధికారులు, వైసీపీ నాయకులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బ్యాంకులో జరిగిన అక్రమాలపై ఇటీవల కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి నివేదిక పంపారన్నారు. అందులో పాలవెల్లువ రుణాలతోపాటు జగనన్న తోడు పథకం కింద రూ.20 కోట్లు, ఫిష్ ఆంధ్ర, వ్యవసాయ యంత్ర పరికరాల పేరుతో భారీగా నిబంధనలకు విరుద్ధంగా రైతుల డబ్బును రుణాలుగా ఇచ్చి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆప్కాబ్ ఎండీ నుంచి జిల్లా బ్యాంకు, పీఏసీఎస్ సెక్రటరీల వరకు అందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొత్తం అంశంపై సహకారశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సమాధానం ఇస్తూ.. పీడీసీసీబీలో అక్రమాలపై చర్యలకు కలెక్టర్‌ను ఆదేశించామన్నారు.

మహిళా సమాఖ్య ఎన్నికల్లో అక్రమాలెన్నో..

(5వ పేజీ తరువాయి)

కాకపోయినా వారి స్థానంలో బినామీలను పెట్టి ఆమెకు ఓట్లు వేయించారు. ఈ విషయం రెండు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. హెచ్‌ఎంపాడు మండల సమాఖ్య అధ్యక్షురాలు మరియమ్మ, కనిగిరి మండల అధ్యక్షురాలు నాగలక్ష్మి, పుల్లలచెరువుకు చెందిన సంతోషమ్మ కార్యక్రమానికి హాజరు కాలేదు. కానీ ఈనెల 12వ తేదీ జరిగిన ఎన్నికల్లో ఈ ముగ్గురు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ విషయం ఆయా మండలాల అధ్యక్షుల ద్వారా తెలియడంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇదేవిధంగా ఇంకా పలు మండలాలకు చెందిన మహిళా సమాఖ్య అధ్యక్షులు రాకపోయినా బినామీలతోనే ఓట్లు వేయించినట్లు అనుమానిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే జిల్లా సమాఖ్య ఎన్నికల్లో వెలుగు అధికారులు చేసిన అక్రమాలు మరిన్ని వెలుగుచూసే అవకాశం ఉందని పొదుపు సంఘాల మహిళలు అంటున్నారు. ఈనెల 12న జరిగిన జిల్లా మహిళా సమాఖ్య ఎన్నికల్లో అధికారుల తీరును తప్పుబట్టి ఎక్కువమంది మహిళలు ఎన్నికల కార్యక్రమాన్ని బహిష్కరించి బయటకు వచ్చేశారు. అయినా అధికారులు పూర్తిస్థాయి కార్యవర్గం ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రకటించేశారు. ఈ తతంగం మొత్తాన్ని పరిశీలిస్తే ఎన్నికల విధుల్లో ఉన్న వెలుగు అధికారులు మహిళల్ని తప్పుదారి పట్టించి, అక్రమ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినట్లు తేటతెల్లమవుతోంది.

తిరునాళ్లకు బందోబస్తు

బల్లికురవ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో బుధవారం జరిగే రామలింగేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక బందో బస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. సోమవారం తిరునాళ్ల జరిగే రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద ఉన్న ప్రదేశాన్ని ఎస్ఐ పరిశీలించారు. ప్రభలు పెట్టే స్థలాన్ని మరియు అన్నదాన నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించి నిర్వాహక కమిటీకి పలు సూచనలు చేశారు. తిరునాళ్ల ప్రశాంతగా జరిగేలా గ్రామ పెద్దలు సహకరించాలని ఎస్ఐ వారికి సూచించారు.



ఈత సరదా సరే... ప్రమాదం జరిగితే...

విద్యార్థులు, చిన్నారులకు ఈత సరదా. కానీ అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశం ఉన్నా తల్లిదండ్రులు వదిలివేయడంపై విమర్శలు వస్తున్నాయి. అసలే వేసవి కాలం.. పైగా ఎండలు కాస్తున్నాయి. ఈ తరుణంలో అద్దంకి మండలంలోని శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువులో విద్యార్థులు, చిన్నారులు ఈత కొడుతున్నారు. ఇది చూడటానికి సరదాగా ఉన్నప్పటికీ నీరు లోతుగా ఉండడం, తూటు కాడ, తామర ఆకు ఎక్కువగా ఉండటంతో ఒకింత లోపలికి వెళితే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపోలేదు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకొని లోతైన వాగులు, చెరువులలో పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - అద్దంకి, ఆంధ్రజ్యోతి

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన

- పోలీస్ అధికారుల జోక్యం
- పరీక్షా కేంద్రానికి రవాణా చేసేందుకు అంగీకరించిన అధికారులు



మైలవరంలో ఆర్టీసీ బస్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

అద్దంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పరీక్షా కేంద్రం వద్దకు విద్యార్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసేందుకు నిరాకరించిన ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు బుధవారం నుంచి ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. అద్దంకి మండలంలోని మైలవరం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు బల్లికురవ మండలంలోని వైదనలో పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. అయితే ఆర్టీసీ అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదం డ్రులు పలు మార్లు సంప్రదించినా కనికరించలేదు. దీంతో సోమవారం ఆంధ్రజ్యోతిలో 10వ తరగతి విద్యార్థుల రవాణా కష్టాలు అనే కథనం ప్రచురితమైంది. అదే సమయంలో సోమవారం ఉదయం గ్రామంలోకి వచ్చిన ఆర్టీసీ బస్ ముందు విద్యార్థులు నిరసనకు దిగారు. అనంతరం ఆటోలలో విద్యార్థులు పరీక్షకు వెళ్లారు. బస్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగిన విషయాన్ని అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు దృష్టికి విద్యా కమిటీ చైర్మన్ కృష్ణమారుతి, టీడీపీ నేత దివికోలు రాధాకృష్ణమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకెళ్లారు. వెంటనే ఆర్టీసీ డీఎం రామ్మోహనరావుకు సీఐ సుబ్బారాజు ఫోన్ చేసి విద్యార్థులు పరీక్షకు వెళ్లే విధంగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తల్లిదండ్రులతో చర్చించిన డీఎం రామ్మోహన రావు బుధవారం నుంచి మిగిలిన 5 పరీక్షలు జరిగే రోజులలో బస్సును ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు.

చందలూరు పాఠశాల బస్ నిలిపివేత పిల్లల అవస్థలు

పంగులూరు : మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాల విదార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును అర్ధంతరంగా నిలిపి వేయడంతో పిల్లలు పాఠశాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని రేణంగివరం, అలవలపాడు, తూర్పు తక్కెళ్ళపాడు, కొప్పెరపాడు గ్రా మాల నుంచి చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు వచ్చే పిల్లల సౌకర్యం కోసం అద్దంకి డిపో వారు ప్రత్యేక బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్ సర్వీస్ సోమవారం అర్ధంతరంగా నిలిపి వేయడంతో పాఠశాలకు చేరుకునేందుకు ఆయా గ్రామాల పిల్లలు తీవ ఇబ్బందులు పడ్డారు. చందలూరు ఉన్నత పాఠశాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్ సర్వీస్‌ను కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు స్టడీ అవర్స్‌కు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా రాజగోపురం పంచ విమాన శిఖరాల ప్రతిష్ఠ

- వేదపండితుల ఆధ్వర్యంలో మహాకుంభాభిషేక మహోత్సవం
- భారీగా అన్నదానం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య భక్తి పారవశ్యంతో భక్తులు కనులారా తిలకిస్తుండగా సోమవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో రాజగోపురం పంచ విమాన శిఖరాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రీ త్రిపుర సుందరి సమేత శ్రీ త్రిపురాంతకస్వామి, భద్రకాళీసమేత వీరభద్రస్వామి దేవస్థానంలో జరిగిన రాజగోపురం ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామస్థుల పాటు గన్నవరం, బొబ్బేపల్లి గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వారి కార్యక్రమాన్ని తిలకించారు. గ్రామానికి చెందిన దాత రాటకొండ హనుమంతురావు, రాధిక దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన రాజగోపురం ఆలయానికి అందమైన కళను తీసు కువచ్చింది. తొలుత రాజగోపు రం ప్రతిష్ఠ కార్యక్రమం జరిగిన తర్వాత పైభాగా న ఏర్పాటుచేసిన పంచ విమాన శిఖరాల ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా పంచ విమాన శిఖరాలను భక్తులు దర్శించుకొని, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తగా ఏర్పాటు చేసిన రాజగోపురం వద్ద,ధ్వజ స్తంభం వద్ద మహిళలు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉదయాన్నే దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన హోమగుండంలో భక్తులు పలుపూజా ద్రవ్యాలను వేసి నమస్కరించుకున్నారు. అదేవిధం గా యజ్ఞయాగాదులు కార్యక్రమాన్ని ప్రత్యేక స్థలంలో నిర్వహించారు. తదుపరి ప్రతిష్ఠా చార్యులు మూలంరాజు రాజ్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో పలువురు వేద పండితులు ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకముల అ లంకరణ మహాపూర్ణాహుతి, దేవతా దర్శనములు కార్యక్రమాలను నిర్వహించారు. త్రిపురసుందరీ సమేత త్రిపురాంతకస్వామిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకొని స్వామి వారి ఆశీస్సులను పొందారు. అనంతరం భక్తులకు భారీగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది.



దేవస్థానం వద్ద దాత హనుమంతురావు దంపతుల సహకారంతో ఏర్పాటుచేసిన రాజగోపురం

ఘనంగా పాండురంగస్వామి దేవస్థాన వార్షికోత్సవం

మార్టూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పడమర బజారున పాండురంగస్వామి దేవస్థానం 10వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఉదయం దేవస్థానం ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పాండురంగస్వామి రుక్మాబాయి దంపతులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి శాంతి కల్యాణానికి పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు.స్వామి వారి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అమరావతిలో అమరజీవి విగ్రహ ఏర్పాటుపై హర్షం

మార్టూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై హర్షం ప్రకటించారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రికి చంద్రబాబుకు ఆర్య వైశ్య సంఘం, వాసవీ క్లబ్ వారు సోమవారం ప్రకటనలో అభినందనలు తెలిపారు.

ఎస్టీపీ నిర్మాణంపై పునఃపరిశీలన చేయాలి

చీరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 31 వార్డు శివారులో నిర్మిస్తున్న ఎస్టీపీ అంశంపై అధికారులు పునఃపరిశీలన చేయాలని పలువురు ప్రతినిధులు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును కోరారు. ఈసందర్భంగా విషయమై ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు, ఇతర నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో అంగనవాడీ కేంద్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం టీడీపీ నాయకులు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు తదితర వాటిని పం పిణీ చేశారు. కార్యక్రమంలో తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, ప్రభుదాస్, నరసయ్య, శేఖర్, పౌలు, బాజీ పాల్గొన్నారు.

నల్ల బర్లీ కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

రైతు సంఘం డిమాండ్

పంగులూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ కొనుగోలుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. నల్ల బర్లీ కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలసి ధర్నా నిర్వహించి తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లాడుతూ నల్ల బర్లీ కొనుగోలుకు ప్రభుత్వం కంపెనీవాళ్లతో మాట్లాడి కొనుగోలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బర్లీ పొగాకుకు ఇప్పటి వరకు ఒక విధానం లేదని, బర్లీ పొగాకును బోర్డు పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, ప్రతినిధులు మల్లారెడ్డి, ఆదుం సాహెబ్, తిరుపతయ్య, తలపనేని సబ్బారావు, నాయపాము ప్రభాకర్, రాఘవులు, దేవసాయం, కోటయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామంలో నూతన విద్యుత్ లైన్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

చీరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బలవన్మరణం చెందిన రొయ్యల కంపెనీ కార్మికురాలు కొర్రా లక్ష్మి (22) కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని పలువురు నాయకులు కోరారు. చీరాల ఏరియా వైద్యశాలలో సోమవారం మృతదేహానికి పోస్ట్‌మార్టం జరిగే క్రమంలో నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.బాబూరావు, కొండయ్య, వసంతరావు పాల్గొన్నారు.

ఎలా ముందుకెళ్దాం!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పీ4 విధానాన్ని తెచ్చింది. అలాంటి కుటుంబాల ఉపాధి, వృత్తి నైపుణ్యం, ఉద్యోగ అవకాశాలు మెరుగుకు ప్రభుత్వం తోడ్పాటుతోపాటు ఆ ప్రాంతంలోని ధనవంతులు, పారిశ్రామిక, వ్యాపారరంగాల పెద్దల సహకారంతో చర్యలు చేపట్టాలన్నది ప్రధాన ఉద్దేశం. అందుకోసం తొలిగా జిల్లాలవారీ సర్వే నిర్వహించారు. అలా జిల్లాలోనూ గత నెలాఖరులో యంత్రాంగం నిర్వహించింది.

వెబ్‌సైట్‌తోపాటు క్యూఆర్ కోడ్

జిల్లాలో అధికారిక అంచనా ప్రకారం మొత్తం 5,89,361 కుటుంబాలు ఉండగా 5,87,883 కుటుంబాల (99.73శాతం) సర్వే జరిగినట్లు యంత్రాంగం చెబుతోంది. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్వే పూర్తికాగా రెండో దశలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఒక వెబ్‌సైట్‌తోపాటు క్యూఆర్ కోడ్‌ను కూడా ఇచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖల ద్వారా ఆయా వర్గాల ప్రజలకు దీనిపై అవగాహన కల్పించి వారి ద్వారా మూడు రోజుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. అలా జిల్లాలో ఇప్పటివరకు సుమారు 5వేల మంది వివిధ వర్గాల ప్రజలు వెబ్‌సైట్ ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు సమాచారం. ఈనెల 25 వరకు ప్రభుత్వం ఇందుకు అవకాశం ఇవ్వగా ఈ వారంలో భారీగా ప్రజాభిప్రాయ సేకరణ చేసే వైపు యంత్రాంగం దృష్టి సారించారు. ప్రధానంగా పేదరికానికి మీ ప్రాంతంలో ప్రధాన కారణం. పేదరిక నిర్మూలనలో ప్రభుత్వానికి ఎదురవుతున్న ప్రతిబంధకాలు, కుటుంబం మెరుగైన భవిష్యత్‌కు ఏమి కోరుకుంటున్నారు? ఎలాంటి ఉపాధి అవకాశాలకు మీ ప్రాంతంలో అనుకూలంగా ఉంటుంది? ధనవంతులు-ఎన్ఆర్ఐలు ఇక్కడ ఎలా సహకారం అందించగలరు? దాతల సహకారానికి ఏ పేరు పెడితే బాగుంటుంది? అన్న అంశాలపై సలహాలు కోరడంతోపాటు వ్యక్తిగత సమాచారాన్ని కూడా తీసుకుంటున్నారు.

25లోపు పూర్తిచేయాలి

ఈనెల 30న ఉగాది సందర్భంగా రాష్ట్రంలో లాంఛనంగా పీ4 అమలు ప్రారంభించే యోచనలో ఉన్న ప్రభుత్వం ఈనెల 25లోపు సలహాల సేకరణ పూర్తిచేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పూర్తిచేసిన పీ4 కుటుంబ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం కమాండ్ కంట్రోలు సెంటర్‌కు నివేదించారు. వాటి ఆధారంగా గ్రామ, వార్డులలో అత్యంత వెనుకబడిన 20శాతం కుటుంబాల వివరాలను తిరిగి జిల్లా యంత్రాంగానికి అందుతాయి. వాటిని సచివాలయాల్లో ప్రచురించి లోటుపాట్ల సవరణ చేసేలా ప్రభుత్వం ఆదేశించింది. కాగా ప్రభుత్వం ఉదాత్త ఆశయంతో చేపట్టిన పీ4 అమలు మరింత మెరుగ్గా ఉండేందుకు ప్రజానీకం సలహాలు, సూచనలు వెబ్‌సైట్ ద్వారా ఇవ్వాలని జిల్లాలో ఈ కార్యక్రమ అమలు పర్యవేక్షణాధికారైన సీపీవో వెంకటేశ్వర్లు కోరారు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఆ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి అందులో ఉన్న అంశాలకు సమాధానం ఇస్తే సరిపోతుందన్నారు.

గంజాయి కేసులో నిందితుడు పరారీ

సింగరాయకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో అరెస్టయిన నిందితుడు ఎక్సైజ్ పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈ ఘటన స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం చోటుచేసుకుంది. పంచాయతీ పరిధిలోని చేపల మార్కెట్ వద్ద గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎక్సైజ్ సీఐ శివకుమారి సిబ్బందితో అక్కడికి వెళ్లారు. ఆసమయంలో అనుమానా స్పదంగా సంచరిస్తున్న బుంగబావి సెంటర్‌కు చెందిన ఆలా హరిశ్చంద్రప్రసాద్, బాలయోగినగర్‌కు చెందిన కోసూరి శివను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 100 గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకొన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. వారిని విచారించగా హరిశ్చంద్రప్రసాద్‌కు శివ గంజాయి ప్యాకెట్ అందజేసినట్లు తెలిసింది. శివ గంజాయిని గుజ్జల యలమందారెడ్డినగర్‌కు చెందిన ఒక మహిళ వద్ద కొనుగోలు చేసినట్లు తేలింది. నిందితుల్లో ఒకరైన శివ సోమవారం బాత్‌రూంకు అని చెప్పి స్టేషన్ నుంచి పరారయ్యాడు. దీంతో కంగుతిన్న ఎక్సైజ్ సిబ్బంది అతని కోసం వేట ప్రారంభించారు.

బ్యాగ్ కోసి 30 సవర్లు బంగారం చోరీ

ఒంగోలు క్రైం, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ వద్ద ఉన్న బ్యాగ్ కోసి సుమారుగా రూ.20 లక్షలు విలువైన సొత్తును (30 సవర్లు బంగారం ఆభరణాలు) దుండగులు అపహరించుకెళ్లారు. సోమవారం మంగమూరు రోడ్డులో ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఆరుద్ర కళ్యాణి చీమకుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లి తన చెల్లెలుతో కలిసి ఇంటికి తిరిగి వస్తున్నారు. కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద బస్సు దిగి ఇద్దరూ ఆటో ఎక్కారు. వారితోపాటు మరో ఇద్దరు గుర్తుతెలియని మహిళలు ఆటో ఎక్కారు. వారు ఇద్దరు హర్షిణీ కాలేజీ వద్ద దిగి వెళ్లారు. కళ్యాణి ఇంటికి వెళ్లి బ్యాగ్ చూసుకోగా బ్యాగ్ కట్ చేసి ఉంది. బంగారం ఉన్న ప్లాస్టిక్ సంచి కనిపించలేదు. ఈ మేరకు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

జాబ్ ఫెయిర్‌కు విశేష స్పందన

220 మంది హాజరుకాగా 55 మంది ఉద్యోగాలకు ఎంపిక

మార్టూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, హెచ్‌ఆర్‌కో సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ ఫెయిర్‌కు విశేషమైన స్పందన లభించింది. ఈ జాబ్‌ఫెయిర్‌కు 220 మంది యువతి యువకులు హాజరుకాగా వారిని హెచ్‌ఆర్‌కో కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. తదుపరి వారిలో 55 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమానికి తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉద్యోగాలను కల్పించేదిశగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారన్నారు. అందుకోసం ఆయన సొంతఖర్చులతో ఫౌండేషన్ ఏర్పాటుచేసి, దానికి అనుసంధానంగా మరో కంపెనీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకొని,యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఈ అవకావాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీనివాసరావు, శ్రీను, అడుసుమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోటీలు మనోధైర్యాన్ని నింపుతాయి

చీరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పోటీల్లో పాల్గొనడం వలన మనోధైర్యం పెరుగుతుందని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ అన్నారు. చీరాలకు చెందిన 20 మంది క్రీడాకారులు గత ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ జూనియర్, సీనియర్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. పోటీల్లో 10 జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొనగా చీరాల నుంచి పాల్గొన్న 20 మందిలో 13 మంది విజయ కేతనం ఎగుర వేశారు. ఈసందర్భంగా 4 స్వర్ణ పతకాలు, 5 రజితం, 4 కాంస్య పతకాలను సాధించారు. దీంతో సోమవారం కమిషనర్ కార్యాలయంలో వారిని ప్రత్యేకంగా అభినందించారు. పతకాలు సాధించిన వారు జూన్‌లో సౌత్‌జోన్ థైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్‌లు ఎస్‌డీ సలావుద్దీన్, వెంకట ప్రసాద్, ప్రశాంత్ పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

చినగంజాం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10గంటలకు ఉపాధీ హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. 1-4-2023 నుంచి 31-3-2024వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై 1-3-2025 నుంచి 14-3-2025 తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామ పంచాయతీ యందు తనిఖీ చేసినట్లు తెలిపారు. పనులపై సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై ప్రజా వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, ఉపాధిహామీ కూలీలు, స్వయం సహాయక సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.



ఒంగోలులోని రామ్‌నగర్‌లో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా



తొలిరోజు సజావుగా పది పరీక్షలు

● 98.3శాతం మంది విద్యార్థులు హాజరు

ఒంగోలు విద్య, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. 188 పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు సాగాయి. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగాయి. విద్యార్థులను గంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షకు 29637 మందికి గాను 29149 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతనే లోపలికి అనుమతించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా ప్రకటించడంతో సెల్‌ఫోన్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఏవీ సుబ్బారెడ్డి మద్దిపాడులోని రెండు కేంద్రాలు, ఒంగోలులోని పీవీఆర్ బాలుర, బాలికల హైస్కూలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. డీఈవో కిరణ్‌కుమార్ మద్దిపాడులో రెండు, ఒంగోలులో ఏడు కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులోని రామనగర్ మునిసిపల్ హైస్కూలు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు.

● ఎస్సీఈఆర్టీ మోడల్ పేపర్ నుంచి ప్రశ్నలు

ముందుగా అందరూ ఊహించినట్లుగానే ఎస్సీఈఆర్టీ మెటీరియల్ నుంచి సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 47 శాతం ప్రశ్నలు వచ్చాయి. ఈ ఏడాది ఎస్సీఈఆర్టీ వారు ఒక్కొక్క సబ్జెక్టులో మూడేసి మోడల్ టెస్ట్ పేపర్లు, 100 రోజుల కార్యాచరణ ప్రణాళికతో ప్రాక్టీస్ చేయించారు. ఆ తర్వాత గ్రాండ్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టారు. తెలుగు పరీక్షల్లో ఇచ్చిన మూడు మోడల్ టెస్టల నుంచి 47 మార్కులకు డైరెక్టు ప్రశ్నలు రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదవ తరగతి పరీక్షలు సోమవారం జరిగాయి. మొదటిరోజు హిందీ పరీక్షకు 19 మందికి 9 మంది హాజరయ్యారని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికి మత్తు డాక్టర్‌ను నియామించాలి

● నియోజకవర్గంలోని వైద్యశాలల్లో అభివృద్ధికి సహకరించాలని వినతి

● అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



కనిగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రధానంగా మత్తు డాక్టర్ నియమాకం చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కోరారు. అసెంబ్లీలో సోమవారం మరోసారి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కనిగిరి ప్రాంత సమస్యలపై ప్రస్తావిస్తూ ప్రభుత్వ వైద్యశాలల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కనిగిరి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ల కొరత వెంటాడుతోందన్నారు. గతంలో ఇదే ఆసుపత్రిలో 100కుపైగా సర్జరీలు జరిగేవని తెలిపారు. కానీ ప్రస్తుతం ఆపరేషన్ చేసేందుకు మత్తు డాక్టర్ అందుబాటులో లేరన్నారు. మత్తు డాక్టర్‌ను నియమిస్తే ఆపరేషన్‌లు చేసే వెసులుబాటు కలిగి పేదలకు మేలు చేకూరుతుందన్నారు. ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ గది శిథిలావస్థకు చేరుకుందన్నారు. మృతదేహాలను తరలించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటంగా ప్రారంభించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏమాత్రం ఉపయోగంగా లేకుండా పోయాయన్నారు.

● ఎమ్మెల్యే ఉగ్రకు మంత్రులు, స్పీకర్ ప్రశంసలు

కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో చేపట్టిన అభివృద్ధిపై అసెంబ్లీలో వైద్యశాఖామంత్రి సత్యకుమార్‌తో పాటు ఇతర మంత్రులు, స్పీకర్ రఘురామకృష్ణంరాజు ప్రశంసల జల్లు కురిపించారు. రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కడా లేని వివిధ విభాగాలను కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు ఆసుపత్రుల కంటే మిన్నగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అభినందనీయుడన్నారు. ఒకసారి తాను కూడా కనిగిరి ప్రభుత్వాసుపత్రిని సందర్శించి వస్తామని సమావేశంలో పేర్కొన్నారు. రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే విద్య, వైద్యరంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తే ప్రజల మన్ననలు పొందుతారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

'వైవీ' మాతృమూర్తి పిచ్చమ్మ కన్నుమూత

● నివాళులు అర్పించిన వైఎస్ విజయమ్మ, బాలినేని కుటుంబ సభ్యులు

● నేడు మేదరమెట్లలో అంత్యక్రియలు ● పాల్గొననున్న వైసీపీ అధినేత జగన్



తల్లి మృతదేహం వద్ద వైవీ, వైసీపీ నేతలు



పిచ్చమ్మ (ఫైల్)

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యుడు, ఒంగోలు మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ (85) అనారోగ్యంతో సోమవారం తెల్లవారు జామున కన్నుమూశారు. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న వైవీ సుబ్బారెడ్డి హుటాహుటిన ఒంగోలుకు చేరుకున్నారు. పిచ్చమ్మ మృతదేహానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ, మాజీమంత్రి, జనసేన పార్టీ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, యర్రగొండపాలెం శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబుతో పాటు జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నాయకులు నివాళి అర్పించి వైవీని పరామర్శించారు. పిచ్చమ్మ అంత్యక్రియలు వైవీ సుబ్బారెడ్డి స్వగ్రామమైన మేదరమెట్లలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్కడకు రానున్నారు.

'ఏఎన్ఎం'లకు పదోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు గ్రేడ్-2 బహుళార్థసాధక కార్యకర్త (మహిళ)లుగా పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతి కౌన్సెలింగ్‌కు 210 మంది హాజరు కాగా వారందరికీ పదోన్నతి కల్పించి వారికి స్థానాలు కూడా కేటాయించారు. ఆయా స్థానాలకు కేటాయించిన ఏఎన్ఎంలు వెంటనే విధులకు హాజరు కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

క్విస్ విద్యార్థుల షార్ట్‌ఫిల్మ్‌కు జాతీయ స్థాయి బహుమతి

ఒంగోలు విద్య, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆత్మహత్యల నివారణపై చిత్రీకరించిన సందేశాత్మక షార్ట్ ఫిలిమ్‌కు జాతీయ బహుమతి లభించింది. పద్మావతి మహిళా యూనివర్సిటీలో విరించి-2025 పేరుతో నిర్వహించిన ఫెస్ట్‌లో పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మాచవరపు జాషువా, డానియేలు, మన్నేపల్లి సుప్రియ, కోట్టె జాహ్నవి, కట్టా సృజన, పాతపాట రేష్మిత, గిరిజాలి మధులత చిత్రీకరించిన 'ఆత్మహత్యల నివారణ షార్ట్‌ఫిల్మ్'కు ప్రథమ బహుమతి లభించింది. డానియేల్ చేసిన స్టాండప్ కామిడి సైతం అందరినీ అలరించింది. మొదటి బహువతి సాధించిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ గాయత్రి అభినందించారు.



ప్రశంసాపత్రం, ప్రైజ్ అందుకుంటున్న విద్యార్థులు

నదిలో ఈతకెళ్లి విద్యార్థి మృతి



పవన్ కుమార్ (ఫైల్)

ముండ్లమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన కోడిగం రమేష్, దుర్గ దంపతుల పెద్ద కుమారుడు పవన్ కుమార్ (12) తన స్నేహితులతో సరదాగా ఈత కొట్టేందుకు విజయవాడలోని కృష్ణా నదిలోకి వెళ్లి మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. పవన్ కుమార్ విజయవాడలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. తన తాత గారి ఇంటి వద్ద నుంచి ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి వస్తుండేవాడు. ఒంటి పూట బడులు కావటంతో స్కూలు సమయం ముగిశాక స్నేహితులతో కలిసి కృష్ణా నది దగ్గరకు వచ్చి ముగ్గురు స్నేహితులు ఈత కొడుతున్నారు. దీంతో ఈతకు దిగిన ముగ్గురు విద్యార్థులు మునిగి పోతుండగా సమీపంలో ఉన్న కొంత మంది ఇద్దరిని బయటకు తీసి ఒడ్డుకు చేర్చారు. మూడో వ్యక్తి పవన్ కుమార్ మునిగి పోయాడు. దీంతో మిగతా విద్యార్థులు వెళ్లి పవన్ కుమార్ తాతకు చెప్పటంతో వారు వచ్చి చూసినా పవన్ కుమార్ కోసం తీవ్రంగా గాలించారు. మృతదేహం లభ్యమవడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

అడ్డగోలు తవ్వకాలపై సర్వే

● నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు జరిపినట్లు నిర్ధారణ ● ఉన్నతాధికారులకు నివేదిస్తామంటున్న అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

చీమకుర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 'అడ్డగోలు తవ్వకాలపై కన్నెర్ర' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా సోమవారం రంగంలోకి దిగారు. సర్వేనంబర్ 33/2లో ఎంతమేరకు తవ్వకాలు జరిపారు అనే విషయంపై సర్వే నిర్వహించారు. కాంట్రాక్ట్ సంస్థకు అనుమతి ఇచ్చిన నాలుగు హెక్టార్లలో హద్దులు నిర్ణయించి రాళ్లను ఏర్పాటు చేశారు. ఆ పరిధిలో మాత్రమే నిబంధనల మేరకు తవ్వకాలు జరపాలని కాంట్రాక్ట్ సంస్థకు తెలియచేశారు. 50 సెంట్ల పరిధిలో అనుమతికి మించి తవ్వకాలు జరిపినట్లు సర్వేలో గుర్తించినట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. సర్వేలో గుర్తించిన విషయాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తదనుగుణంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అదనంగా రవాణ చేసిన గ్రావెల్‌పై నిబంధనల మేరకు మైనింగ్ అధికారులు పెనాల్టీలు విధించనున్నారు. ఇక మీదట అనుమతికి మించి తవ్వకాలు జరపవద్దని హెచ్చరించారు.

గ్రామస్థులు మరోసారి ఆందోళన..

గ్రామస్థుల సమక్షంలో అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవలని కోరుతున్నా, తవ్వకాలను అడ్డుకుంటున్నా సంస్థ వైఖరిలో మాత్రం మార్పు లేకపోవటం పట్ల అధికారులను, సంస్థకు చెందిన ఉద్యోగులను ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా తవ్వకాలను ఆపకుండా నిరంతరం జరుపుతుండటం, అధికారుల మౌనముద్ర దాల్చడం ఏంటని ప్రశ్నించారు. కొండపై ఉన్న తాము ఎప్పటినుంచో ప్రార్థనలు చేసుకుంటున్నామని, ఇపుడు కొండను పిండి చేయటం వల్ల ప్రార్థనలు చేసుకోవటానికి వీలులేకుండా పోయిందని సదరు మతానికి చెందినవారు అధికారుల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమ ప్రార్థనలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గ్రావెల్ రోడ్డుగా.. పసుపుగల్లు నుంచి పాలెపుపాలెం వెళ్లే రహదారి



బొడ్డురాయి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం

చురుగ్గా అభివృద్ధి పనులు

● పసుపుగల్లులో రూ.30 లక్షల నిధులతో చిలకలేరు వాగు పై బ్రిడ్జి, మెటల్ రోడ్డు నిర్మాణం

● బొడ్డురాయి వీధిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం ● అదే వీధిలో ఇంటింటికీ కుళాయి

ముండ్లమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నాయి. దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి బాటలు వేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి సరైన రహదారి, చిలకలేరు వాగుపై ఉన్న నేలచప్టా వల్ల పాలెంపాలెం వెళ్లే రైతులు కష్టాలు పడుతూ వచ్చారు. ఇటీవల దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి దృష్టికి ఆ గ్రామ టీడీపీ యువ నాయకులు బిజ్జం వెంకట సుబ్బారెడ్డి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన లక్ష్మి జాతీయ ఉపాధి హామీ నిధులతో రూ.50 లక్షల మేర మంజూరు చేయించారు. దాదాపు కిలో మీటరు పొడవు గల రహదారిని మెటల్ రోడ్డుగా నిర్మాణం సాగుతోంది. చిలకలేరు వాగుపై ఉన్న నేలచప్టాను తొలగించి బ్రిడ్జిని నిర్మించే విధంగా ప్రతిపాదనలు తయారు చేసి మంజూరైన నిధులతో గతవారం పదిరోజుల నుంచి ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. గ్రామంలోని నాభిశిల వీధిలో ఎన్నో సంవత్సరాల నుంచి సరైన రహదారి లేక మురుగు నీరు అంతా ఇళ్ల ముందుకు వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.5 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇవికాక అదే వీధిలో పంచాయతీ గ్రాంటు నుంచి రూ 1.50 లక్షలతో ఇంటింటికి మంచి నీటి కుళాయి ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే రూ.30 లక్షలతో పసుపుగల్లు నుంచి చింతలపూడి వెళ్ళే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉపాధి హామీ పథకంతో మురుగు కాలువలు, రూ.5 లక్షలతో ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మించారు.

డ్రోన్ వినియోగంపై పోలీసు సిబ్బందికి అవగాహన



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో భాగంగా డ్రోన్‌ల వినియోగంపై ఎస్సైలతోపాటు, పోలీసు సిబ్బందికి సీఐ సోమశేఖర్ సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా, అసాంఘిక కార్యకలాపాల అదుపునకు డ్రోన్‌ను ఎలా వినియోగించాలన్న విషయాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, పొన్నలూరు ఎస్సై అనూక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

20లోపు స్కూలు గ్రాంట్లు వినియోగించాలి

ఒంగోలు విద్య, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని పాఠశాలలకు విడుదలైన స్కూలు గ్రాంట్లు, స్కూలు కాంప్లెక్స్‌లకు విడుదలైన సీఆర్‌సీ గ్రాంట్లను ఈనెల 20వ తేదీలోపు ఖర్చు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూలు గ్రాంట్లు, సీఆర్‌సీ గ్రాంట్లు ఇప్పటి వరకు డ్రా చేయని ప్రధానోపాధ్యాయులు ఈ వారంలో సీఎఫ్‌ఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా పీపీఏ జనరేట్ చేసుకొని బ్యాంకులో అందజేయాలని పేర్కొన్నారు. యాప్‌ద్వారా ఎస్టిమేషన్, ఖర్చు బిల్లులను తప్పనిసరిగా ఈనెల 20వ తేదీలోపు ఖర్చు చేయాలని, ఖర్చు చేయని నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

ఒంగోలు ప్రభుత్వ మహిళా కళాశాలకు ఏ గ్రేడ్

ఒంగోలు విద్య, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ మహిళా కళాశాలకు అకడమిక్ ఆడిట్‌లో ఏ గ్రేడ్ లభించిందని ప్రిన్సిపాల్ డి. కళ్యాణి తెలిపారు. బాపట్ల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు షేక్ అబ్దుల్ కలాం, కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు కె సుజాత అకడమిక్ ఆడిట్ అధికారులుగా కళాశాలలో జరుగుతున్న విద్యా వ్యవహారాలను ఆడిట్‌చేశారు. డిజిటల్ తరగతి గదులు, సెమినార్ హాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. కళాశాల విద్య కమిషనర్ మార్గదర్శకాల మేరకు అన్ని విషయాలలో ఆడిట్ నిర్వహించిన అధికారులు కళాశాలకు ఏ గ్రేడ్ ప్రదానం చేశారని కళ్యాణి తెలిపారు.

ఉపాధి పనుల సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలి

సంతనూతలపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గతేడాది జరిగిన ఉపాధి పనుల సమాచారాన్ని సిద్ధం చేసుకుని ఉంచుకోవాలని ఏపీడీ వెంకటస్వామి చెప్పారు. సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు అధ్యక్షతన ఉపాధిసిబ్బందితో ఉపాధిహామీపథకం ఏపీడీ వెంకటస్వామి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ త్వరలో మండలపరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక ద్వారా ఆయా గ్రామాల్లో చేసిన పనులపై వివరాలను వెల్లడిస్తామని, అవినీతి జరిగితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, ఏపీవో వాసంతి పాల్గొన్నారు.

కారుమంచి మేజర్ కెనాల్‌ను పునర్‌నిర్మించాలి

చీమకుర్తి, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల క్రితం ధ్వంసమైన కారుమంచి మేజర్ కాలువను వెంటనే పునర్‌నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం దెబ్బతిన్న కాలువను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ దెబ్బతిన్న కాలువను గాలికి వదలివేయటం వలన ఆయకట్టు కింద రైతులు, ప్రజలు రెండేళ్ల నుంచి నీటి కష్టాలు అనుభవించారన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి పనుల ప్రారంభించి వచ్చే సీజన్‌కు అందుబాటులో తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, రామారావు, చిన్నపురెడ్డి, ఓబులేషు, లక్ష్మీనారాయణ, శంకర్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న కాలువ వద్ద సీపీఎం నాయకులు

ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

38 మందికి అందజేసిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం కారుణ్య కోటాలో 38 మంది మందికి ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు ఉన్నారు.



ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

సహేతుకంగా అర్జీలను పరిష్కరించాలి

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సహేతుకంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేషు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయజ్యోతి, కుమార్ పాల్గొన్నారు.

23మందికి ల్యాప్‌టాప్‌లను అందజేసిన కలెక్టర్



ప్రతిభావంతులైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఏడీ అర్చన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెగ్యూలర్‌గా చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన(ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీ, పీజీ, ఆపైన) 23 మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ల్యాప్‌టాప్‌లను అందజేసి మాట్లాడారు. ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా 14 మందికి కృత్రిమ కాళ్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి జి.అర్చన ఉన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా సహాయ కార్యదర్శులు కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు చెప్పారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే సిద్ధయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న ఏడీఈ కార్యాలయాల వద్ద, 20న ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 24న కలెక్టర్‌కు, 27న సీఎండీకి సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, మధు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామ్ శ్రీనివాసరావు

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

సింగరాయకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని కేంద్రానికి 231 మంది విద్యార్థులను కేటాయించగా 231 మంది హాజరయ్యారు. మూలగుంటపాడు ప్రభుత్వ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి 219 మందిని కేటాయించగా 218 మంది,



సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు



మద్దిపాడులో తనిఖీ చేస్తున్న డీఈవో

గురుకుల పాఠశాలలో 240 మందిగాను 239 మంది, భాష్యం హైస్కూల్‌లో 152 మంది విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు కేంద్రాల్లో 843 మంది విద్యార్థులను కేటాయించగా 840 మంది హాజరైనట్లు ఎంఈవో కత్తి శ్రీనివాసులు తెలిపారు. తహసీల్దార్ రవి, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు.

కొండపిలో..

కొండపి : పదో తరగతి పరీక్షలు తొలిరోజైన సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కొండపిలో మొత్తం 539 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 532 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో-2 పి.రామారావు తెలిపారు.

మద్దిపాడులో...

మద్దిపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం స్థానిక కడియాల యానాదయ్య ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్, అబ్జర్వర్ సుబ్బారెడ్డి పరిశీలించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాన్ని మద్దిపాడు తహసీల్దార్ సృజన్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి ఎంవీఆర్ ఆంజనేయులు పరిశీలించారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 5 కేంద్రాల్లో సోమవారం పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. 95 శాతం విద్యార్థులు పరిక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్సై వి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు.

రాష్ట్రపతి ఇచ్చిన అల్పాహార విందులో ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చిన అల్పాహార విందులో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఇతర పార్లమెంట్ సభ్యులతో కలిసి మాగుంట ఈ విందులో పాల్గొన్నారు. అల్పాహార విందు అనంతరం కేంద్రమంత్రులు, పార్లమెంట్ సభ్యులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గ్రూపు ఫొటో దిగారు.

రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలి

ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి

ఒంగోలు రూరల్, మార్చి17(ఆంధ్రప్రదేశ్) : రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలను సత్వరమే పూర్తిచేయాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి కోరారు. సోమవారం ఎంపీ ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలలో మాట్లాడుతూ గుంటూరు డివిజన్‌లో 4, విజయవాడ డివిజన్‌లో 2 స్టేషన్‌లను అమృత్ భారత్ పథకం కింద వేగంగా పూర్తిచేయాలని కోరారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ కనిగిరి వరకు పూర్తయినందు వలన హైదరాబాద్ నుంచి డెమో రైళ్లను నడపాలని కోరారు. ఒంగోలు, దొనకొండ, మార్కాపురం, శ్రీశైలం నూతన రైలు మార్గాలను నిర్మించాలని కోరారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఎంపీ మాగుంట

అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయప్రదాత చంద్రబాబు

ఏపీ, తెలంగాణాలో టీడీపీ పాలనలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయప్రదాత అనగానే గుర్తొచ్చే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చెప్పారు. ఒంగోలులో తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనలో ఏపీ, తెలంగాణాల్లో మెరుగైన అభివృద్ధి జరిగిందన్నారు. శాసనసభలో ఎమ్మెల్యేగా చంద్రబాబు ప్రమాణాస్వీకారం చేసి నేటికి 47 సంవత్సరాలైందని గుర్తుచేశారు. చంద్రబాబు ఎమ్మెల్యేగా 41 ఏళ్లు, ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. పోలవరం, పట్టిసీమ, బనకచర్ల నదుల అనుసంధానకర్త చంద్రబాబు అని అన్నారు. 2014-19 టీడీపీ పాలనలో రూ.5లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేటట్టు చేసి, 5 లక్షల 13వేల మందికి ఉద్యోగాలను కల్పించారని, అన్ని రంగాల వారికి సమన్యాయం చేశారని చెప్పారు. అదేవిధంగా చంద్రబాబు హయాంలో డీఎస్సీల ద్వారా 1.80లక్షల మందికి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారని గుర్తుచేశారు.

నీటి కోసం.. కొంగ జపం



ఒంటికాలిపై చేపల కోసం ఎదురు చూడటం కొంగల సహజ లక్షణం. ఇపుడు వేసవి తీవ్రత పెరగడంతో కొంగలకు ఆహారం కన్నా నీటి అవసరం ఎక్కువగా పెరిగింది. దీంతో జలావాసాల వద్ద కొంగలు నీటి కోసం జపం చేస్తున్నాయి. కొండపి మండలంలోని నేతివారిపాలెం(ఇలవర)-కామేపల్లి మధ్య గురవాయికుంటలో నీరు అడుగున ఉంది. నీటి వనరులు పూర్తిగా అడుగంటడంతోపాటు, వేసవి ఎండల తీవ్రత పెరగడంతో నీరున్న చోటే కొంగలు చేరుతున్నాయని పశువుల కాపరులు చెప్పారు. మనుషులతోపాటు, పశుపక్ష్యాదులకు రానున్న రోజుల్లో నీటి ఎద్దడి మరింతగా ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉందని ఈ చిత్రం చెబుతోంది.

-కొండపి(ఆంధ్రజ్యోతి)

మీ కోసం కార్యక్రమంలో 85 ఫిర్యాదులు

అవీఇవీ



ప్రజలతో మాట్లాడుతున్నఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 85 మంది తమ వినతులను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిచాలని కోరారు. తమకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆరుగురు వద్ద రూ.22 లక్షలు తీసుకొని మోసం చేశారని, అపార్ట్‌మెంట్ అమ్ముతామని రూ.21 లక్షలు తీసుకొని ఓ వ్యక్తి మోసం చేశాడని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్ బాబు, సుధాకర్, పాండురంగారావు, ఎస్సైలు రజియాసుల్తాన్, మధుసూదనరావు కమలాకర్ పాల్గొన్నారు.

'అనాథలకు సేవ అత్యుత్తమం'



నగదును అందజేస్తున్న మధుసూదనరావు, కుటుంబసభ్యులు

ఒంగోలు కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : అనాథలకు సేవ చేయటం ఎంతో ఉత్తమమైనదని కొత్తపట్నం మండల తహసీల్దార్ పిన్నిక మధుసూదనరావు చెప్పారు. సోమవారం స్థానిక అన్నవరప్పాడు శివం శరణాలయంలో శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధుసూదనరావు పుట్టిన రోజు వేడుకల కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా శరణాలయంలోని అనాథ వృద్ధులకు మధుసూదనరావు నూతన వస్త్రాలను, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచర్ల మండలానికి చెందిన పందరబోయిన పోలురాజు, సంతమాగులూరుకి చెందిన యశోధర్‌లకు రూ.5 వేల చొప్పున అందజేశారు. అనంతరం నగరంలోని 300 మంది అనాథలు, యాచకులకు సంచార వాహనం ద్వారా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మోటుపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేస్‌లో ముగిసిన వర్క్‌షాపు



వర్క్‌షాపులో అతిథులతో విద్యార్థులు

ఒంగోలు విద్య, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ ద్వితీయ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు పీసీబీ డిజైన్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాపు సోమవారం ముగిసింది. నెల్లూరు ఎస్‌వీ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ బి. వెంకటసుమంత్ ఈ వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. పీసీబీ డిజైన్‌కు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, మద్దిశెట్టి కళ్యాణ్, ఈఈఈ విభాగాధిపతి బి. నాగరాజు, కో ఆర్డినేటర్ బి. విజయ్‌చంద్ర పాల్గొన్నారు.

డీపీఎంవోగా బాధ్యతలు స్వీకరించిన సౌజన్య



డీపీఎంవో సౌజన్యను అభినందిస్తున్న వైద్యాధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డీపీఎంవోగా డాక్టర్ సౌజన్య బాధ్యతలు స్వీకరించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న సౌజన్యను డీపీఎంవోగా నియమిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబ ఆరోగ్య శాఖ ఇచ్చిన ఉత్తర్వులు మేరకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సౌజన్యను పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

వక్తృత్వ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సమీరా

ఒంగోలు కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కలాం ప్రకాశం ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో నిర్వహించిన వక్తృత్వ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం సోమవారం జరిగింది. బహుమతి ప్రదాన సభకు క్లబ్ ఫౌండర్ డాక్టర్ షాకీర్ అధ్యక్షత వహించగా జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు డాక్టర్ సమీరా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదటి బహుమతిని డి.లోహిత, పి.పూజ మాధురిలు, రెండవ బహుమతి ఎన్.వంశీకృష్ణ, మూడవ బహుమతిని ఎం.సురేష్ కృష్ణ, ఆర్.నితిన్ రాజ్ రెడ్డిలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.మహేష్, ప్రిన్సిపల్ డాక్టర్ కే.నటరాజ్ కుమార్, విశ్రాంత పోలీసు అధికారి సుంకర సాయిబాబా, మహంకాళి వెంకట శేషయ్య, క్లబ్ ప్రెసిడెంట్ చిట్టిబాబు, ట్రెజరర్ దాసరి కరుణాకర్, ముజీబ్ పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.280

సంతనూతలపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు చిలంకూరు క్లస్టర్ నుంచి 207 పొగాకు బేళ్లు రాగా 134 బేళ్లు అమ్ముడైనట్లు, 73 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ట ధర కేజీ రూ.280లు, కనిష్ట ధర రూ.260లు పలికినట్లు చెప్పారు. సరాసరి ధర రూ.274.95 వచ్చిందన్నారు. కొనుగోలు 11 కంపెనీల ప్రతినిధులతోపాటు రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● సబ్‌కలెక్టర్‌కు ఆ సంఘం నేతల వినతి



నిరసన వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మార్కాపురం రూరల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి). విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి కమిషనర్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈహెచ్ఎస్ కార్డుపై వైద్యం చేయించుకోవాలంటే వైద్యశాలలు ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. నగదు రహిత వైద్యం చేయాలని కోరారు. గత పీఆర్‌సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పూర్వపద్ధతిలో కొనసాగించాలన్నారు. 70 సంవత్సరాలకు 10 శాతం 75 సంవత్సరాలకు 15 శాతంగా పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఇమ్మడిశెట్టి బాల సుబ్బారావు, పాలెం చెంచయ్య, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి నిరసన

గిద్దలూరు : ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 2023 జూలై 1వ తేదీ నుంచి పీఆర్‌సీ కమీషన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇంతవరకు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. తమకు రావలసిన డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ బకాయి తీసుకోకుండానే చాలామంది విశ్రాంత ఉద్యోగులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత పీఆర్‌సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ పించన్‌ను పూర్వ పద్ధతిలోనికి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ కార్డుపై నగదు రహిత వైద్యం అందేలా చూడాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు.

కల్వర్టు సమస్యను పరిష్కరించాలి

గిద్దలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కల్వర్టు సమస్య పరిష్కరించాలని పట్టణంలోని అర్బన్ కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో నిర్మించిన కల్వర్టులు మట్టిరోడ్డు కంటే రెండు అడుగుల ఎత్తులో ఉండడంతో రాకపోకలకు తీవ్రఇబ్బందిగా మారిందని కాలనీవాసులు కల్వర్టు ఎదుట నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. రెండు అడుగుల ఎత్తులో కల్వర్టు నిర్మించడంతో మినరల్ వాటర్ ఆటోలు, పాలబండ్లు కూడా రావడం లేదని, వృద్ధులు, చిన్నారులు కొండలాగా ఉన్న కల్వర్టు ఎక్కిదిగే సమయంలో కిందపడి గాయాలపాలు అవుతున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళ మెడలోని చైన్ అపహరణ

● దోర్నాలలో చైన్‌స్నాచర్ హల్‌చల్

పెద్దదోర్నాల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వీధిలో పట్టపగలే గుర్తు తెలియని దుండగుడు మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన ఉదంతం స్థానిక వెచ్చా వెంకటసుబ్బయ్య నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీవీఎస్‌నగర్‌లో చీదెళ్ల స్వాతి మధ్యాహ్నం 3.10గంటలకు ఇంటి బయట నిలబడి పక్కింటి మహిళతో మాట్లాడుతోంది. ఎండసమయంలో పెద్దగా జనసంచారం లేకపోవడాన్ని అదునుగా భావించిన దుండగుడు వీధిలో నడుస్తూ వచ్చి మహిళ మెడలోని బంగారు గొలుసు బలవంతంగా లాక్కుని పరుగు తీశాడు. పథకం ప్రకారం మరొక వ్యక్తి పక్కవీధిలో ఒకరు మోటారు సైకిలును స్టార్టు చేసి సిద్ధంగా ఉన్నాడు. ఆ బైక్ ఎక్కి పరారయ్యారు. ఆ మహిళ ఆ ఘటన నుంచి తేరుకొని కేకలు వేసే సమయానికి వారు మాయమయ్యారు. వెంటనే పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. నాలుగు తులాల బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లినట్లు బాధిత మహిళ స్వాతి తెలిపింది. ఎస్సై మహేశ్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సీసీ ఫుటేజీలు పరిశీలించగా ముఖం కనిపించకుండా టోపీ ధరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ ఘటనతో మహిళలు భయాందోళనలు చెందుతున్నారు.


దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఏడీ అర్చన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెగ్యులర్‌గా చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన(ఐటీఐ, ప్రొఫెసనల్ కోర్సులు, డిగ్రీ, పీజీ, ఆపైన) 23 మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ల్యాప్‌టాప్‌లను అందజేసి మాట్లాడారు. ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా 14 మందికి కృత్రిమ కాళ్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి జి.అర్చన ఉన్నారు.

మీ కోసం కార్యక్రమంలో 85 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 85 మంది తమ వినతులను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిచాలని కోరారు. తమకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆరుగురు వద్ద రూ.22 లక్షలు తీసుకొని మోసం చేశారని, అపార్ట్‌మెంట్ అమ్ముతామని రూ.21 లక్షలు తీసుకొని ఓ వ్యక్తి మోసం చేశాడని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్ బాబు, సుధాకర్, పాండు రంగారావు, ఎస్సైలు రజియాసుల్తాన్, మధుసూదనరావు కమలాకర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

● పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు ● పరీక్షలను పర్యవేక్షించిన విద్యాశాఖ అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలు మార్కాపురంలో సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో వివేకానంద, శ్రీచైతన్య, భాష్యం, నారాయణ, ఓంసాయి వికాస్, సాయిబాలాజీ, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్‌సీటీసీ కాలనీలలోని పాఠశాలలు, గజ్జలకొండ, రాయవరం, సోషల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ పాఠశాలలో మొత్తం 14 కేంద్రాల్లో 2146మంది విద్యార్థులకు గాను 2118 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు.

● పెద్దారవీడు : మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలలో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పెద్దారవీడు, దేవరాజుగట్టు, వై.డి.పాడు, ఓబులక్కపల్లిలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 589 మంది విద్యార్థులకు గాను 585 మంది పరీక్షలకు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎంఈవోలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. ఎస్సై అనిల్‌కుమార్ భద్రతను పర్యవేక్షించారు.

● త్రిపురాంతకం : మండలంలోని ఐదు కేంద్రాలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కాగా త్రిపురాంతకం-ఏ కేంద్రంలో 208 మంది విద్యార్థులకుగాను 207 మంది విద్యార్థులు, బి కేంద్రంలో 124 కి, 122 మంది హాజరయ్యారు. గణపవరంలో 150 కి 148 మంది, మేడపిలో 137 కి 137 మంది, దూపాడులో 156 కి 156 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో మల్లికార్జుననాయక్ తెలిపారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● ఎర్రగొండపాలెం రూరల్: పదోతరగతి పరీక్షలు సందర్భంగా ఎర్రగొండపాలెంలోని 8 పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 899 మంది విద్యార్థులకు గాను 888 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాసినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు.

● కంభం : సోమవారం నుంచి ప్రారంభమైన పదోతరగతి తరగతి పబ్లిక్ పరీక్షల్లో కంభం మండలంలోని ఏడు కేంద్రాలలో 1185 మందికి గాను 1178 మంది హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.



కంభంలో పోలీసుల బందోబస్తు,

● గిద్దలూరు టౌన్ : పదోతరగతి పరీక్షలు సోమవారం గిద్దలూరు ప్రాంతంలో ప్రశాంతం గా ప్రారంభమయ్యాయి. గిద్దలూరు ప్రాంతంలో మొత్తం 9 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా 1216 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. వీరిలో 1193 మంది విద్యార్థులు హాజరుకాగా, 23 మంది గైరుహాజరయ్యారు. టంగుటూరు మండల విద్యాశాఖాధికారి-2 బాలాజీ స్క్వాడ్ అధికారిగా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ అధికారులకు సూచనలు చేశారు.

● దోర్నాలలోని మూడు పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం విద్యార్థులు 585 మందికి గానూ 581 మంది హాజరయినట్లు ఎంఈవో మస్తాన్ నాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మార్కాపురంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



వై.పాలెంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

పరీక్షా కేంద్రంలోకి అట్టల నిరాకరణ

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద పదో తరగతి పరీక్షల సందర్భంగా సోమవారం కొద్దిపాటి ఆందోళన నెలకొంది. పాఠశాల హెచ్ఎం, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శ్రీదేవి పరీక్షా కేంద్రంలోనికి విద్యార్థులను అట్టలను అనుమతించలేదు. దీంతో హెచ్ఎం తీరు వివాదాస్పదంగా మారింది. పరీక్షలకు ప్యాడ్‌లను అనుమతించకపోవటంతో తల్లిదండ్రులు, బంధువులు పరీక్షాకేంద్రం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. విలేకర్లకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. వారు స్పందించక పోవడంతో ఎంఈఓ రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన జోక్యం చేసుకుని విద్యార్థులు పరీక్ష అట్టలు తీసుకెళ్లేలా అనుమతించారు. దీంతో సమస్య పరిష్కారం అయ్యింది. అయితే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

ఇన్‌చార్జుల పాలన ఇంకెన్నాళ్లు?

నాలుగు నెలలు క్రితం సెలవుపై రెగ్యూలర్ తహసీల్దార్

పుల్లలచెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కీలక శాఖ అయిన రెవెన్యూ శాఖ ఇన్‌చార్జ్ ఎలుబడిలోనే కొనసాగుతోంది. రెగ్యులర్ తహసీల్దార్ లేక ప్రజలకు రెవెన్యూ సేవలు అందడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నవంబరు నెలలో తహసీల్దార్ గా ఉన్న నయిమ్ అహ్మద్ సెలవుపై వెళ్లారు. ఆ తరువాత ఇన్ చార్జ్ బాధ్యతలు తీసుకున్న ఎర్రగొండపాలెం తహసీల్దార్ బాలకిషోర్ ఓ భూ కుంభకోణంలో ఇరుక్కొని సస్పెండ్ అయ్యారు. దీంతో అధికారులు మార్కాపురం తహసీల్దారును ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన అందుబాటులో ఉండడం లేదు. మార్కాపురం నుంచి పుల్లలచెరువుకు సూమారు 60 కిలోమీటర్ల దూరం ఉంది. అయితే మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉండటంతో పుల్లలచెరువు కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యలు చెప్పుకోనేందుకు తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిరుత్సాహంతో వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టరు స్పందించి తక్షణమే రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయం



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

ఆర్‌ఎస్ఎస్ వార్షికోత్సవం

గిద్దలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన ఆశ్రమం ఆవరణలో ఆర్‌ఎస్ఎస్‌శాఖ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 100 మందికి పైగా స్వయంసేవక్‌లు ఈకార్యక్రమంలో పాల్గొని వ్యాయామం, యోగా, ఆసనాలు ప్రదర్శించారు. ఆర్‌ఎస్ఎస్ జిల్లా కార్యవర్గసభ్యులు పానుగంటి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సంఘం పుట్టుక, నిర్మాణం, ప్రస్తుత స్థితి గురించి వివరించారు. రోజుకో గంట సమయం వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్ ఖండకార్యాహక్ శివమల్లారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత



నిత్యావసర వస్తువులను అందిస్తున్న దాతలు

గిద్దలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక దివ్యాంగులకు ప్రత్యేక పాఠశాలకు యువప్రగతిపథం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వేణుగోపాల్, సంస్థ ప్రతినిధులతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలి

గిద్దలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సోమయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య అధ్యయన యాత్రలో భాగంగా సీపీఎం నాయకులు గిద్దలూరులో జీపు జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ వెనుకబడిన మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే మార్కాపురం కేంద్రంగా కొత్తజిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. మార్కాపురంలో జరుగుతున్న మెడికల్ కళాశాలను ప్రభుత్వరంగంలోనే నిర్మించాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తే తాగు, సాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న మార్కాపురం ఆర్‌డీవో కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఫీ, ఆవులయ్య, అన్వర్, థామస్, తదితరులు పాల్గొన్నారు.

రూ.1500కోట్లు కేటాయించాలి

మార్కాపురం వన్‌టౌన్ : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కోసం ఈ బడ్జెట్‌లోనే రూ.1500 కోట్లకు పైగా నిధులు కేటాయించా లని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య అన్నారు. సీపీఎం ప్రజా చైతన్య జీపుయాత్ర ప్రచారంలో భాగంగా పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన యాత్రలో మాట్లాడుతూ.. వెలిగొండకు రూ.359 కోట్ల స్వల్పమైన నిధులు కేటాయించడం సరికాదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈ విషయంపై అసెంబ్లీలో పెదవి విప్పాలన్నారు. మెడికల్ కళాశాలను నిర్మించాలని మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ నెల 20న సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసనలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డీకేఎం రఫీ, రూబెన్, కొండయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.



గిద్దలూరులో కరపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముగిసిన ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసాధన డిగ్రీ కళాశాలలో ఔషధ తయారీ సంస్థ హెటిరో ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూధన్ మాట్లాడుతూ.. ఉద్యోగార్థులకు నేరుగా ముఖాముఖి నిర్వహించి 19మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి సమీర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, డాక్టర్ శేషుకుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.280

సంతనూతలపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు చిలంకూరు క్లస్టర్ నుంచి 207 పొగాకు బేళ్లు రాగా 134 బేళ్లు అమ్ముడైనట్లు, 73 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ట ధర కేజీ రూ.280లు, కనిష్ట ధర రూ.260లు పలికినట్లు చెప్పారు. సరాసరి ధర రూ.274.95 వచ్చిందన్నారు. కొనుగోలు 11 కంపెనీల ప్రతినిధులతోపాటు రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దీపం-2 పథకానికి సాంకేతిక సమస్యలు

● అర్హులలో కొంత మందికి జమకాని దీపం-2 నగదు ● మొదటి సిలిండర్ బుకింగ్‌కు ఈనెలాఖరు వరకు అవకాశం

గిద్దలూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడాదికి 3 వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించే దీపం-2 పథకానికి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. గత ఏడాది నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం ఈపథకాన్ని ప్రారంభించింది. అర్హులైన వినియోగదారుడు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని నగదు చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తంలో కేంద్రప్రభుత్వం ఇస్తున్న రాయితీ మినహాయించి మిగిలిన మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం వినియోగదారుని బ్యాంక్ ఖాతాకు జమచేస్తుంది. ఈ విధంగా ఇప్పటికే సిలిండర్ బుకింగ్ చేసుకున్న చాలా మందికి సిలిండర్ అందిన వారంరోజుల్లో బ్యాంక్ ఖాతాకు నగదు జమ అయింది. అయితే పలువురు వినియోగదారుల ఖాతాల్లో మాత్రం నగదు జమ కాలేదని పేర్కొంటున్నారు. ఇలాంటి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం టోల్‌ఫ్రీ నెంబరు 1967 అందుబాటులోకి తెచ్చింది. ఆ నెంబరుకు ఫోన్ చేస్తే సమాధానం ఉండడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

నగదు జమ కాకపోవడానికి కారణాలు ఇవే

లబ్ధిదారునికి 2, 3 బ్యాంక్ ఖాతాలు ఉండడం, బ్యాంక్ ఖాతాతో ఆధార్‌సంఖ్య అనుసంధానం కాకపోవడం, గ్యాస్ కనెక్షన్‌కు ఇచ్చిన ఖాతా నెంబరుతో లబ్ధిదారుని ఈకేవైసీ పూర్తికాకపోవడం, గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరుతో ఉండగా మరొకరు వినియోగిస్తుంటే కనెక్షన్ ఉన్న వారికి నగదు జమ అవుతుంది. లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతా మనుగడలో లేకపోవడం, గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా రేషన్‌కార్డులు ఇచ్చారు. ఆ కార్డులపై ఆరు అరెరల తనిఖీ చేపట్టి కొందరిని అనర్హులుగా గుర్తించారు. ఇలాంటి వారికి గ్యాస్ నగదు జమ కావడం లేదు. గ్యాస్ రాయితీ జమ కాని వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటుంది. దీనికి కారణంగా 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లు ఉందని, 6 నెలల విద్యుత్ వినియోగం 1800 యూనిట్లు దాటిందని, 4 చక్రాల వాహనం ఉందని, గ్యాస్ కనెక్షన్‌తో ఆధార్ సంఖ్య అనుసంధానం కాలేదని, ఇలాంటి కారణాలతో నగదు జమకాని వారు ఆందోళన చెందుతున్నారు.

పుచ్చకాయలతో కూల్.. కూల్..

● కొనుగోలుదారులతో కిటకిట



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

కంభం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం ప్రారంభం అయ్యిందంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చే ఫలాలలో పుచ్చకాయలే ప్రధానమైనవి. ప్రధాన కూడళ్లు, రోడ్ల వెంబడి పుచ్చకాయల దుకాణాలు ఎక్కువగా దర్శనమిస్తాయి. మధురంగా ఉండే పుచ్చకాయలో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించగల సామర్థ్యం ఉంది. దీంతో ఎక్కువ మంది వీటిని తింటుంటారు. వేసవిలో ఎండతీవ్రత తట్టుకోలేక ఒంటికి చలువచేసే పానియాలు, పండ్లను తీసుకోవడం మామూలే. ప్రజలు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలను విరివిగా కొంటున్నారు. పుచ్చకాయలు రూ.100 నుంచి రూ.200 వరకు ధరలు పలుకుతున్నాయి. ముక్కలుగా చేస్తే రూ.15 రూపాయలకు అమ్ముతున్నారు. ఎండలు ఇంకా పెరిగితే ధరలు పెరిగే అవకాశం ఉంది. శరీరానికి చలువనిచ్చే పుచ్చకాయ ఎంతో మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొనకనమిట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. బ్రహోత్సవాలలో భాగంగా పాల్గుణ బహుళ తదియ సోమవారం సింహవాహనంపై శ్రీలక్ష్మి అలివేలుమంగ సమేతంగా స్వామి వారిని ఊరేగించారు. తొలుత స్వామివార్లను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణలతో స్వామివారు. సింహవాహనంపై కొలువుదీరారు. సింహవాహనంపై మంగళవాయిద్యాల నడుమ వెలిగొండ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు స్వామివారు అభయహస్తం చూపిస్తూ ముందుకు కదిలారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



శ్రీలక్ష్మి అలవేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి

వైభవంగా ఉగ్రనరశింహస్వామి తిరునాళ్ల

త్రిపురాంతకం : మండలంలోని గుట్ల ఉమ్మడివరంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి తిరునాళ్ల సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేదపండితులు వడ్లమాను ఆత్మానందకుమార్, అవంచ శివకుమార్ అవధానిల ఆధ్వర్యంలో గణపతిపూజ, స్వామి వారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.




ఉగ్రనరసింహునికి పూజలు చేస్తున్న అర్చకులు

ముఖాముఖి

నెలాఖరు వరకే సాగర్ జలాలు

బి.పూర్ణచంద్ర, డీఈ, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలోని మోదేపల్లి మేజరుకు ఎప్పటి వరకు సాగర్ జలాలు సరఫరా చేస్తున్నారు?

జవాబు: మోదేపల్లి మేజరుకు ఈ నెలాఖరు వరకు నీటిని సరఫరా చేస్తున్నాం.

ప్ర: చివరి భూములకు నీరందుతుందా?

జ: వారా బందీ విధానంతో చివరి భూములకు సైతం నీరందుతుంది.

ప్ర: శిథిలావస్థకు చేరిన కల్వర్టులను మరమ్మతులు చేయిస్తున్నారా?

జ: మేజరు పరిధిలో శిథిలాస్థకు చేరిన అయోధ్య నగర్, ఈదర మధ్య ఉన్న బ్రిడ్జి, వేముల వద్ద కల్వర్టు, పలు డ్రాపుల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

ప్ర: మైనర్ కాలువల్లో చిల్ల చెట్లను తొలగిస్తున్నారా?

జ: మేజరు పరిధిలోని మైనర్ కాలువల్లో దట్టంగా చిల్లచెట్లు పెరిగిపోయాయి. ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాం. మెయింటెన్స్ కింద చిల్ల చెట్లు తొలగించి చివరి భూములకు నీరు అందిస్తాం.

ప్ర: మండలంలో లస్కర్ల కొరత ఉందా?

జ: లస్కర్ల కొరత ఉంది. ఇటీవల 14 మందిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. అనుమతి రాగానే వారిని నియమించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

కురిచేడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదనంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. స్వామివారికి పంచామృత అభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీరించారు. ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటుచేసింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్వామివారిని దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేశారు.

గంగదేవిపల్లిలో..

దొనకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల తిరునాళ్ల సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మొక్కుబడులు ఉన్నవారు దేవాలయం సన్నిధిలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటుచేశారు. తిరునాళ్ల సందర్భంగా మంగళవారం ఉదయం ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

దొనకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగుడిపాడులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. 20 రోజులుగా సాగర్ నీరు సరఫరా కావడంలేదన్నారు. సోమవారం గ్రామంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

నారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 31వేలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానం ఆదివారం భక్తులు సమర్పించిన కానుకుల హుండీ ఆదాయం రూ.1,31,612 వచ్చినట్టు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.26,790, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,830, శాశ్వత అన్నదానానికి విరాళాల ద్వారా రూ.42,992, స్వామివారికి శ్రీపాద కానుకగా చెల్లించిన రూ.9 వేలు, శాశ్వత అన్నదాన పథకానికి సీఎస్‌పురం మండలం డీజీ పేట గ్రామానికి చెందిన మిరికేల ఆదినారాయణ, కుమారి దంపతులు రూ. 10,116 విరాళంగా అందజేశారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

▸ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు ▸ ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

కనిగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. కనిగిరి మండలంలో 1424 మందికిగాను ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీటి వసతితో పాటు విద్యార్థులు అనారోగ్యానికి గురైతే అందుబాటులో వైద్య సిబ్బందిని ఉంచారు. నియోజకవర్గంలోని పలు కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించారు. కనిగిరి మండలంలోని పరీక్షా కేంద్రాలను ఎంఈవో రమణయ్య పరిశీలించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ టి.శ్రీరాం సిబ్బందితో వివిధ పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు సిబ్బందిని నియమించారు. డ్రోన్ కెమెరాలతో పరీక్షా కేంద్రాల ప్రాంగణాలను పరిశీలించారు.

దర్శిలో.. దర్శి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): దర్శిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 12 కేంద్రాల్లో 1698 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 420 మంది ఓపెన్ పరీక్షలు రాస్తున్నారు. దర్శిలో పదో తరగతి, ఓపెన్ పరీక్షలు రాసేందుకు ఇతర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. జిల్లాలో అత్యధికంగా ఓపెన్ పరీక్షలకు దర్శిలో ఆరు కేంద్రాలు కేటాయించారు. కాపీయింగ్ నివారించేందుకు రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్న సెంటర్లలోనే ఓపెన్ పరీక్షలు రాసే విద్యార్థులకు గదులు కేటాయించారు. గతంలో ఓపెన్ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత కొత్త విధానం అమలుచేసింది. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షల్లోనూ ఇదే విధానాన్ని అవలంబించారు.

దొనకొండలో.. దొనకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దొనకొండలోని రెండు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 11 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు వ్రాసే విద్యార్థులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా ఎంఈవో సాంబశివరావు పర్యవేక్షణలో అన్నిసౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఎస్సై త్యాగరాజు ఎటువంటి సంఘటనలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.



కనిగిరిలోని పరీక్షా కేంద్రం వద్ద కేటాయించిన గది నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు



కనిగిరి: పరీక్షా కేంద్రం ప్రాంగణాన్ని డ్రోన్ కెమెరాతో పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీరాం



ముండ్లమూరు: పరీక్షా కేంద్రం వద్ద వేచిఉన్న విద్యార్థులు

పామూరులో.. పామూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పామూరులో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పామూరులో నాలుగు కేంద్రాలు, బొట్లగూడూరులో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. తొలిరోజు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల నుంచి వంద మీటర్లలోపు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపారు. మండలంలో 767 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని రెండు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఏపీ మోడల్ స్కూల్‌లో 260 మంది విద్యార్థులకు గాను ఐదుగురు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 212 మందికిగాను ఇద్దరు గైర్హాజరయ్యారు. తొలిరోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి.

పీసీపల్లిలో.. పీసీపల్లి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లిలోని మూడు కేంద్రాల్లో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో తొలిరోజు సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఉన్న ఆరు జడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థినులతో పాటు కనిగిరి మండలం ఏరువారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలకు హాజరవుతున్నారు. మొత్తం 374మంది విద్యార్థులకుగాను తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు అందరూ హాజరయ్యారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో తొలిరోజు పదో తరగతి పరీక్షలకు పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో జి.సుబ్బయ్య పరిశీలించారు. విద్యార్థులను పోలీసులు చెక్ చేసిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఎస్ఐ ఎస్.మల్లికార్జున అన్నిపరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళల రక్షణకు శక్తి టీమ్

దర్శి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శక్తి టీమ్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం శక్తి టీమ్‌ను ఆయన ఆరంభించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎక్కడైన మహిళలు ఒంటరిగా ఉండి ఇతరులతో ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తినప్పుడు శక్తిటీమ్‌కు సమాచారం అందించాలన్నారు. 15 నిమిషాల్లో అక్కడకు చేరి రక్షిస్తారని చెప్పారు. మహిళలందరూ శక్తి టీమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. శక్తి టీమ్‌లో ఎస్ఐ, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. ఎవరైన మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శక్తి టీమ్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్న సీఐ రామారావు, పోలీసు అధికారులు

కార్యక్రమంలో దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ ఎం.మురళీ, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



దొనకొండలో విక్రయానికి తెచ్చిన వరిగడ్డి ట్రాక్టర్

గ్రాసం కొరత

▸ కొండెక్కిన వరిగడ్డి ▸ ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు

దొనకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే మండలంలో పశుగ్రాసం కొరత రోజురోజుకు పెరిగిపోతోంది. గ్రామాల్లో పశువులకు గ్రాసం దొరక్క వరిగడ్డి ధరలు కొండెక్కడంతో పశుపోషణ భారమై పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు ట్రాక్టర్లల్లో వరిగడ్డిని దొనకొండకు తెచ్చి ట్రాక్టర్ వరిగడ్డి దాదాపు రూ.15వేలు వరకు ధర నిర్ణయించారు. అంతధరకు వరిగడ్డి కొనుగోలు చేయలేక ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆవులు, ఎద్దులు 1648, గేదెలు 16,524, గొర్రెలు 29,879, మేకలు 3762 మొత్తం 51,818 మూగజీవాలు ఉన్నట్లు అధికారుల లెక్కల ప్రకారం సమాచారం. మండలంలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండటంతో పశుపోషకులు, రైతులు వరిగడ్డిని కొనుగోలు చేసుకునేందుకు వరిగడ్డి ట్రాక్టర్ల కోసం రహదారిపై ఎదురుచూస్తుంటారు. దీన్ని ఆసరాగా తీసుకున్న వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ట్రాక్టర్ వరిగడ్డికి కనీసం రూ.500 కూడా తగ్గించటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మేతకోసం ఉదయం నుండి సాయంత్రం వరకు పొలాల వెంట తిరిగే మూగజీవాలకు సరిగ్గా మేత దొరక్క బక్కచిక్కి అల్లాడిపోతున్నాయని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీపై గ్రాసం సరఫరా చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం నేటి వరకు పట్టించుకోకపోవటంతో మేతకోసం మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంటుంబాల జీవనోపాధి నిమిత్తం మూగజీవాలను అమ్ముకోలేక వ్యాపారులు చెప్పిన ధరలకే గ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకొని మూగజీవాల పట్ల ఆదరణ చూపి వరిగడ్డి అధిక ధరలను నియంత్రించాలని పశుపోషకులు కోరుతున్నారు. అలాగే, సబ్సిడీపై గ్రాసం అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

తాళ్లూరులో ట్రాఫిక్ కష్టాలు

▸ కాలువలు ఆక్రమించి దుకాణాల ఏర్పాటు

▸ రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

▸ పట్టించుకోని పోలీస్, గ్రామపంచాయతీ అధికారులు

▸ ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



తాళ్లూరులోని వెల్లంపల్లి బస్టాండ్ వద్ద రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలు

తాళ్లూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాళ్లూరును ట్రాఫిక్ వేధిస్తోంది. గ్రామంలో రోడ్లు విస్తరించి కాలువలు నిర్మించారు. దీనివల్ల సమస్య తీరకపోగా ఇబ్బందులు పెరిగిపోయాయి. కాలువల ముందుకువచ్చి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరుగుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వాహనాలను అడ్డంగా నిలబెడుతున్నా, కాలువల ముందుకువచ్చి బంకులు, తోపుడు బండ్లు ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గిస్తున్నా పోలీస్ శాఖ, పంచాయతీ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో విమర్శలు వస్తున్నాయి.

తాళ్లూరులో ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురై ట్రాఫిక్‌కు తరుచూ సమస్యలు ఏర్పడుతుండటంతో గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటిమంత్రి శిద్దా రాఘవరావు కోట్లాది రూపాయల నిధులు మంజూరుచేయించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి సైడు కాలువల నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాల పూర్తయిన కొంతకాలం వరకు రోడ్లు వెడల్పుగా ఉన్నప్పటికి ప్రస్తుతం నియంత్రణ తప్పింది. గతకొంతకాలంగా హైవేరోడ్డు నిర్మాణం చేపడుతుండటంతో వాహనాల రద్దీ పెరగటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. సమస్యను పరిష్కరించాల్సిన పోలీసుశాఖ ఆవైపు కన్నెత్తి చూపకపోవటం విమర్శలకు తావిస్తుంది. గ్రామంలోని వెల్లంపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి బొడ్డురాయి వరకు గల రహదారి, వెల్లంపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి తూర్పుగంగవరంరోడ్డు, బస్టాండ్ సెంటర్ నుంచి ముండ్లమూరు రోడ్డు వైపు సైడు కాలువలను ఆక్రమించి రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది.

వెల్లంపల్లి బస్టాండ్ సెంటర్ నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈరహదారిలో బ్యాంక్ ఉండటంతో ఖాతాదారులు తమ ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. బ్యాంక్ నుంచి జూనియర్ కళాశాల వరకు ఇరువైపులా కాలువలను ఆక్రమించి చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటుచేశారు. పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాలపై వచ్చే ప్రజలు రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాలు రద్దీ ఎక్కువగా ఉంటుంది. స్కూల్ బస్సులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు ఈమార్గంలో వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సిందే.



కాలువలను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు

రోడ్ల ఆక్రమణలను తొలగించకముందే కొంతమేర ట్రాఫిక్ సాఫీగా ఉండేదని పలువురు పేర్కొంటున్నారు. రోడ్లు విస్తరించటంతో కొంతమేర నష్టపోయిన యజమానులు మరలా ఆక్రమణలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం గతంలో కంటే అధికంగా ఆక్రమణలు ఉండటంతో రోడ్లపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్ సెంటర్‌లో మలుపుల వద్ద ఆటోలను నిలుపుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు కుంచించుకపోతూ ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతున్నా తమకేమి పట్టనట్లుగా పంచాయతీ, పోలీస్‌శాఖలు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పోలీస్‌లు ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించేవారు. కొంతకాలంగా పట్టించుకోవడంలేదు. దీంతో సమస్య తీవ్రమూంది.

కాగా, తూర్పుగంగవరంలో సైడు కాలువలు ఆక్రమించి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అవరోధంగా ఉండగా గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొంది. సైడు కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. దీంతో గత కొంతకాలంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. తాళ్లూరు గ్రామ పంచాయతీ కూడా అదేవిధంగా సైడు కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

వెలిగండ్ల, మార్చి 17: (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని టీడీపీ నాయకుడు శ్యామల కాశిరెడ్డి అన్నారు. సోమవారం వెలిగండ్ల రైతు సేవా కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కందుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వెలిగండ్ల, గన్నవరంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ.7550 మద్దతు ధర ఉందన్నారు. ఈకేంద్రాల్లో రైతులు కందులు విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరమణ, ఏవో రంగాకృష్ణ, రమణయ్య, బాలచంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, బత్తుల తిరుపాల్‌రెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, కేసరి రమణారెడ్డి, సోము చౌడారెడ్డి, చెంచిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

పామూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన ముప్పరపు షైనీ తీవ్రంగా గాయపడింది. పదిరోజుల క్రితం ఒంగోలులో జరిగే రైల్వే రిక్రూట్ మెంట్ పరీక్షల కోసం నెల్లూరు నుంచి ఒంగోలుకు వస్తున్నారు. ఈక్రమంలో వాటర్‌బాటిల్ కోసం కావలి రైల్వే స్టేషన్‌లో దిగేక్రమంలో కాలు జారి రైలు కిందపడింది. కుడికాలిపై రైలు చక్రం ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జు అయింది. నెల్లూరు నారాయణ వైద్యశాలలో చేర్పించగా ఆపరేషన్ నిమిత్తం రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేదరికంతో వైద్యానికి స్థోమత లేకపోవడంతో దాతల సహకారాన్ని అభ్యర్థించారు. ఈనెల 12న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో మానవతా సంస్థ స్పందించింది. దాతల నుంచి రూ.41,700 సేకరించి బాధితురాలి సోదరుడికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య, టి.రమేష్, వి.వెంకటేశ్వరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, బీఎస్ రంగారెడ్డి, తిరుపతిరెడ్డి, ఏ.కొండారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కురిచేడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతదేహం సోమవారం ఉదయం గంగదొనకొండ గ్రామ పొలాల్లో లభ్యమైంది. రైతులకు పొలాలకు వెళ్లినప్పుడు మృతదేహం కనిపించడంతో పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ శివ మహిళ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంగదొనకొండ నుంచి వీవై కాలనీకి వెళుతూ ఎండవేడిమికి దాహంతో డీహైడ్రేషన్‌కు గురై మృతిచెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దర్శి సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. సీఐ అనస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఎస్ఐ శివకు పలు సూచనలు చేశారు.

రేషన్ బియ్యం లారీ స్వాధీనం



పట్టుబడిన రేషన్‌బియ్యం వాహనం

దర్శి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మినీ లారీని అధికారులు పట్టుకున్నారు. మండలంలోని సామంతపూడి రేషన్ దుకాణం నుంచి మినీ వ్యాన్‌లో రేషన్‌బియ్యం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈక్రమంలో అందిన సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాధాకృష్ణ, ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు మినీలారీని పట్టుకొని తనిఖీ చేశారు. అందులో 8.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి 6ఏ కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

పామూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బంగారు బాల్యంపై జరిగిన మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలకార్మికులు, బాలల అక్రమ రవాణాపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల డ్రాపవుట్‌ను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో ఎల్ .బ్రహ్మయ్య, ఏపీఎం జి.విద్యాసాగర్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు షేక్ నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో ప్రయోజనం

తాళ్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఏవో బి.ప్రసాదరావు అన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం ప్రకృతి సాగు ఉత్పత్తుల ప్రదర్శన-అమ్మకాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులతో పండించిన ప్రకృతి సాగు ఉత్పత్తులు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. పలువురు అధికారులు, ప్రజలు ప్రకృత్తి ఉత్పత్తులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ నరసింహులు, ఐసీఆర్‌లు కోటిరత్నం, అనంతలక్ష్మి, మౌనిక , పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి


పామూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలని కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా అరవిందరెడ్డి మాట్లాడుతూ ఈనెలాఖరు నాటికి ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఇందుకుసంబంధించి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. మొండి బకాయి దారులకు నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా జి.రత్నకుమార్, బిల్ కలెక్టర్ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు కోసం నిరీక్షణ

కనిగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ఆర్టీసీ డిపోలో బస్సుల సమయాలను ఇష్టారీతిగా మారుస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలలుగా కనిగిరి నుంచి సీఎస్‌పురంకు ఉదయం 11.30లకు బస్సు బయలుదేరుతుంది. దీనిని అర్థంతరంగా తొలగించారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకావడంతో తల్లిదండ్రులు కనిగిరి వచ్చారు. 12 గంటలకు పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థులలకు ధైర్యం చెప్పి తల్లిదండ్రులు తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 2.30 వరకు సీఎస్‌పురంకు బస్సు రాకపోవటంతో సిబ్బందిని ప్రశ్నించినా స్పందనలేదని ప్రయాణికులు యారవ వెంకటసుబ్బయ్య, వెంకటలక్ష్మమ్మ, వెంకటయ్య, నరసయ్య, ఊసా వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేక ఆటోలను ఆశ్రయించి గమ్యస్థానాలకు వెళ్లారు.

అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అనువంశికంగా సక్రమించిన భూమిలో తన అన్న ఆస్తిని కొనుగులుచేసినవారు తప్పుగా హద్దులు చూపి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మండలంలోని శివరాంపురం గ్రామస్థుడు అనపర్తి షడక్ పేర్కొన్నారు. తన భూమిలో అక్రమంగా కట్టడాలు కడుతు బొగ్గుల సమరసింహారెడ్డిపై చర్యలు తీసుకొని న్యాయంచేయాలని కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ సంజీవరావుకు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హక్కుగల భూమిలో నిర్మాణా లు చేపట్టవద్దని చెప్పినా వినకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రావినూతల కోటి మాదిగ, గందం ఇర్మియా మాదిగ, పొనుగోటి ఉదయ్‌కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



పది పరీక్షకు.. 98.5 శాతం మంది హాజరు



కొల్లూరులో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

బాపట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొత్తం 103 పరీక్షా కేంద్రాలలో 16,481 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా మొదటి రోజు తెలుగు పరీక్షకు 234మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 98.5 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు. జిల్లా పర్యవేక్షణాధికారి గంగాభవానీ, డీఈఓ పురుషోత్తం 6 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో జిల్లాలోని 44 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు, విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లు, సహాయ సిబ్బందిని మినహా ఎవ్వరినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. గుర్తింపు కార్డు, హాల్‌టిక్కెట్‌లను పరిశీలించిన తర్వాతే అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తూ కేంద్రాల సమీపంలో గుంపులుగా గుమికూడకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్‌లు మూసి వేసే విధంగా నిర్వాహకులకు ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలు జారీచేశారు. కేంద్రాల వద్ద పోలీసు అధికారుల ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించారు. పరీక్ష ముగిశాక ప్రశ్నాపత్రాల తరలింపు, సమాధాన పత్రాల డిపాజిట్ చేయటానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బాపట్లలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది

ఫిట్నెస్ కోసం.. తిప్పలు

- ఎఫ్‌సీ జారీలను ప్రైవేట్ వ్యవస్థకు అప్పజెప్పిన కేంద్రం
- పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లాలో ఏర్పాటు
- చలానాల్లో 50-50 వాటా పద్ధతిలో ఏజెన్సీకి బాధ్యతలు
- జర్మనీ యంత్రాలతో వాహనాల చెకింగ్
- ఫిట్నెస్ పేరుతో అడ్డగోలుగా వెనక్కి పంపుతున్న నిర్వాహకులు
- అదే పనిగా చలానాలు వసూలు
- అనుమతులు లేకుండానే శ్లాట్ బుకింగ్‌లు
- తీవ్రంగా ఇబ్బంది పడుతున్న వాహన యజమానులు
- ప్రైవేటు విధానాన్ని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

గుంటూరు(తూర్పు), మార్చి 17(ఆంధ్రజ్యోతి): మారుతున్న నియమాలు, భారీ జరిమానాలతో రవాణా రంగం ఇప్పటికే కుదేలవుతుంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో వాహన యజమానులను మరింత కష్టాల్లోకి నెడుతోంది. కీలకమైన ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఫిట్నెస్ పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఆర్టీఏ) పరిధిలో ఉండేది. ఫిబ్రవరి 7న ఎఫ్‌సీ వ్యవస్థను ప్రైవేటు పరం చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లాను ఎంపిక చేశారు. ప్రతి వాహన తనిఖీకి సంబంధించిన చలనాలో 50 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లాకు సంబంధించిన కార్యాలయాన్ని ఏటుకూరు రోడ్డులో రాయల్ ఏజెన్సీస్ పేరుతో నిర్వాహకులు ఆటోమేటిక్ ఫిట్నెస్ టెస్టింగ్ అండ్ సర్టిఫికేషన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఫిట్నెస్ పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు. కాకపోతే నెల రోజుల గడవక ముందే ఈ ఏజెన్సీపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● ప్రభుత్వం పరిధిలో ఉన్న ఈ వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడంతో వాహన యజమానుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. ఫిట్నెస్ పరీక్షల కోసం సదరు ప్రైవేటు ఏజెన్సీ తీసుకొచ్చిన యంత్రాన్ని బూచిగా చూపి భారీ దోపిడీకి తెరలేపారు. నిబంధనల పేరుతో నిష్కారణంగా రిజెక్ట్ చేసి, అదేమని అడిగితే మరోసారి చలానా కట్టుకోవాల్సిందేనని అడ్డగోలుగా సమాధానం చెబుతున్నారు. దీంతో ఎఫ్‌సీ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు అనుభవం లేని వ్యక్తులను పెట్టి పరీక్షలను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరూ వహిస్తారనే సమస్య తలెత్తుతుంది.

● శ్లాట్ బుకింగ్‌ల వద్ద దళారులు పాగా

ఎఫ్‌సీ పేరుతో ఏజెన్సీ దోచుకుంటుంటే, స్లాట్ బుకింగ్‌ల పేరుతో దళారులు

(మిగతా 6వ పేజీలో)

దోపిడీ ఇలా సాగుతుంది..

ఆటోమేటిక్ ఫిట్నెస్ టెస్టింగ్ అండ్ సర్టిఫికేషన్ ప్రకారం ఆయా వాహనాలకు చలానాలను నిర్ణయించారు. దీని ప్రకారం లైట్ మోటారు వెహికల్ (ఆటో, టాటా ఏస్‌లు, అప్పి) వాహనాల ఫిట్నెస్ పరీక్షలకు రూ. 600, సర్టిఫికెట్ కోసం రూ. 200, జీఎస్టీ రూ. 144, యూజర్ ఛార్జీలు రూ. 120 మొత్తం రూ. 1064 చలానా చెల్లించాలి. భారీ వాహనాల పరీక్షలకు రూ వెయ్యి, జీఎస్టీ రూ 216 మిగతా సర్టిఫికెట్, యూజర్ ఛార్జీలు యథావిధిగా చెల్లించాలి. ఇందులో సగం అంటే 50 శాతం వాటా నిర్వాహకులకు వస్తాయి. కాకపోతే సగం వాటా కోసం ఎఫ్‌సీలను ఉద్దేశపూర్వకంగా రిజెక్ట్ చేస్తున్నారని వాహన యజమానులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఫిట్నెస్ పూర్తయిన తరువాత బయటకు రాగానే అక్కడ పనిచేసే సిబ్బంది రూ. 400 అడుగుతున్నారు.



ఏజెన్సీ ఎదుట ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం బారులు తీరిన వాహనాలు

● రిజెక్ట్ పేరుతో భారీ దోపిడి

నూతనంగా ఏర్పాటు చేసిన జర్మనీ యంత్రం సాయంతో నిర్వాహకులు ఫిట్నెస్ పరీక్షలకు వచ్చిన వాహనాలను అధిక సంఖ్యలో రిజెక్ట్ చేస్తుంది. రోజుకు 100కు పైగా వాహనాలను తనిఖీ చేస్తే వాటిలో 80 శాతం రిజెక్ట్ చేస్తుంది. ఫిట్నెస్ కోసం కేంద్రం రూపొందించిన 35 నిబంధనల్లో 20 నియమాలు పాటిస్తే ఎఫ్‌సీ జారీ చేయాలని నియమాలు ఉన్నాయి. కానీ కేంద్రం పెట్టిన అన్ని నిబంధనలను బూచిగా చెప్పి ఉద్దేశపూర్వకంగా రిజెక్ట్ చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు ఎఫ్‌సీ కాలపరిమితి ముగిసిన ప్రతి రోజుకు ఆటోకు రూ. 20, క్యాబ్, లారీ రూ. 50 చొప్పున జరిమానా పడుతుందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హడావుడి నిర్మాణం.. ఏదీ ప్రాధాన్యం



రైతు భరోసా కేంద్ర (రైతు సేవా కేంద్రం) భవనం

- గత ప్రభుత్వంలో ప్రారంభమైన నిర్మాణాలు
- నిధులు అందక నిలిచిన వైనం
- పూర్తి చేయాలంటున్న పల్లెవాసులు

పల్లెలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకోస్తున్నామని ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మి స్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. తీరా భవనాల నిర్మాణం చేపట్టాక వాటి ప్రాధాన్యం మరి చింది. ఉపాధి పథకం కింద పనులు చేపట్టినా సకాలంలో నిధులు విడుదల చేయకుండా, చాలా భవనాలను మధ్యలోనే నిలిపివేసింది. శిథిలావస్థకు చేరుతున్న ఆ భవనాలను పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తేవాలని పల్లె వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణాలు ఉపాధి హామీ పథకం కింద గత వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. గ్రామ స్వరాజ్యం తీసుకోచ్చేందుకే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి భవనాలను నిర్మిస్తున్నట్టు ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణలో ఇది కనిపించలేదు. చాలా చోట్ల ఇంకా అద్దె భవనాలల్లోనే నిర్వహిస్తున్నారు. దీని కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,607 భవనాల నిర్మాణం చేపట్టగా 969 భవనాల నిర్మాణం పూర్తయింది. మూడు జిల్లాల్లో 1004 సచివాలయ భవనాల నిర్మాణాన్ని చేపట్టగా 450 భవనాల నిర్మాణం పూర్తయింది. ఇంకా 554 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి.

రైతు ప్రయోజనాలు కాపాడేందుకే ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు పాలకులు ఊదరగొడుతున్నారు. వీటిని అద్దె భవనాలలో ఏర్పాటు చేశారు. అనంతరం 787 నాటి రైతు భరోసా కేంద్రాల నేటి రైతు సేవా కేంద్రాల నిర్మాణాలను చేపట్టారు. 248 భవనాల నిర్మాణం పూర్తయిం ది. ఇంకా 539 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా హెల్త్ క్లినిక్‌లను మంజూరు చేసింది. 816 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 271 భవనాల నిర్మాణం పూర్తికాగా 545 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఈ భవనాల నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడం లేదు. నిధుల కొరత, ప్రభుత్వ ప్రాధాన్యత నిర్మాణాలపై పడింది. పల్లెల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.



పునాదుల్లోనే నిలిచిపోయిన హెల్త్ క్లీనిక్ భవనం

వేమూరులో... గూడ్స్ షెడ్

- నిర్మాణానికి రూ.9.98 కోట్లు
- 1980లో ఆగిన సౌకర్యం తిరిగి పునరుద్ధరణ
- తగ్గనున్న రవాణా ఖర్చులు ... రైతులు, మిల్లర్ల హర్షం

వేమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేమూరు రైల్వే స్టేషన్ పరిధిలో గూడ్స్ షెడ్ నిర్మాణానికి రూ.9.98 కోట్లు నిధులను రైల్వే శాఖ కేటాయించింది. 1980లో స్టేషన్ పరిధిలో గూడ్స్ రైలు సౌకర్యాన్ని నిలిపివేశారు. తిరిగి అదే సౌకర్యాన్ని పునరుద్ధరించే విధంగా రైల్వే శాఖ నిర్ణయం తీసుకోవడంతో పాటు నిధులను కేటాయించడంపై ఈ ప్రాంత రైతులు, మిల్లర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్టేషన్ కార్యాలయానికి ఎదురుగా గూడ్స్ షెడ్ ఉండేది. రేపల్లె వరకు బొగ్గు దిగుమతి చేయడంతో పాటు రైస్ మిల్లులు ఎక్కువగా ఉండటం వల్ల వాటి నుంచి బియ్యం పలు ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి, పంట ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు గూడ్స్ రైలు సౌకర్యాన్ని కల్పించారు. తద్వారా కేవలం వేమూరు రైల్వేస్టేషన్‌లోనే 50 మందికి పైగా కూలీలు



పని చేసేవారు. 1980లో ఈ సౌకర్యాన్ని నిలిపి వేశారు. 1990లో గూడ్స్ షెడ్డును కూడా తొలగించారు. తిరిగి ఆ సౌకర్యాన్ని కల్పించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టనుంది. తద్వారా రైతులు పండించే జొన్న, మొక్కజొన్న ఉత్ప త్తులు తమిళనాడు ప్రాంతానికి అలాగే రైసుమిల్లుల ద్వారా దిగుమతి అయ్యే బియ్యం తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు రవాణా చేసుకునేందుకు గూడ్స్ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు రైతులు, మిల్లర్లు తమకు సంబంధించిన ఉత్పత్తులను ఎగుమతి, దిగుమతి చేసుకునేందుకు రవాణాకు సంబంధించిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి రైల్వేస్టేషన్ నుంచి గూడ్స్ ద్వారా ఉత్పత్తులను ఎగుమతి, దిగుమతి చేసుకోవాలంటే సమస్యలు ఎదురవుతున్నాయి. పంటల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యాపారస్తులకు సంబంధించిన ఉత్పత్తులు గుంటూరు ప్రాంతం నుంచి దిగుమతి చేసుకోవాలన్నా రోడ్డు మార్గమే శరణ్యం. దీంతో రవాణా ఖర్చులు అదనంగా భరించాల్సి ఉంది. వీటన్నింటిని గమనించిన రైల్వే శాఖ రైతులు, మిల్లర్లు, ఇతర వ్యాపారస్తులను దృష్టిలో పెట్టుకుని గూడ్స్ సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు నిధులు కేటాయించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా కూలీలకు కూడా జీవనోపాధి కలగనుంది. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాలు అలాగే రేపల్లె నియోజకవర్గం పరిధిలోని గ్రామాల రైతులు, వ్యాపారస్తులు మిల్లర్లకు పునరుద్దరణ కానున్న గూడ్స్ సౌకర్యం ఎంతగానో దోహదపడుతుంది.

ఏఎంసీలకు రిజర్వేషన్లు ఖరారు!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఎన్నికకు రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారయినట్లు సమాచారం. ఇంతకు ముందు ప్రకటించిన వాటిలో స్వల్ప మార్పులు చేసి తుది జాబితాను రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. గతంలో జిల్లా యూనిట్‌గా తీసుకుని ఏఎంసీల రిజర్వేషన్లపై ఓ నిర్ణయానికి రాగా వాటిపై పలు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. ప్రస్తుతం 8 ఏఎంసీ చైర్మన్ల ఎన్నికకు రిజర్వేషన్లపై కసరత్తు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

బీసీ 3, ఓసీ 4, ఎస్సీ 1...

జిల్లాలో ఉన్న 8 ఏఎంసీలకు వేమూరు ఓసీ(మహిళ), రేపల్లె ఓసీ (మహిళ), సంతమాగులూరు ఓసీ తోపాటు బాపట్ల కమిటీ చైర్మన్ కూడా ఓసీ కే కేటాయించినట్లు సమాచారం. రేపల్లె నియోజకవర్గ పరిధిలోని కూచినపూడి బీసీ, పర్చూరు బీసీ, చీరాల బీసీకి దక్కనుండగా, అద్దంకి ఎస్సీ (మహిళ)కి తుది జాబితాలో చోటు దక్కినట్లు తెలుస్తోంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (మంగళవారం సాయంత్రం) సహరి : 4.57 (బుధవారం ఉదయం)



కలెక్టరేట్‌లో ప్రజలకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి

అర్జీదారులకు.. అన్న సదుపాయం

బాపట్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో భాగంగా దూర ప్రాంతాలు నుంచి అర్జీలిచ్చేందుకు వచ్చే వారికి కలెక్టర్ జె.వెంకటమురళి భోజన సదుపాయం కల్పించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన 300మందికి భోజనం వడ్డించారు. అక్షయపాత్ర ద్వారా భోజనం తయారు చేయించి అందించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

డెకాయ్ ఆపరేషన్‌లో.. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

- మందుల దుకాణాలపై దాడులకు సిద్ధం
- కస్టమర్లుగా మఫ్టీలో పోలీసులు
- చీటీ లేకుండా మత్తు మందులు విక్రయిస్తే కేసులు
- నాలుగేళ్లుగా తగ్గిన తనిఖీలు



గుంటూరు మెడికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా మందుల దుకాణాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు చేసేందుకు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. జోన్‌ల వారీగా రిటైల్ మెడికల్ షాపులపై పెద్ద ఎత్తున దాడులు చేసేందుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సర్వం సిద్ధం చేశారు. ఎప్పటిలా జరిపే మొక్కుబడి తనిఖీల్లా కాకుండా ఈ దఫా.. ముందస్తుగా మఫ్టీలో ఉన్న పోలీసులను డెకాయ్ కస్టమర్లుగా (సాధారణ వినియోగదారుడుగా) మందుల దుకాణాలకు పంపుతారు. వీరికి సదరు దుకాణదారుడు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా..మత్తు బిళ్లలు, యాంటీ బయోటిక్ వంటి మందులు విక్రయిస్తే అడ్డంగా కేసులో ఇరుక్కుంటారు. పోలీసులనే సాక్షులుగా పెట్టి కేసులు నమోదు చేస్తారు. మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా తనిఖీలు జరిపేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే హోల్‌సేల్ రిటైల్ మందుల దుకాణదారుల సంఘాలకు ముందుగానే ఈ సమాచారం అందించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయించినా, ఆయా మందులకు సరైన రికార్డులు నిర్వహించకపోయినా కేసులు నమోదు చేస్తామని ఔషధ నియంత్రణ అధికారులు హెచ్చరించారు.

శాఖ తీరుపై మంత్రి అసంతృప్తి...

నాణ్యమైన మందులు అందేలా చూడటానికి, ఔషధ నియంత్రణ శాఖ అనే వ్యవస్థ ఉందని, అది ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సమర్థవంతంగా పని చేస్తోందని అన్నభావన ప్రజల్లో కలిగేలా డీసీఏ పని చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్బోదించారు. గతవారం మంత్రి ఔషధ నియంత్రణ శాఖపై సమీక్ష జరిపి, పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీలు పెంచాలని, నాసిరకం, నాణ్యత లేని మందులను మార్కెట్ నుంచి ఏరివేయాలని ఆదేశించారు. ఆరోగ్య మంత్రి ఆదేశాలతో ఔషధ శాఖ అధికారులు దాడులకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

తగ్గిన డీఐల తనిఖీలు...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల(డీఐ)ల తనిఖీలు బాగా తగ్గాయి. 2015-16 సంవత్సరంలో డీఐలు 538 దుకాణాలను తనిఖీలు చేయగా, 2023-24లో అది 501కి పడిపోయింది. డీఐలు సేకరించే మందుల నమూనాల విషయంలో కూడా చిత్తశుద్ధి కొరవడినట్లు వెల్లడైంది. నమూనా విధానం, నాణ్యతలను సూచించే దిశగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సేకరించే నమూనాల్లో మూడు శాతం నాట్ ఆఫ్ స్టాండర్డ్ క్వాలిటీ (ఎన్ఎస్‌క్యూ) ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించింది. 2015-19 కాలంలో ఎన్ఎస్‌క్యూ నాలుగు శాతం ఉండగా, 2019-20లో 2.22 శాతం, 2023-24లో 1.52 శాతానికి పడిపోయింది. నామునాల సేకరణ యధాలాపంగా కాకుండా ముందస్తు సమాచారం ఇచ్చి సేకరణతో పటిష్ఠంగా జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వేరే పని మీద వెళుతూ దారిలో ఉండే మందుల షాపులను తనిఖీలు చేయకుండా, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా తనిఖీలు చేయాలని స్పష్టం చేసింది. కల్తీ మందులు ఏ రాష్ట్రం నుంచి జిల్లాలోకి వస్తున్నాయో నిఘా ఉంచాలని ఉద్బోదించింది.

ఈ మందుల పట్ల అప్రమత్తం

అలవాటుగా మారే ప్రమాదం ఉన్న మందులైన ఆల్ప్రాజోలామ్, బుప్రెనోర్ఫిన్, క్లోరోడై ఎజోపాక్సైడ్, డైజీఫామ్, డైఫెనోక్సిలేట్, మిడాజోలామ్, నైట్రాజెఫామ్, పెంటాజోసిస్, ట్రమడాల్, జోల్పిడెమ్ వంటి మందుల విక్రయాలపై డీఐలు దృష్టి సారించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఈ మందులు విక్రయించడం నేరంగా పరిగణిస్తారు. ఈ మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలువురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ మందులను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో డీఐలు ఈ తనిఖీలు చేపట్టారు. యాంటీ బయోటిక్ మందులు అధికంగా విక్రయిస్తున్న రిటైల్ మందుల దుకాణాల సమాచారం తెప్పించుకొని ఆయా షాపులపై డెకాయ్ కస్టమర్లను ప్రయోగించాలని ప్రభుత్వం నుంచి డీఐలకు ఆదేశాలు అందాయి.

గడువులోపు సమస్యలను పరిష్కరించాలి

- ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పిర్యాదుదారుల పట్ల సహృదయ భావంతో వ్యవహరించాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులకు తెలిపారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అమర్తలూరు మండలానికి చెందిన 60 సంవత్సరాల మాజేటి శంకర్‌కుమార్ కాలికి గాయమై నడవటానికి ఇబ్బంది పడుతూ తన సమస్యను చెప్పుకోవటానికి కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ స్వయంగా అతడి వద్దకెళ్ళి సమస్యను అడిగి తెలుసుకొని సంబంధితాధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



శింగరకొండ వద్ద చెత్తను తొలగిస్తున్న కూలీలు

తిరునాళ్ల చెత్త తొలగింపు

చర్యలు చేపట్టిన శింగరకొండపాలెం పంచాయతీ అధికారులు

అద్దంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా ఏర్పడిన చెత్తను తొలగించేందుకు శింగరకొండపాలెం పంచాయతీ అధికారులు ఉపక్రమించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం తిరునాళ్లలో వ్యర్థాలు తొలగేదెలా కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో సోమవారం శింగరకొండపాలెం పంచాయతీ కార్యదర్శి చన్నయ్య పర్యవేక్షణలో కూలీలను ఏర్పాటు చేసి శింగరకొండలో 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి దేవాలయం వరకు రోడ్డు వెంబడి, దేవాలయం పరిసరాలలో చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగింప చేశారు. దీంతో రోడ్డు, దేవాలయం పరిసరాలు శుభ్రపడ్డాయి.

పీజీఆర్ఎస్ సర్వేను పూర్తి చేయాలి

బల్లికురవ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలపై వారి అభిప్రాయాలను సర్వేలో నమోదు చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్ సర్వేపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 1121 మంది తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారని, వాటిపై సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే పీ-4 సర్వేను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ పరికరాలపై ఎంపీడీవో సమీక్ష



వృత్తి సంఘాలతో సమీక్ష చేస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆదరణ-3 పథకం ద్వారా లబ్ధిదారులకు అవసరమైన ఆదరణ పరికరాలపై ఎంపీడీవో కె.స్వరూపారాణి సోమవారం సమీక్ష నిర్వహించారు. పంగులూరు మండ పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కుల, వృత్తి సంఘాల నేతలతో గతంలో ఆదరణ-2 ద్వారా పంపిణీ చేసిన పరికరాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆదరణ-3 ద్వారా లబ్ధిదారులు కోరుకుంటున్న పరికరాల గురించి అభిప్రాయ సేకరణ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన సమీక్షలో ఈవోఆర్డీ కె.సుమంత్, పంచాయతీ కార్యదర్శులతో పాటు పలు గ్రామాల కుల, వృత్తి సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి ఈవోగా శ్రీనివాసరావు



శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరావు

అద్దంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా మంగమూరు గ్రూపు దేవస్థానాల ఈవో మద్దినేని శ్రీనివాసరావు సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి గ్రూపు దేవస్థానాల ఈవోగా బదిలీపై వెళ్లిన కోటిరెడ్డి ఇప్పటి వరకు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవోగా బాధ్యతలు చేపట్టిన మద్దినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచనల మేరకు దేవస్థానంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషిచేయడం జరుగుతుందన్నారు.

కందులు, శనగలు, మినుములు కొనుగోలుకు 90 కేంద్రాలు ఏర్పాటు

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు 90 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. కందులకు 45 కేంద్రాలు, శనగలకు 35 కేంద్రాలు, మినుములకు పది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కందులు కనీస మద్దతు ధర క్వింటా రూ.7,550, శనగలు క్వింటా 5,650, మినుములు కనీస మద్దతు ధర క్వింటా రూ.7,400లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువ ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి రైతులు కనీస మద్దతు ధరను పొందాలని కోరారు. ఈక్రాప్‌లో కంది, శనగ, మినుము నమోదు చేసుకున్న రైతులు ప్రొక్యూర్‌మెంట్ కోసం సీఎం యాప్‌లో రైతు సేవా కేంద్రాల్లో రెండు రోజుల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు తమ పేర్లను నమోదు చేసుకునే సమయంలో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేయాలని తెలిపారు. తద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునే తేదీ రిజిస్టర్ మొబైల్ నెంబరుకు మెసేజ్ వస్తుందని పేర్కొన్నారు. పంటను విక్రయించే సమయంలో సరుకును శుభ్రం చేసి, ఆర బెట్టుకొని ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

కురిచేడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదనంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. స్వామివారికి పంచామృత అభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటుచేసింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్వామివారిని దర్శించుకున్నారు.

భానుడి భగభగ

- ఎండకు రోడ్డు మార్జిన్‌లో బారులు తీరిన లారీలు
- నామ్ రోడ్డులో రెస్ట్ ఏరియా లేక ఇక్కట్లు
- ప్రమాదాలకు దారి తీసే అవకాశం



అద్దంకి సమీపంలో నామ్ రోడ్డులో మార్జిన్‌లో బారులు తీరి నిలిచి ఉన్న లారీలు

అద్దంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నామ్ రోడ్డు లో అందుబాటులో వాహన చోదకులు వి శ్రాంతి తీసుకునేందుకు రెస్ట్ ఏరియా లేకపోవడంతో రోడ్డు మార్జిన్‌లే పార్కింగ్ ఏరియాలుగా మారుతున్నాయి. నామ్ రోడ్డులో వేగంగా ప్రయాణించే వాహనాలు మార్జిన్‌లోకి వెళితే నిలిపి ఉన్న వాహనాలను ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఎండ వేడిమి పెరగడంతో సుదీర్ఘ ప్రయాణం చేసే లారీ డ్రైవర్‌లు మధ్యాహ్నం సమయంలో కొంతసేపు నిలుపుకుంటున్నారు. ఈ క్రమంలో అద్దంకి పట్టణం సమీపంలోని నామ్‌రోడ్డు మార్జిన్‌లో మధ్యాహ్నం పదుల సంఖ్యలో లారీలు నిలిపి ఉన్నాయి. శింగరకొండ సమీపంలోని భవనాసి చెరువు కట్ట వద్ద గతంలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు ఖాళీగా ఉంది. ఆ ప్రాంతంలో నామ్ నిర్వహణ సంస్థ తారు వ్యర్థాలను, నిల్వ చేసింది. అలా కాకుండా రెస్ట్ ఏరియాగా మార్పు చేస్తే వాహనచోదకులకు ఉపయోగంగా ఉండడంతో పాటు, ప్రమాదాలు నివారించే అవకాశం కూడా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీస్ అధికారులు చొరవ తీసుకొని నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి భవనాసి చెరువు కట్ట వద్ద నిరుపయోగంగా ఉన్న ఆర్అండ్‌బీ స్థలాన్ని పార్కింగ్ ఏరియాగా మార్పు చేయాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.



జనసంచారంలేని పర్చూరు- గుంటూరు రోడ్డు



నిర్మానుష్యంగా ఉన్న పట్టణం

చీరాల : మార్చి ప్రారంభంలో ఎండలు మండుతున్నాయి. రోజూ సుమారు 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం ఉదయం నుంచే భానుడు భగభగలాడాడు. సెలవు రోజు కావడంతో ఎండకు భయపడి ఎవరూ రోడ్లపైకి రాలేదు. ఉదయానికే వచ్చి అవసరాలు తీర్చుకొని ఇళ్ల వద్ద ఉన్నారు. మార్చిలోనే ఇలావుంటే ఏప్రిల్, మే, జూన్‌లో పరిస్థితి ఎలాఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండలు పెరుగుతుండడంతో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీలను దాతల సాయంతో పంపిణీ చేస్తున్నారు. మరికొందరు చలివేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. సంబంధిత అధికారులు సైతం తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఏది ఏమయినా ఏ ఏడాది ఎండలతో ప్రజలు అల్లాడకతప్పని పరిస్థితులు కన్పిస్తున్నాయి.

పర్చూరు : వేసవి ప్రారంభంలోనే భానుడు ప్రతాపం ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మరో పక్క పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎండ తాపానికి అల్లాడాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తారు. ప్రధాన రహదరాలు జనసంచారం లేక వెలవెల బోయాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు సైతం బోసిపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే ముున్ముందు ఎండల తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు.

ఎత్తిపోతల మరమ్మతులపై ఎమ్మెల్యే ఏలూరి దృష్టి

ఇసుకదర్శిలో పనిచేయని పథకాన్ని పరిశీలించిన ఐడీసీ విశ్రాంత డీఈ సత్యనారాయణ

మార్టూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ హయాంలో నిరాదరణకు గురైై గ్రామాలలో పనిచేయకుండా ఆగిపోయిన ఎత్తిపోతల పథకాలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశి వరావు ప్రత్యేక దృష్టిసారించారు. పనిచేయని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు గత వైసీపీ పాలకులు ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదు. దాంతో వాటి నిర్వహణ రైతులు, ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యులకు భారమైంది. మరలా వాటిని వినియోగంలోకి తీసుకు రావాలంటే కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలి. అంతేగాకుండా కొన్ని ఎత్తిపోతల పథకాలలో ఇనుప పైపులు, మోటార్లు కూడా పనికి రాకుండా పోయాయి. మరి కొన్ని చోట్ల సామగ్రి దొంగల పాలయ్యాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో మరలా ఎత్తిపోతల పథకాలు రైతులకు అందుబాటులోకి తీసుకురావాలనే సదుద్దేశంతో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకంగా ప్రణాళికను తయారు సిద్ధం చేస్తున్నారు. వాస్తవంగా నియోజకవర్గ పరిధిలో ఏఏ గ్రామాలలో ఎత్తిపోతల పథకాలు పనితీరు ఏ విధంగా ఉంది, వాటిలో ఎన్ని ఆగిపోయాయి, మరలా వాటిని వినియోగంలోకి తీసుకురావాలంటే ఏమేరకు నిధులు అవసరమో, అందుకు సంబంధించి ప్రభుత్వం చేత ఏ విధంగా నిధులు మంజూరుకు పనిచేయాలనే తపనతో ఒక కార్యాచరణ చేస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగా మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో గత కొంతకాలం నుంచి పనిచేయకుండా ఆగిపోయిన ఏలూరి సాంబశివరావు ఎత్తిపోతల పథకాన్ని సోమవారం ఐడీసీ విశ్రాంత డీఈ సత్యనారాయణ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు ఈ గ్రామానికి చెందిన ఎత్తిపోతల పథకం పనిచేయక పోవడంతో రైతులు పొలాలకు నీరు అందక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ పాలనలో మరమ్మతులకు గురైన ఈ ఎత్తిపోతల పథకం ఇంతవరకు ఆచరణలోకి రాలేదు. దాంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనలు మేరకు విశ్రాంత అధికారి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. తరువాత ఈ పథకం మరమ్మతులకు ఏ మేరకు నిధులు అవసరమో, ఏఏ పనులు చేయాలో, వాటికి సంబంధించి సమగ్రమైన నివేదికను ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి విశ్రాంత అధికారి తీసుకువెళ్లనున్నారు. ఇదే విధంగా నియోజకవర్గంలో ఇంకా ఆగిపోయిన ఎత్తిపోతల పథకాల పనితీరుపై ఏలూరి సమగ్రంగా నివేదికను ఇవ్వాల్సిందిగా ఆయా గ్రామాల నాయకులకు సూచనలు చేసినట్లు తెలిసింది. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, పాలెపు రాంబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఐడీసీ విశ్రాంత డీఈ సత్యనారాయణతో, టీడీపీ నాయకులు హరిబాబు, రాంబాబు తదితరులు

సబ్సిడీ రుణాలతో జీవనోపాధిని పెంపొందించుకోవాలి

చినగంజాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న సబ్సిడీ రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకొని తమ జీవనోపాధిని పెంపొందించుకోవాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంతరావూరు శాఖ మేనేజర్ అశ్వినికుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. సంతరావూరు గ్రామానికి చెందిన పాలడగు శిరీషకు పీఎంఈజీపీ పథకం ద్వారా ఏడు లక్షలరూపాయిలతో మంజూరైన డీజే సౌండ్ సిస్టం షాపును సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం గద్దె పెద్ద సుబ్బారావు మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం ద్వారా ఏడు లక్షల రూపాయిలు రుణం మంజూరు కాగా సబ్సిడీ రుణం రూ.2,45,000లు పోగా 10 శాతం కాంట్రీబ్యూషన్ రూ.70,000లు లబ్దిదారుడు చెల్లించగా, మిగిలిన రూ.3,85,00లకు చెక్కును అందజేసినట్లు తెలిపారు. బ్యాంకు నుండి తీసుకున్న రుణం ప్రతి నెల సక్రమంగా చెల్లించినట్లయితే బ్యాంకు నుండి సబ్సిడీ కింద లబ్దిదారునికి రూ.2,45,000లు రావడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫిసర్ మనోజ్, పర్చూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి, అతిన సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.



డీజే సౌండ్ సిస్టం షాపును ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్, టీడీపీ నాయకులు

ధృఢమైన సంకల్పంతో సంచలనాలు

చీరాల, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థులు ధృఢమైన సంకల్పంతో సంచలనమైన ఆవిష్కరణలు రూపొందించగలరని వరంగల్ ఈసీఈ ప్రతినిధి డా.కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజీనింగ్ అండ్ టెక్నాలజీలో నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌పై అవగాహన కార్యక్రమం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా పలు ఆధునిక ఆవిష్కరణలపై ముఖ్య అతిథిగా అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కళాశాల సిబ్బంది అతిథిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, సీఎస్ఈ విభాగధిపతి డా.హరిణి విద్యార్థులు పాల్గొన్నారు.



డా. కిషోర్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఫిట్నెస్ కోసం.. తిప్పలు

(5వ పేజీ తరువాయి)

కుంటున్నారు. దళారులకు ఏజెన్సీ నిర్వాహకులు సహకరిస్తున్నారని విమర్శలు వినబడుతున్నాయి. పెద్దగా చదువులేని డ్రైవర్లు వీరి వలలో పడుతున్నారు. స్లాట్ బుక్ చేసేందుకు అనుమతులు లేకపోయినప్పటికీ, కార్యాలయంలోనే రూ 1000 తీసుకుని, అనుమతులు జారీ చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే గతంలో ఆర్టీఏ కార్యాలయంలో ఇచ్చే వారు కదా....ఇప్పుడు కూడా ఇవ్వాలని దురుసుగా సమాధానం చెబుతున్నారు. దీనికి తోడు ఉదయం స్లాట్ బుక్ చేసుకున్నవారు సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తుందని డ్రైవర్లు వాపోతున్నారు.

● **భారీగా ట్రాఫిక్ జామ్**

ఫిట్నెస్ పరీక్షల కోసం వచ్చిన వాహనాలతో అనంతవరప్పాడు రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు మీదే వాహనాలను నిలుపుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. దాదాపు నెల రోజులగా ఈ పరిస్థితి ఏర్పడిందని, కనీసం నియంత్రంచడానికి ట్రాఫిక్ సిబ్బంది కూడా లేరని వాహనదారులు వాపోతున్నారు.

● **కోర్టులో రిట్ పిటిషన్**

వాహన ఫిట్నెస్ ప్రక్రియ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని వ్యతిరేఖిస్తూ రవాణ అధికారులు, కార్మిక యూనియన్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ద్వారా నియమించిన ఉద్యోగులుతో ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించాలే తప్ప, అనుభవం లేని వ్యక్తులతో పరీక్షలు నిర్వహిస్తే ఫలితాలు రావని, రోడ్డు ప్రమాదాలుకు కారణమవుతాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

● **సమస్యను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువస్తాం**

నూతనంగా తీసుకోచ్చిన ప్రైవేట్ ఏజెన్సీపై వాహన యజమానులు, డ్రైవర్లు, ఆటో రంగ సంఘ నాయకులు అనేక ఫిర్యాదులు చేస్తున్నారు. ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఈ సమస్యను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువస్తాం. ప్రైవేట్ ఏజెన్సీకి సంబంధించిన ఆర్టీఏ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, తనిఖీలపై గైడ్‌లైన్స్ రాలేదు.

● **యంత్రం ద్వారానే ప్రక్రియ**

ఎఫ్‌సీల ప్రక్రియ పూర్తిగా యంత్రం ద్వారానే జరుగుతుంది. మ్యానువల్‌గా జరగదు. రిజెక్ట్ చేస్తే మరోసారి చలానాలు కట్టుకుని రావాల్సిందే. స్లాట్ బుకింగ్, అక్రమ వసూళ్లు చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. వాహనదారులు ఖచ్చితంగా వారి వాహనాన్ని పూర్తి కండిషన్‌లో ఉండాలి... లేదంటే సర్టిఫికెట్ ఇవ్వలేం.

● **ఆందోళన చేపడతాం**

ఫిట్నెస్ ప్రక్రియను ప్రైవేటు పరం చేయడం దారుణం. దీనిపై ఆందోళలకు సిద్ధమవుతున్నాం. ఇప్పటికే ఉన్నాతాధికారులకు వినతి పత్రాలు అందజేశాము. ఇప్పటికే రవాణా రంగంలో ఎదురువుతున్న సమస్యలతో కార్మికులు రోడ్డు మీద పడ్డారు. ఇటువంటి విధానాలతో వాహన రంగం పూర్తిగా నిర్వీర్యమవుతుంది.

బదిలీల టెన్షన్

- ఏళ్లతరబడి ఉన్న డ్వామా ఉద్యోగులు ఆయా స్థానాల నుంచి కదలాల్సిందే
- ఏపీడీ నుంచి కంప్యూటర్ ఆపరేటర్ వరకు మూడేళ్లు దాటితే స్థానచలనం
- ఐదేళ్లు అయితే తప్పనిసరిగా మార్పు
- పూర్తిస్థాయిలో ప్రక్షాళనతోనే ఫలితం
- త్రిసభ్య కమిటీ నివేదికపై చర్యలు కూడా కొలిక్కి

ఒంగోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో ఉపాధి హామీ పథకం పర్యవేక్షకులు అయిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ బదిలీ జరిగి కొత్తగా జి.జోసఫ్‌కుమార్ రాగా మిగిలిన వారు ఇంచుమించు అందరూ గతం నుంచి ఆయా పోస్టుల్లో ఉన్నవారే. మండల స్థాయిలో ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు(ఈసీ), కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి ఒక్కొక్క మండలంలో పది మంది వరకు ఉంటారు. ఇక క్లస్టర్ స్థాయిలో ఏపీడీ, కార్యాలయ సిబ్బంది, వివిధ చోట్ల ఉన్న శిక్షణ కేంద్రాలు(సీఎల్ఆర్‌సీ సెంటర్స్)తోపాటు డ్వామా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది పెద్దసంఖ్యలో ఉన్నారు. వీరిలో ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులు ఉండేది చాలా తక్కువ. డ్వామా జిల్లా కార్యాలయంలో పంచాయతీరాజ్, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వారు కొందరు ఏపీడీలు అలా రెగ్యులర్ ఉద్యోగులు కాగా మిగిలిన 95శాతం మంది నిర్థిష్ట కాల పరిమితి(ఎఫ్‌టీఈ) అలాగే ఔట్ సోర్సింగ్ ద్వారా తీసుకున్న వారే. మూడొంతుల మంది దీర్ఘకాలంగా ఆయాపోస్టుల్లో పనిచేస్తున్నారు.

నాలుగేళ్లుగా బదిలీలు లేవు

నాలుగేళ్ల క్రితం ఒక స్థాయిలో బదిలీలు జరగ్గా అనంతరం లేవు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కీలకమైన డ్వామా సిబ్బంది బదిలీలు చేయాలని టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు సంబంధిత అధికారులపై వత్తిడి తెచ్చినా ప్రత్యేకంగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేవంటూ బదిలీలు జిల్లాస్థాయిలో నిర్వహించలేదు. దీంతో ఎక్కడి వారు అక్కడే పనిచేస్తున్నారు. కొంతమందిపై పెద్దఎత్తున అవినీతి, ఇతర రూపాలలో ఆరోపణలు వస్తున్నా మార్పులు లేక కొనసాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం డ్వామా ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 20లోపు జిల్లా పరిధిలో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ పలు మార్గదర్శకాలను ఇచ్చింది. ఆ ప్రకారం అన్ని స్థాయిల్లోని వారు మూడేళ్లు ఒకేచోట పని చేస్తే వారిని బదిలీ చేయవచ్చు. అదే ఐదు సంవత్సరాలు ఒకేచోట పనిచేస్తుంటే తప్పనిసరిగా బదిలీ చేయాలి.

ఉమ్మడి జిల్లా యూనిట్ ఏపీడీలు

క్లస్టర్ పర్యవేక్షకులైన అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఏపీడీ)లను పూర్వపు జిల్లా యూనిట్‌గా, మండల స్థాయి పర్యవేక్షకులుగా ఉండే ఏపీవోలను ప్రస్తుత జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయనున్నారు. ఇతర ఉద్యోగులను క్లస్టర్ స్థాయిలో, అలాగే జిల్లా కార్యాలయంలో పనిచేసే వారిని ఐదేళ్లు దాటితే క్లస్టర్‌కు, మూడేళ్లు దాటితే అదే కార్యాలయంలో స్థానాలు మార్పునకు అవకాశం ఇచ్చారు. కాగా ఏటా వందల కోట్ల రూపాయల ఉపాధి పనులు, మెటీరియల్ కోటా నిధులతో పనులు డ్వామా పరిధిలో జరుగుతుండగా అక్రమార్జనకు అంతులేదు. అలాగే స్థానికంగా రాజకీయ నాయకులలోనూ ఈ సంస్థ ఉద్యోగులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. దీంతో ఎవరికి వారు తమకు అనుకూల స్థానాలను ఎంపిక చేసుకొని కొనసాగుతుండగా ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన బదిలీ ఉత్తర్వులు, అందులోని మార్గదర్శకాలతో ఆయా ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు.

గత అక్రమాలపై చర్యలకు సిద్ధం

గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైసీపీ నేతల సూచనలకు అనుగుణంగా అప్పటి పీడీ శీనారెడ్డి ఇష్టారీతిన బదిలీలతోపాటు పెద్దసంఖ్యలో డిప్యుటేషన్లు వేశారు. పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా అలా చేసిన విషయాన్ని శీనారెడ్డి అక్రమాలపై విచారణ చేసిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు కమిటీ తమ నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించింది. దీంతో గతంలో వేసిన డిప్యుటేషన్లను రద్దుచేయడంతో పాటు అప్పట్లో ఇష్టారీతిన జరిగిన బదిలీలను పరిశీలించి ప్రస్తుత బదిలీల్లో జాగ్రత్తలు తీసుకోవాలని పీడీ జోసఫ్‌కుమార్ భావిస్తున్నట్లు సమాచారం. లోకేశ్వరరావు కమిటీ ఇచ్చిన నివేదికపై చర్యలు ఇదే సమయంలో తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ నివేదికపై దాదాపు నెలన్నర రోజులుగా పీడీ జోసఫ్‌కుమార్ నేతృత్వంలో డ్వామా కా ర్యాలయ సిబ్బంది పరిశీలన చేసి కొందరి పై చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు తెలిసింది.

ఘనంగా పాండురంగస్వామి దేవస్థాన వార్షికోత్సవం

మార్టూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పడమర బజారున పాండురంగ స్వామి దేవస్థానం 10వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఉదయం దేవస్థానం ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పాండురంగ స్వామి రుక్మాబాయి దంపతులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి శాంతి కల్యాణానికి పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు.స్వామి వారి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అమరావతిలో అమరజీవి విగ్రహ ఏర్పాటుపై హర్షం

మార్టూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై హర్షం ప్రకటించారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రికి చంద్రబాబుకు ఆర్య వైశ్య సంఘం, వాసవీ క్లబ్ వారు సోమవారం ప్రకటనలో అభినందనలు తెలిపారు.

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన

- పోలీస్ అధికారుల జోక్యం
- పరీక్షా కేంద్రానికి రవాణా చేసేందుకు అంగీకరించిన ఆర్టీసీ అధికారులు

అద్దంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పరీక్షా కేంద్రం వద్దకు విద్యార్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసేందుకు నిరాకరించిన ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు బుధవారం నుంచి ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. అద్దంకి మండలంలోని మైలవరం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు బల్లికురవ మండలంలోని వైదనలో పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. అయితే ఆర్టీసీ అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదం డ్రులు పలుమార్లు సంప్రదించినా కనికరించలేదు. దీంతో సోమవారం ఆంధ్రజ్యోతిలో 10వ తరగతి విద్యార్థుల రవాణా కష్టాలు అనే కథనం ప్రచురితమైంది. అదే సమయంలో సోమవారం ఉదయం గ్రామంలోకి వచ్చిన ఆర్టీసీ బస్ ముందు విద్యార్థులు నిరసనకు దిగారు. అనంతరం ఆటోలలో విద్యార్థులు పరీక్షకు వెళ్లారు. బస్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగిన విషయాన్ని అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు దృష్టికి విద్యా కమిటీ ఛైర్మన్ కృష్ణమారుతి, టీడీపీ నేత దివికోలు రాధాకృష్ణమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకెళ్లారు. వెంటనే ఆర్టీసీ డీఎం రామ్మోహనరావుకు సీఐ సుబ్బారాజు ఫోన్ చేసి విద్యార్థులు పరీక్షకు వెళ్లే విధంగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తల్లిదండ్రులతో చర్చించిన డీఎం రామ్మోహనరావు బుధవారం నుంచి మిగిలిన 5 పరీక్షలు జరిగే రోజులలో బస్సును ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు.


మైలవరంలో ఆర్టీసీ బస్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

చందలూరు పాఠశాల బస్ నిలిపివేత పిల్లల అవస్థలు

పంగులూరు : మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాల విదార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును అర్ధంతరంగా నిలిపి వేయడంతో పిల్లలు పాఠశాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని రేణంగివరం, అలవలపాడు, తూర్పు తక్కెళ్ళపాడు, కొప్పెరపాడు గ్రామాల నుంచి చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు వచ్చే పిల్లల సౌకర్యం కోసం అద్దంకి డిపో వారు ప్రత్యేక బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్ సర్వీస్ సోమవారం అర్ధంతరంగా నిలిపి వేయడంతో పాఠశాలకు చేరుకునేందుకు ఆయా గ్రామాల పిల్లలు తీవ ఇబ్బందులు పడ్డారు. చందలూరు ఉన్నత పాఠశాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్ సర్వీస్‌ను కొనసాగించాలని విద్యార్థుల తల్లిండ్రులు కోరుతున్నారు పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు స్టడీ అవర్స్‌కు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారని తల్లిందడ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

నల్ల బర్లీ కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

రైతు సంఘం డిమాండ్

పంగులూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ కొనుగోలుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. నల్ల బర్లీ కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలసి ధర్నా నిర్వహించి తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లాడుతూ నల్ల బర్లీ కొనుగోలుకు ప్రభుత్వం కంపెనీవాళ్లతో మాట్లాడి కొనుగోలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బర్లీ పొగాకుకు ఇప్పటి వరకు ఒక విధానం లేదని, బర్లీ పొగాకును బోర్డు పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, ప్రతినిధులు మల్లారెడ్డి, ఆదుం సాహెబ్, తిరుపతయ్య, తలపనేని సబ్బారావు, నాయపాము ప్రభాకర్, రాఘవులు, దేవసాయం, కోటయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామంలో నూతన విద్యుత్ లైన్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగేళ్లగా సమస్యలకు పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. న్యాయపరమైన సమస్యలకు పరిష్కారం కోరుతూ సోమవారం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లోని పీఆర్‌సీ సమస్యను పరిష్కరించాలన్నారు. డీఆర్ బకాయిలపై న్యాయ పరిశీలన చేయాలన్నారు. ఫ్రీ మెడికల్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మారెడ్డి, శివ ప్రసాద్, శివకుమార్, కృష్ణమూర్తి, నాగ వీరభద్రాచారి, కృష్ణమూర్తి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు : సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్లు తహసీల్దార్ వెంకటరత్నంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బకాయిల చెల్లింపులు, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధరణ, ఈహెచ్ఎస్ సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, కోశాధికారి తూమాటి ఆంజనేయులు, గోపాలరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

చీరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బలవన్మరణం చెందిన రొయ్యల కంపెనీ కార్మికురాలు కొర్రా లక్ష్మి (22) కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని పలువురు నాయకులు కోరారు. చీరాల ఏరియా వైద్యశాలలో సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం జరిగే క్రమంలో నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎన్.బాబూరావు, కొండయ్య, వసంతరావు పాల్గొన్నారు.

ఎస్టీపీ నిర్మాణంపై పునఃపరిశీలన చేయాలి

చీరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 31 వార్డు శివారులో నిర్మిస్తున్న ఎస్టీపీ అంశంపై అధికారులు పునఃపరిశీలన చేయాలని పలువురు ప్రతినిధులు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును కోరారు. ఈసందర్భంగా విషయమై ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు, ఇతర నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో అంగనవాడీ కేంద్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం టీడీపీ నాయకులు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ, ప్రభుదాస్, నరసయ్య, శేఖర్,పౌలు, బాజీ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మేదరమెట్లలోని తమ్మవరం అండర్‌పాస్‌పై సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై ఒంగోలు వైపు నుంచి వస్తూ అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న కారు డ్రైవర్ రోడ్డుపై పడి ఉన్న వారిని అకస్మాత్తుగా గమనించి ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ఉన్నవారికి ఎలాంటి గాయాలు లేకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాలను పక్కకు తప్పించి రవాణాకు అంతరాయంలేకుండా చర్యలు తీసుకున్నారు.

క్వింటా 20వేలకు కొనాలి

మేదరమెట్ల, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : మిరప క్వింటా 20వేల చొప్పున కొనుగోలు చేస్తేనే మిర్చి రైతులకు కనీస గిట్టుబాటు ధర లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య తెలిపారు. సోమవారం రావినూతలలో మిరపను పరిశీలించి దిగుబడి, ధర తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. తెగులు సోకి పది నుంచి పదిహేను క్వింటాళ్లకు మించి దిగుబడి రావడంలేదని, దీనికితోడు ధరలు కూడా నిరాశాజనకంగా ఉన్నాయని రైతులు వివరించారు. క్వింటాకు కనీసం 20వేల ధర ఉంటే లాభాలు రాకపోయినా అప్పుల భారీ నుంచి బయటపడతామని రైతులు అంటున్నారని తెలిపారు. మార్కెట్‌లో క్వింటా మిర్చి 7 నుంచి 12 వేలకు కొంటున్నారని రైతులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని గంగయ్య కోరారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా నాయకులు తల్లపనేని రామారావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు మోండ్రు ఆంజనేయులు, శ్రీనివాసులు, దశరథ, రవి, మల్లారెడ్డి పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలకు హాజరైన యువతీయువకులు

జాబ్ ఫెయిర్‌కు విశేష స్పందన

220 మంది హాజరుకాగా 55 మంది ఉద్యోగాలకు ఎంపిక

మార్టూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, హెచ్ఆర్‌కో సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ ఫెయిర్‌కు విశేషమైన స్పందన లభించింది. ఈ జాబ్ ఫెయిర్‌కు 220 మంది యువతి యువకులు హాజరుకాగా వారిని హెచ్ఆర్ కో కంపెనీ ప్రతినిదులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. తదుపరి వారిలో 55 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమానికి తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉద్యోగాలను కల్పించేదిశగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారన్నారు. అందుకోసం ఆయన సొంతఖర్చులతో ఫౌండేషన్ ఏర్పాటుచేసి, దానికి అనుసంధానంగా మరో కంపెనీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకొని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఈ అవకావాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీనివాసరావు, శ్రీను, అడుసుమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోటీలు మనోధైర్యాన్ని నింపుతాయి


క్రీడాకారులను అభినందిస్తున్న మునిసిపల్ అధికారులు

చీరాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పోటీల్లో పాల్గొనడం వలన మనోధైర్యం పెరుగుతుందని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ అన్నారు. చీరాలకు చెందిన 20 మంది క్రీడాకారులు గత ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ జూనియర్, సీనియర్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. పోటీల్లో 10 జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొనగా చీరాల నుంచి పాల్గొన్న 20 మందిలో 13 మంది విజయ కేతనం ఎగుర వేశారు. ఈసందర్భంగా 4 స్వర్ణ పతకాలు, 5 రజితం, 4 కాంస్య పతకాలను సాధించారు. దీంతో సోమవారం కమిషనర్ కార్యాలయంలో వారిని ప్రత్యేకంగా అభినందించారు. పతకాలు సాధించిన వారు జూన్‌లో సౌత్‌జోన్ థైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్‌లు ఎస్‌డీ సలావుద్దీన్, వెంకట ప్రసాద్, ప్రశాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ రఘురామ్ సిబ్బంది పాల్గొని అభినందించారు.

నేడు సామాజిక తనిఖీ

చినగంజాం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10గంటలకు ఉపాధీ హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. 1-4-2023 నుంచి 31-3-2024వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై 1-3-2025 నుంచి 14-3-2025 తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామ పంచాయతీ యందు తనిఖీ చేసినట్లు తెలిపారు. పనులపై సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై ప్రజా వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, ఉపాధిహామీ కూలీలు, స్వయం సహాయక సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

తిరునాళ్లకు బందోబస్తు

బల్లికురవ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో బుధవారం జరిగే రామలింగేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక బందో బస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. సోమవారం తిరునాళ్ల జరిగే రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద ఉన్న ప్రదేశాన్ని ఎస్ఐ పరిశీలించారు. ప్రభలు పెట్టే స్థలాన్ని మరియు అన్నదాన నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించి నిర్వాహక కమిటీకి పలు సూచనలు చేశారు. తిరునాళ్ల ప్రశాంతగా జరిగేలా గ్రామ పెద్దలు సహకరించాలని ఎస్ఐ వారికి సూచించారు.


తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ జీవీ చౌదరి

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు


పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు


పర్చూరు వైఆర్ హైస్కూల్ వద్ద తల్లిదండ్రులో కలిసి వచ్చిన విద్యార్థులు

పరీక్ష కేంద్రాలలో 1107 మందికి నలుగురు గైర్హాజర్

అద్దంకిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పదివ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అద్దంకిలో 6 కేంద్రాలలో మొత్తం 1107 మంది విద్యార్థులకుగాను 1103 మంది హాజరుకాగా, నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో-2 బీ సుధాకరరావు తెలిపారు కేంద్రాల వద్ద తాగునీటితోపాటు ఎక్కడా ఇబ్బందులు లేకుండా సీఐ సుబ్బారాజు, ఎస్ఐలు, సిబ్బంది కేంద్రాలను పర్యవేక్షించగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. శంఖవరప్పాడు, ధర్మవరం జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు వలపర్ల కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లి పరీక్ష రాశారు. ధేనువకొండకు చెందిన విద్యార్థులు 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న మేదరమెట్లకు ఆటోల్లో వెళ్లి పరీక్ష రాశారు.

చినగంజాం : మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడీయం విద్యార్థులు 259 మందికి ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ హేమంత్‌కుమార్ తెలిపారు. కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో 158 మందికి గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఏ.వీ.సుబ్బారావు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాలలో చినగంజాం, కడవకుదురు, పెదగంజాం, అడవీదిపాలెం, రాజుబంగారుపాలెం, పల్లెపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, సత్యం హైస్కూల్‌లకు చెందిన 415 మంది సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు హాజరయ్యారు. చినగంజాం పరీక్షా కేంద్రానికి డిపార్ట్‌మెంటల్ అధికారిగా వై.రత్నం, కడవకుదురు పరీక్షా కేంద్రంలో డిపార్ట్‌మెంటల్ అధికారిగా మరియన్‌బాబు ఉన్నారు.

పంగులూరు : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు పంగులూరు మండలంలోని రెండు పరీక్షా కేంద్రాలలో 335 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ముప్పవరం పరీక్షా కేంద్రదంలో ముప్పవరం, కొండమంజులూరు ఉన్నత పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, పంగులూరు పరీక్షా కేంద్రంలో 226 మంది గాను 225 మంది పరీక్షకు హాజరయ్యారు. పంగులూరు పరీక్షా కేంద్రంలో అలవలపాడు, చందలూరు, పంగులూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు పావులూరు కేంద్రంలో పరీక్షకు హాజరయ్యారు.

ఇంకొల్లు : మండలంలోని పావులూరు, ఇంకొల్లులోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను డిప్యూటీ ఈవో గంగాధరరావు సోమవారం పరిశీలించారు. కేంద్రాలలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల, గౌతమి హైస్కూల్, పావులూరు ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించి సూచనలు చేసారు. మొత్తం 793 మంది విద్యార్థులకుగాను 785 మంది హాజరుకాగా, 8 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఎస్సై సురేష్ సిబ్బందితో కేంద్రాల వద్ద పడ్బందీ ఏర్పాట్లు చేసారు. పూసపాడు, ఆదర్శ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.

పర్చూరు : టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం కన్పించింది. మొదటి రోజు పెద్దఎత్తున తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలవద్దకు తీసుకువచ్చారు. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలకుగాను పర్చూరులో మూడు, అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 672 మంది విద్యార్థులకు గాను తొలిరోజు 16 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. వైఆర్ హైస్కూల్‌లో కేంద్రాన్ని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) లింగేశ్వర రెడ్డి తనిఖీ చేసి అధికారులకు సూచనలు ఇచ్చారు.

మార్టూరు : 10 వతరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 5 పరీక్షా కేంద్రాలలో 957 మందికి గాను, 9 మంది హాజరుకాలేదని ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో యద్దనపూడి జడ్పీ హైస్కూల్లో 127 మందికి 124, పూనూరు హైస్కూల్లో 148 మందికి 147 మంది పరీక్షకు హాజరయ్యారు.

మేదరమెట్ల : పది పరీక్షా కేంద్రాలను అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్సై సురేశ్ పరిశీలించి భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 459 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా, 455 మంది హాజరయ్యారని ఎంఈవో ఎల్.పున్నయ్య తెలిపారు. మేదరమెట్లలోని సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్‌లో ఇద్దరు, రావినూతల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇద్దరు గైర్హాజరయ్యారని తెలిపారు.

బల్లికురవ : మూడు పరీక్ష కేంద్రాల్లో 488 మందికి గాను తొలిరోజు పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో రమేష్ తెలిపారు. కేంద్రాలను ఎస్ఐ జీవీ చౌదరి సిబ్బందితో కలిసి పరిశీలించారు.

వైభవంగా రాజగోపురం పంచ విమాన శిఖరాల ప్రతిష్ఠ

- వేదపండితుల ఆధ్వర్యంలో మహాకుంభాభిషేక మహోత్సవం
- భారీగా అన్నదానం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య భక్తి పారవశ్యంతో భక్తులు కనులారా తిలకిస్తుండగా సోమవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో రాజగోపురం పంచ విమాన శిఖరాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రీ త్రిపుర సుందరి సమేత శ్రీ త్రిపురాంతకస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో జరిగిన రాజగోపురం ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామస్థులపాటు గన్నవరం, బొబ్బేపల్లి గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వారి కార్యక్రమాన్ని తిలకించారు. గ్రామానికి చెందిన దాత రాటకొండ హనుమంతురావు, రాధిక దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన రాజగోపురం ఆలయానికి అందమైన కళను తీసు కు వచ్చింది. తొలుత రాజగోపు రం ప్రతిష్ఠ కార్యక్రమం జరిగిన తర్వాత పైభాగాన ఏర్పాటుచేసిన పంచ విమాన శిఖరాల ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా పంచ విమాన శిఖరాలను భక్తులు దర్శించుకొని, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తగా ఏర్పాటు చేసిన రాజగోపురం వద్దధ్వజ స్తంభం వద్ద మహిళలు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉదయాన్నే దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన హోమగుండంలో భక్తులు పలుపూజా ద్రవ్యాలను వేసి నమస్కరించుకున్నారు. అదేవిధం గా యజ్ఞయాగాదులు కార్యక్రమాన్ని ప్రత్యేక స్థలంలో నిర్వహించారు. తదుపరి ప్రతిష్ఠా చార్యులు మూలంరాజు రాజ్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో పలువురు వేదపండితులు ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకములు అ లంకరణ మహాపూర్ణాహుతి, దేవతా దర్శనములు కార్యక్రమాలను నిర్వహించారు. త్రిపురసుందరీ సమేత త్రిపురాంతకస్వామిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకొని స్వామి వారి ఆశీస్సులను పొందారు. అనంతరం భక్తులకు భారీగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది.



దేవస్థానం వద్ద దాత హనుమంతురావు దంపతుల సహకారంతో ఏర్పాటుచేసిన రాజగోపురం


దేవస్థానంలో కొలువుదీరిన త్రిపురాంతకస్వామి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

మంగళవారం 18 మార్చి 2025

ఎండలు తీవ్రమవుతున్నాయ్!

● ప్రజాశ్రేయస్సు దృష్ట్యా చర్యలు తీసుకోండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా వివిధ రంగాల్లో పనిచేసే కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వివిధ ఇంజనీరింగ్ శాఖలు, డ్వామా అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. కూలీలను, నిర్మాణ కార్మికులను మధ్యాహ్నంపూట పని చేయకుండా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇటుక బట్టీలు వంటి ఆరుబయట పని చేసే ప్రదేశాల్లో కార్మికుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత యాజమాన్యాలను సూచించవలసిందిగా కార్మిక శాఖ అధికారిని ఆదేశించారు. హీట్ స్ట్రోక్ నివారణ కోసం చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఆర్వో ఉదయభాస్కర్ రావు, డ్వామా పీడీ గంగా భవానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మండే కాలం!

● పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. జనం ఉక్కిరి బిక్కిరి ● జాగ్రత్తలు తప్పవంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 10 గంటలకే తన ప్రతాపం చూపుతుండటంతో జనం ఉక్కిరిబిక్కి అవుతున్నారు. గడిచిన వారం రోజులుగా 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు వేడిగాలులతో అవస్థలు పడుతున్నారు. ఇక రోజువారి పనుల నిమిత్తం బయటకు వచ్చే ఉద్యోగులు, చిరువ్యాపారులు, ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత 47 డిగ్రీలకుపైగా నమోదవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ఈ జాగ్రత్తలు తప్పనిసరి

వేసవి తీవ్రతను తట్టుకునేలా ఉదయం 10 గంటలు లోగా, సాయంత్రం 5 గంటలకుపైగా ప్రయాణాలు పెట్టుకోవాలి. వేసవి తీవ్రతతో చెమట రూపంలో రెండున్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీనివల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఎక్కువగా ఉంది. చర్మవ్యాధులతోపాటు తలనొప్పి, ఆకలి మందగించడం, మూత్ర సంబంధిత వ్యాధులు, మతిమరుపు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతేగాక వడగాలులు, డీహైడ్రేషన్, వడదెబ్బ, నీటి కాలుష్యం వల్ల వచ్చే డయేరియా, వైరల్ జ్వరాలు ఇతర వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండలని ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు భానుడి తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత వాతావరణానికి అనుగుణంగా ఆహార నియమాలు పాటించాలని, నీటి సాంద్రత ఎక్కువగా ఉండే పానీయాలు, పండ్లు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

వేసవి తీవ్రత ఇలా..

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
17-3-25	26	36.01
16-3-25	25.06	36.05
15-3-25	24.06	35.0
14-3-25	24.07	36.01
13-3-25	25.05	37.01
12-3-25	25.02	35.0
11-3-25	24.09	34.07

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



మార్చిలోనే నెలలోనే ఎండ ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసకోవాలి. ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. పలుచని దుస్తులు ధరించడంతోపాటు తలపై టోపీలు పెట్టుకొని బయటకు రావాలి. అదికూడా తప్పనిసరిస్థితి అయితేనే.

- డాక్టర్ కృష్ణమూర్తి, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్

'కామధేను' అభివృద్ధికి చర్యలు చేపట్టండి

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కొండాపురం మండలం చింతలదేవిలోని కామధేను బ్రీడింగ్ సెంటర్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో కోరారు. ప్రాజెక్టు అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో వైసీపీ అధికారంలోకి రావడంతో పట్టించుకునే వారు కరువ య్యారన్నారు. ప్రధానంగా నీటి సమస్య ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. రూ.3.5 కోట్లు కేటాయిస్తే సమీప రాళ్లపాడు జలాశయం నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఇదే ప్రాజెక్టులో వెటర్నరీ కళాశాల ఏర్పాటుచేస్తే ఐదు జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఎంతో అనువుగా ఉండటంతోపాటు ప్రాజెక్టు అభివృద్ధి చెందుతుందన్నారు. స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కామధేను ప్రాజెక్టు పరిస్థితిని తెలుసుకునేందుకు ఓ పరిశీలన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. తాను స్వయంగా ప్రాజెక్టును సందర్శించి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు.



సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేయాలి

● కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి




కావలి, (ఆంధ్రజ్యోతి): మన బిడ్డల ఆదాయం మనకే దక్కేలా ప్రతి జిల్లాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేయాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కోరారు. ఇక్కడ వనరులు సరిగాలేక ఇతర రాష్ట్రాలకు వెళ్లి మన బిడ్డలు ఉద్యోగాలు చేస్తున్నారని, వారి వల్ల పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఆయా రాష్ట్రాలకు పోతుందన్నారు. ప్రతి జిల్లాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేస్తే మన బిడ్డల ఆదాయం మనకే దక్కుతోందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా అనర్హులకు మాత్రం సంక్షేమ పథకాలు దక్కుతున్నాయన్నారు. వ్యక్తి పూర్తి వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తే మేలు జరుగుతోందన్నారు.

బీపీటీకి మద్దతు దక్కేలా చూడండి

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో బీపీటీ రకం ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. జిల్లాలో రైతులు బీపీటీ, కేఎన్ ఎం, ఆర్ఎన్ఆర్ రకాలను సాగు చేశారన్నారు. కేఎన్ఎం, బీపీటీ రకాలు పండించిన రైతులకు మాత్రం మద్దతు ధర లభించడం లేదన్నారు. మద్దతు ధర పుట్టికి రూ.19700 ఉండగా, బీపీటీ ధాన్యాన్ని రూ.16వేలు, రూ.17వేలకే అమ్ముకోవాల్సి వస్తున్నదన్నారు. సుమారు 1.5 లక్షల ఎకరాల్లో ఈ రకాలు సాగు చేశారన్నారు. రైతులకు మద్దతు ధర దక్కేలా వ్యవసాయ, సివిల్ సప్లయిస్ శాఖల మంత్రులు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఉదయగిరి పట్టణంలో కురుస్తున్న పొగమంచు



సీతారామపురం : ఉదయం 8 గంటలకు కూడా లైట్ల వెలుగులో వాహన రాకపోకలు

మెట్టలో విభిన్నం!

● ఉదయం 8 వరకు కూడా వీడని మంచు

జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి ఉష్ణోగ్రతలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, ఉదయం 8 గంటల వరకు పొగమంచు కురుస్తోంది. మెట్టప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. సోమవారం ఉదయం 8 గంటల వరకు ఉదయగిరి పట్టణంలో చిరుజల్లుల్లా మంచు కురుస్తూనే ఉంది.. 1670-బీజీ రహదారి, ఉదయగిరి ట్యాంక్‌బండ్‌పై వాహనదారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ మంచు కారణంగా పండ్లతోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మామిడి చెట్లలో పూత రాలిపోయి దిగుబడి పడిపోతుందని ఆవేదన చెందుతున్నారు. సీతారామపురం మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

- ఉదయగిరి/సీతారామపురం, (ఆంధ్రజ్యోతి)



మహిళా విద్యకు మణి మకుటం

ఆడవాళ్లు వంటింటికే పరిమితం అని భావించే రోజుల్లోనే అతివల ఉన్నత విద్య కోసమే పురుడు పోసుకున్న విద్యాలయం. ఒకరా... ఇద్దరా.. లక్షలాది మంది అమ్మాయిలను విద్యాధికులుగా తీర్చిదిద్దిన సరస్వతీ నిలయం. 60 ఏళ్ల ఘనమైన చరిత్ర. కాలానుగుణంగా ఆధునిక వసతులు.. అత్యాధునిక కోర్సులు. జిల్లాకు చెందిన వారే కాదు పక్క జిల్లాల నుంచి కూడా వచ్చి చదువుకునేంత నమ్మకమైన బోధనా కేంద్రం. పక్క రాష్ట్రాల్లోనూ ప్రత్యేక గుర్తింపు కలిగిన కాలేజీ. అదే నెల్లూరు నగరంలోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల. స్వయం ప్రతిపత్తి హోదా కలిగి రెండు వేలమందికిపైగా విద్యార్థినులకు విద్యా బోధనేకాదు ఉపాధి మార్గాలూ చూపుతున్న ఆ కళాశాల వజ్రోత్సవ సంరంభానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

● ఆదర్శవంతంగా డీకేడబ్ల్యూ కళాశాల
● ఆరు దశాబ్దాల ఘన చరిత్ర
● రాష్ట్రంలోనే ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపు
● ఇక్కడి నుంచే ఎందరో ఉన్నత శిఖరాలకు..

నెల్లూరు(విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నెల్లూరు నగరంలోనే కాకుండా రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి కలిగిన విద్యాసంస్థగా కీర్తి గడిస్తోంది. నెల్లూరుకు చెందిన వదాన్యులు దొడ్ల సుబ్బారెడ్డి-కౌసల్యమ్మ దంపతులు దూర దృష్టితో మహిళల కోసంగా ప్రత్యేకంగా కళాశాల ఉండాలన్న ఉన్నతాశయంతో 1964-65 మధ్యకాలంలో 24.59 ఎకరాలు వితరణ చేశారు. అంతేకాక అప్పట్లోనే దొడ్ల సుబ్బారెడ్డి రూ.3లక్షల ఆర్థిక సాయం అందించడంతో ఈ స్థలంలో కౌసల్యమ్మ పేరుమీద కళాశాల భవనాలు నిర్మించారు. 1966 సెప్టెంబరు 28న నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో మార్పులు, నూతన హంగులతో ప్రస్తుతం మొత్తం 94 గదులు, ఒక అసెంబ్లీ హాల్, 17 ల్యాబ్‌లు, 40 వేల పుస్తకాలతో లైబ్రరీ, రెండు కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంగ్లీష్ ల్యాబ్, 600 మందికిపైగా విద్యార్థినులు ఉండేందుకు హాస్టల్ భవనాలు ఏర్పాటయ్యాయి. ఎప్పటికప్పుడు అవసర మైన కొత్త నిర్మాణాలు, వసతులు కల్పించడంతోపాటు కాలానుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతుండడంతో ఏడాదికేడాదికి ఈ కళాశాలలో విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

రేపటి నుంచి వజ్రోత్సవాలు

డీకే కళాశాల 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 19, 20 తేదీల్లో వజ్రోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ గిరి తెలిపారు. ప్రస్తుత జిల్లాలో ఏకైక మహిళా కళాశాలగా కీర్తి గడించిన విద్యాసంస్థ వజ్రోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఇందులో పూర్వ విద్యార్థినులు, పూర్వ అధ్యాపకులు, కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, ప్రముఖులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నత విద్యామండలి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు.

● ప్రైవేట్ ఉధృతిలోనూ ఉనికి..

జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టకొస్తున్నా డీకే ప్రభుత్వ మహిళా కళాశాల మాత్రం తన ప్రత్యేకతతో ఉనికిని చాటుకుంటోంది. తొలుత ఇంటర్మీడియట్ (నాటి పీయూసీ), డిగ్రీ కోర్సులను అందించే మిశ్రమ సంస్థగా ప్రారంభమైన ఈ కళాశాలను విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో 1996లో ఇంటర్ కళాశాల, డిగ్రీ కళాశాలలుగా విభజించారు. ఆ తర్వాత పీజీ కోర్సులను కూడా ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం రెండు వేల మందికిపైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఈ కాలేజీలో ఇంటర్, డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉండగా డిగ్రీలోనే 1100 మందికిపైగా విద్యార్థినులు 12 రకాల కోర్సులను అభ్యసిస్తున్నారు. కేవలం రెగ్యులర్ కోర్సులే కాక డిప్లమో కోర్సులు, ఉపాధి కోర్సులను ఇక్కడ అందిస్తున్నారు. 62 మంది అధ్యాపకులు పనిచేస్తుండగా వారిలో దాదాపు 70 శాతం మంది పీహెచ్‌డీ చేసినవారు కావడం గమనార్హం. అలాగే విద్యార్థినుల కోసం జవహర్ నాలెడ్జ్ సెంటర్, డిస్ట్రిక్ రీసోర్స్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ ఉన్నాయి. ఈ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది వైద్యులు, న్యాయవాదులు, అధ్యాపకులు, ఉన్నతాధికారులుగా రాణిస్తున్నారు.

● స్వయం ప్రతిపత్తి, నాక్, యూజీసీ గుర్తింపు

నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందిస్తుండడంతో డీకే కళాశాల నాక్, యూజీసీ ఏ, బీ గుర్తింపు పొందింది. స్వయం ప్రతిపత్తి హోదా దక్కించుకుంది. 2017లో యూజీసీ నుంచి సీపీఈ హోదా లభించడంతో 1.5 కోట్ల నిధులు కళాశాలకు విడుదల చేశారు. అలాగే రూసా పథకం కింద విడుదలైన రూ.2కోట్ల నిధులతో బ్రాడ్‌బ్యాండ్ సేవలు, ఉచిత వైఫై సౌకర్యాలతోపాటు కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వీటితోపాటు 1974 నుంచే కళాశాలలో ఉన్న జాతీయ విద్యార్థి సేవ యూనిట్ విశేష సేవలందిస్తోంది. ఇంటర్, డిగ్రీల్లో ప్రస్తుతం వంద మంది విద్యార్థినుల చొప్పున మూడు యూనిట్లు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. ఎన్‌సీసీ విభాగం, దూరవిద్య కోసం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ కూడా అందుబాటులో ఉన్నాయి.

నీటి కొరత.. ఉక్కపోత!

● తొలిరోజే 'పది' విద్యార్థులకు అగ్ని పరీక్ష

పదో తరగతి పరీక్షల్లో తొలిరోజే విద్యార్థులు అగ్ని పరీక్షను ఎదుర్కొన్నారు. సోమవారం ప్రారంభమైన పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా అత్యధిక కేంద్రాల్లో మంచినీటి వసతులు లేకపోవడం, ఉన్న వాటర్ ప్లాంట్లన్నీ మూలనపడటంతో విద్యార్థులకు నీరు అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తగా ఇంకొన్ని సెంటర్లలో వెలుతురు సరిగా లేక చీకట్లోనే పరీక్ష రాయాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన చెందారు. మరోవైపు అడుగడుగునా ట్రాఫిక్ సమస్యలు ఎదురవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. మొత్తమ్మీద జిల్లాలో తొలిరోజు టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.



సీతారామపురం : విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (విద్య), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలోని 174 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు వరకు టెన్త్ పరీక్షలు జరిగాయి. తొలిరోజు సోమవారం రెగ్యులర్ 28,496, ప్రైవేట్ 734 మంది మొత్తం 29,230 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా రెగ్యులర్ 28,492 మంది, ప్రైవేట్ 354 మంది కలిపి 28,846 మంది హాజరయ్యారు. 384 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికంటే 45 నిమిషాలు ముందుగా కేంద్రానికి హాజరు కావాలని అధికారులు సూచించినా కొన్ని ప్రాంతాల్లో రవాణా, ట్రాఫిక్ సమస్యల కారణంగా కొంతమంది విద్యార్థులు కొంత ఆలస్యంగా హాజరైనా అధికారులు అనుమతించారు. అత్యధిక శాతం మంది విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు తమ హాల్‌టికెట్లను, తమకు కేటాయించిన గదులను బోర్డులలో పరిశీలించుకుంటూ హడావుడిగా కనిపించారు. కొంతమంది తల్లిదండ్రులు అల్పాహారాన్ని నేరుగా కేంద్రాల వద్దకే తీసుకుని వచ్చి పిల్లలకు పెడుతూ జాగ్రత్తలు చెబుతూ కనిపించారు.



కావలిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

● కేంద్రాల పరిశీలన

పదోతరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఓ.ఆనంద్ నగరంలోని ఈఎస్ఆర్ఎం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే అబ్జర్వర్ 7 కేంద్రాలను, డీఈఓ బాలాజీరావు 9 కేంద్రాలను, ఫ్లయింగ్‌స్క్వాడ్ 67 కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఓపెన్ టెన్త్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన హిందీ పరీక్షకు 9 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరు అయ్యారు.

● వసతులు లేక ఇబ్బందులు

జిల్లాలోని పలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వసతుల కల్పనలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఫ్యాన్లు కూడా లేని గదుల్లో పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న పనులు అసంపూరిగా నిలిపివేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయకపోవడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా కేంద్రాల వద్ద విద్యార్థుల హాల్‌టికెట్ల నెంబర్లు, గదుల కేటాయింపులకు సంబంధించిన డిస్‌ప్లే లేకపోవడంతో కంగారు పడ్డారు. అలాగే విద్యార్థులంతా రోడ్లపైకి రావడం, కిక్కిరిసిన వాహనాలతో ట్రాఫిక్ పెరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

వాచ్‌మన్ చేతిలో ఫోన్

కందుకూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద వాచ్‌మన్ సెల్‌ఫోన్ పట్టుకొని తిరుగుతుండటంతో తల్లిదండ్రులు ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాచ్‌మన్ గేటు వద్ద ఉండాల్సిందిపోయి పరీక్ష మొదలు జవాబు పత్రాల బండిళ్లు పోస్టాఫీసుకు తీసుకెళ్లే వరకు సెల్‌ఫోన్ చేతపట్టుకుని చక్కర్లు కొట్టారు. ఇది గమనించిన తల్లిదండ్రులు హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంతో జవాబు పత్రాలు గంట ఆలస్యంగా పోస్టాఫీసుకు చేరాయి. ఈ వ్యవహారంపై హెచ్ఎం రవి మాట్లాడుతూ రికార్డు అసిస్టెంట్ మూగ, చెవిటి అంగవైకల్యం కలిగిన వ్యక్తి కావడంతో ఆయనకు సహాయకారిగా వాచ్‌మన్ గోవింద్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అంతేతప్ప విధులకు ఆటంకం కలిగించే పనులు చేపట్టలేదని తెలిపారు.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

పిల్లలతో ఆటలా!?

20 నిమిషాలు ఆలస్యంగా గురుకుల విద్యార్థులు

టెన్త్ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని విద్యా శాఖ అధికారులు పదేపదే హెచ్చరికలు జారీ చేసినా ఆ గురుకుల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆలస్యంగా పిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లడంతో అధికారులు అనుమతించలేదు. చివరకు టీడీపీ నేతల జోక్యంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ 9.20 గంటలకు చెన్నపల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే, వీరిని అధికారులు అనుమతించకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు ఉన్నత అధికారులతో ఫోన్ మాట్లాడారు. స్కూలు హెచ్ఎం సాయిప్రసాద్‌తో మాట్లాడి గురుకుల విద్యార్థులు 79 మంది పరీక్షకు హాజరయ్యేలా చర్యలు చేపట్టడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ వ్యవహారంపై గురుకుల జిల్లా కో ఆర్డినేటర్ విచారణ చేపట్టారు. కాగా, ఇందుకు బాధ్యురాలిగా పీఈటీ మౌనికను సస్పెండ్ చేస్తున్నట్లు డీసీవో పద్మజ పేర్కొన్నారు.

- టీపీ గూడూరు, (ఆంధ్రజ్యోతి)

ప్రతి ధాన్యపు గింజ కొనేలా చూడాలి

● టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో తీర్మానం

నెల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రతి గింజ కొనుగోలు చేసేలా చూడాలని జిల్లా టీడీపీ సమన్వయ కమిటీ తీర్మానించింది. సోమవారం రాత్రి అమరావతిలోని సోమిరెడ్డి నివాసంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలపై లోతుగా చర్చించారు. రైతులకు ఎక్కడా సమస్యలు ఎదురుకాకుండా చూడాలని, జిల్లాలో ప్రతి గింజను కొనుగోలు చేసేలా చూడాలని నిర్ణయించారు. జిల్లాలో ఎంత దిగుబడి రావచ్చో... అంచనా వేసి తదనుగుణంగా కొనుగోలు సామర్థ్యం పెంచడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. దళారుల పరిస్థితి పునరావృతం కాకుండా ఎమ్మెల్యేలు నిఘా ఉంచాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. జిల్లా పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ వేగవంతం చేయాలని, మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి,పాశం సునీల్ కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు చైర్మన్ కృష్ణయ్య, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రకు జిల్లా పార్టీ తరఫున అభినందనపూర్వక విందు ఏర్పాటు చేశారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, నారాయణ, జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	218

కోడిగుడ్ల ధర (100): 510

విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట నేడు నిరసన

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి ఉపాధి లేకుండా చేస్తుందని రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు మంగళవారం డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలపనున్నారు. దీనిలో భాగంగా సోమవారం స్థానిక కోటారెడ్డి భవనంలో ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. మీటర్ రీడర్స్‌గా ఇంతకాలం సేవ చేసిన మాకు సంబంధిత విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, లేనియెడల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 1న విజయవాడలో సమ్మె చేపడుతున్నామని అప్పటి వరకు విడత వారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, ద్వితీయ సంవత్సరంలో 12 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9666092091ను సంప్రదించాలని పేర్కొన్నారు.

92 కుట్టు మిషన్ల మంజూరు

వలేటివారిపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండలానికి 92 కుట్టు మిషన్లు మంజూరైనట్లు ఎంపీడీవో నరేంద్రదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో బీసీ ఏ-9, బీసీ బి-7, బీసీ డీ-8, బీసీ సీ-5, కమ్మ-15, రెడ్డి-24, ఈబీసీ-14, ఆర్యవైశ్య-6, బ్రాహ్మణులకు 4, క్షత్రియలకు 1, కాపులకు 1 మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 19వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజరు బాధ్యతల స్వీకరణ

లింగసముద్రం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్‌గా నియమితులైన బీ నీలాంబరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుడ్లూరు మండల సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై మండలానికి వచ్చారు. ముందుగా ఎంపీడీవో కేశ్రీనివాసులును కలిసి విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు అంగన్వాడీ కార్యకర్తలు శైలజ, రమాదేవి, మాధవి, ప్రభావతి శుభాకాంక్షలు తెలిపారు.

25న జాబ్‌మేళా

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25వ తేదీన రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవికుమార్, డీఎస్‌డీవో ఎస్‌కే అబ్దుల్ ఖయ్యూం, జేకేసీ కోఆర్డినేటర్ రాజగోపాల్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటిరో ల్యాబ్స్, ఏరీస్ అగ్రో, ఎస్బిఐ కార్డ్స్, డైకిన్, పేటీఎం ఇతర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమో అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 984805054ను సంప్రదించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

టీ దుకాణంలో చోరీ

లింగసముద్రం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని పాత కెనరా బ్యాంకు వద్ద ఉన్న ఓ టీ దుకాణంలో పట్టపగలే రూ.1000 పైగా చోరీ చేశారు. రాజస్థాన్ టీ దుకాణం యజమాని మదన్ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు భోజనానికి పక్కనే ఉన్న ఇంటికి వెళ్లాడు. తిరిగి 3 గంటల వచ్చి చూడగా దుకాణంలోని టేబుల్ డ్రాయర్ పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. అందులో పరిశీలించగా రూ.1000లకు పైగా ఉన్న డబ్బులు కనిపించలేదు. దీంతో ఎవరో చోరీ చేసినట్టు వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

వివాదాస్పద భూముల్లోకి ఎవరూ దిగవద్దు!

కొండాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 151, 166, 167, 168లోని వివాదాస్పద భూముల్లోకి ఎవరూ వెళ్లవద్దంటూ తహసీల్దారు హెచ్చరించారు. ఈ మేరకు 145 సెక్షన్ జారీ చేశారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివాదాస్పదంగా ఉన్న భూమి విషయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని మాజీ సర్పంచు చాగంటి క్రిష్ణ, గ్రామస్థులు మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎస్ఐ ఎం.వెంకటరావులు చర్యలు చేపట్టారు.

రవ్వా శ్రీనివాసులుకు ఛత్రపతి శివాజీ జాతీయ పురస్కారం

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కందుకూరు పట్టణానికి చెందిన శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులకి పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందచేశారని అవార్డు గ్రహీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న 4 రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన వారిలో తన పేరు ఉండటం గర్వించదగ్గ విష యమని, అవార్డుకు ఎంపిక చేసిన తిరు మలశెట్టి ఉమాశంకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

అల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల చట్టంపై అవగాహన ఉంటేనే రక్షణ పొందగలరని పేర్కొన్నారు.

చెరువులపై నిర్లక్ష్యం..!



వలేటివారిపాలెం : రామన్నచెరువు కట్టపై దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

- అడవులను తలపిస్తున్న కట్టలు
- మరమ్మతులకు నోచుకోని తూములు
- దెబ్బతిన్న అలుగులు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

సాగునీటితో పాటు, తాగునీటికి ఎంతో ఉపయోగంగా ఉంటున్న చెరువులు అధికారులు, పాలకుల నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోన్నాయి. చెరువుల కట్టలపై చిల్లచెట్లు పెరిగి అడవులను తలపిస్తోన్నాయి. వరదల సమయంలో దెబ్బతిన్న అలుగులు, తూములు మరమ్మతులకు నోచుకోలేదు. ఈ క్రమంలో చెరువు కట్టలపై చీమలు పుట్టలు పెట్టి నెర్రెలు బారడంతో కట్టలు బలహీనపడుతోన్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అయినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వలేటివారిపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 37 సాగునీటి చెరువులు ఉన్నాయి. అన్ని చెరువుల కట్టలు చిల్లచెట్లతో అడవులను తలపిస్తోన్నాయి. సాధారణంగా ఆయకట్టు చెరువలకు నీరు చేరకముందే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తూములకు, కట్టలకు మమరమ్మతులు చేయించాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది చెరువుల్లోకి పూర్తిస్థాయిలో వర్షం నీరు రాలేదు. చెరువులు పూర్తిస్థాయిలో నిండితే చెరువుకట్టలు తెగిపోయే ప్రమాదం ఉండేది. అంతేగాకుండా మరికొన్ని గ్రామాల్లో చెరువులు ఆక్రమణలతో కుంచించుకపోతున్నాయి. చెరువు అలుగులు దెబ్బతిన్నాయి. గత వైసీపీ పాలనలో ఆయకట్టు చెరువులను గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. గతంలో చెరువు కట్టలపై ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు కూడా వెళ్లేవి. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. చెరువు కట్టలపై చెట్లు పెరిగి బలహీనపడ్డాయి. అంతేగాకుండా చెరువుల తూములు కూడా దెబ్బతిన్నాయి. అలుగులు వరద ఉధృతికి కొట్టుకపోయాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా చెరువుల నిర్వాహణను గాలికొదిలేసిందని రైతులు వాపోతున్నారు. వర్షాకాలంలో చెరువులకు నీరు వచ్చినా పంట పండించుకునే అవకాశం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా చెరువులకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

చెరువులకు మరమ్మతులు చేపట్టాలి

పల్లెలో వ్యవసాయానికి సాగునీటితోపాటు, తాగునీటికి ప్రధాన వనరులైన చెరువులను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైనా చెరువులకు మరమ్మతులు చేపట్టాలి.

- వీరమోసు అంజయ్య,
రైతు, వలేటివారిపాలెం



వరద ఉధృతికి దెబ్బతిన్న చెరువు అలుగు, మరమ్మతులకు నోచక ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

ప్రసన్న వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు

బిట్రగుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. గండవరం టెంపుల్ గ్రూపు కార్యనిర్వాహణాధికారి ఉమాభాయ్ పర్యవేక్షణలో కావలి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఏ.లక్ష్మీనారాయణ, సిబ్బంది, సేవా సంస్థల వారు హుండీ లెక్కింపు చేశారు. స్వామి అమ్మవార్లకు భక్తులు అందచేసిన కానుకలు 22 లక్షల 14 వేల 579 రూపాయలు వచ్చాయని ఈవో తెలిపారు. గత ఏడాది బ్రహ్మోత్సవాలకు 16 లక్షల 39 వేల 801 రూపాయలు వచ్చిందని, ఈ ఏడాది 5లక్షల 74 వేల 778 రూపాయలు అదనంగా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి, ఆలయ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



హుండీల్లో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఈవోపై చర్యలు తీసుకోండి

బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ నిర్లక్ష్య ధోరణి వలన బ్రహ్మోత్సవాల్లో అపశృతులు జరిగాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం ఆలయానికి వచ్చిన దేవాదయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈవో అహంకార ధోరణిలో భాగంగానే 2023 బ్రహ్మోత్సవాల్లో రథం నేలకు ఒరిగిందన్నారు. 2025లో కూడా రథోత్సవానికి ముందు ట్రైల్ రన్ వేయకపోవడంతో అపశృతి వాటిల్లిందన్నారు. దేవస్థానంలో ఈవో రాధాకృష్ణ సోదరుడు రాంబాబు పెత్తనం చెలాయిస్తూ భక్తులు, గ్రామస్థులకు సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నాడని తెలిపారు. తక్షణం ఈవో రాధాకృష్ణను సస్పెండ్ చేయాలని లేకపోతే బదిలీ అయినా చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి అదనపు నిధులు

లింగసముద్రం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వివిధ దశలలో నిర్మాణాలు ఆగిన పక్కా గృహాల ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తుందని గృహ నిర్మాణ శాఖ కందుకూరు డీఈ పీవీ నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ 2016-17 నుంచి ఎన్టీఆర్ పథకం కింద, 2019-24లలో ఎన్టీఆర్ కాలనీలలో యూనిట్ ఖరీదు రూ.1.80 లక్షలు చాలక వివిధ దశలలో నిలిచిన ఎస్సీ, బీసీ లబ్ధిదారుల గృహాలకు మరో రూ.50 వేల, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు అందిస్తుందన్నారు. ఈ పథకానికి నియోజకవర్గంలో ఎస్సీలు 1230, ఎస్టీలు 271, బీసీలు 677 మంది ఉన్నారని చెప్పారు. ఇందులో లింగసముద్రం మండలంలో ఎస్సీలు 147, ఎస్టీలు 37, బీసీలు 140 మందితో 324 మంది ఉన్నారని తెలిపారు. వీరంతా కులధ్రువీకరణ పత్రాలను ఆయా మండలాల్లోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలన్నారు. అలాగే పీఎంఏవై 2.0 కింద మండలంలో ఇప్పటి వరకు 1190 మంది పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకున్నారని, 706 మంది పొజిషన్ సర్టిఫికెట్లు(పీసీ) ఇచ్చారని చెప్పారు. పీసీలు ఇవ్వకపోతే గృహాలు మంజూరు కావని చెప్పారు. పక్కా గృహాల మంజూరుకు ఈ నెలాఖరుకు ఉన్నతాధికారులకు డీపీఆర్‌లు పంపిస్తామని చెప్పారు. డీఈ వెంట మండల ఇన్‌చార్జ్ ఏఈ జె నాగరాజు ఉన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న హౌసింగ్ కందుకూరు డీఈ నారాయణరెడ్డి

ఆర్టీసీ కార్మికుల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్టీసీ డిపో ట్రాఫిక్ విభాగానికి చెందిన అసిస్టెంట్ మేనేజర్ శ్యాంప్రసాద్ తీరుకు నిరసనగా కార్మికుల యూనియన్ జేఏసీ నాయకులు సోమవారం డిపో ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ నాయకుల పట్ల అసిస్టెంట్ మేనేజర్ అవమానకరంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కార్మికుల ఫిర్యాదును డిపో మేనేజర్ పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ, టీఎన్‌టీయూసీ, వైఎస్ఆర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రూ. వేలల్లో విద్యుత్ బిల్లులు, పన్నులు.. పేదలు ఎలా చెల్లించాలి : సీపీఎం

కావలిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పేద మధ్య తరగతి ప్రజలు ఒకేసారి వేలల్లో విద్యుత్ బిల్లులు, ఇంటి, నీటి పన్నులు ఎలా చెల్లించగలరని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య ఆవేదన వక్యం చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం 19, 22వార్డులలో పర్యటించి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి సచివాలయానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.మధుసూదన్‌రావు, కృష్ణయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం

కావలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ విజయవంతంతో జనసైనికులు ఆనందోత్సాహంలో ఉన్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఒక వ్యక్తి కాదు శక్తి అని దేశ ప్రధాని అన్నట్లుగా ఆవిర్భావ సభవిజయవంతంతో పవన్‌కల్యాణ్ ఎమిటో నిరూపించుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్ బూస్ట్‌తో కావలిలో జనసేన బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జనసైనికులు షేక్ షమ్మీ, పీవీ రమణయ్య, ఎం. శ్రీనివాసులు, షేక్ జానీ, జిలానీ, కొడయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ పరిధిలో సోమవారం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతగా ప్రారంభమయ్యాయి. 8 పరీక్షా కేంద్రాల్లో 1233 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారని ఉప విద్యాశాఖాధికారి నరసింహారావు తెలిపారు.

- కావలిటౌన్ : పట్టణంలో 12, తుమ్మలపెంటలో 1 పరీక్ష కేంద్రాల్లో 2,428 మంది విద్యార్థులకు 20 మంది గైర్హాజరయ్యారు. కలుగోళమ్మపేటలో సన్నటి వీధిలో మున్సిపల్ హైస్కూల్, నలందా స్కూల్ పరీక్ష కేంద్రాలు 20 అడుగుల దగ్గరలో ఉండడంతో విద్యార్థులు తల్లిదండ్రులతో ఆ ప్రాంతం తిరునాళ్లను తలపించింది. పైగా అదే వీధిలో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ఉండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.
- లింగసముద్రం : లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 216 మంది, పెదపవనిలోని శ్రీ భోరావు జడ్పీ హైస్కూల్‌లో 175 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్‌లు మాధవరావు, కమల్‌కుమార్‌లు చెప్పారు. ఎంఈఓ-2 ఎంవీ శివకుమార్ తనిఖీ చేశారు.
- వలేటివారిపాలెం : మండలంలోని వలేటివారిపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 186 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా పోకూరు హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో 183 మందికి 182 మంది హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు.
- ఉలవపాడు : ఉలవపాడులో 3 పరీక్ష కేంద్రాలు, రామాయపట్నంలో 1 పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 635 మంది విద్యార్థులకు 5 మంది గైరుహాజరై 630 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో-2 రమణయ్య తెలిపారు.
- కలిగిరి: మండలంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో 199 మంది విద్యార్థులకు 196 మంది, జడ్పీ హైస్కూల్‌లో 186 మందికి 185 మంది హాజరయ్యారని చీఫ్ అధికారులు ఏ శ్రీను, ఎస్ భీమేశ్వర తెలిపారు. విద్యార్థులు ముందుగా ఆలయాల్లో పూజలు చేశారు.



ఉలవపాడులో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు లావణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల గౌరవ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగలకు పీఆర్సీ, ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలని, క్వాంటమ్ పెన్షన్ పూర్వ పద్ధతిలో చెల్లించాలని, ఈహెచ్ఎస్ సౌకర్యం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిమ్మిరి నరసింహం, ఇంటూరి మాల్యాద్రి, చెన్నయ్య, శ్రీను, బషీర్, నజీర్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తహసీల్దారు లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

తహసీల్దారు లావణ్య బాధ్యతల స్వీకరణ

కందుకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారుగా వీ.లావణ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉలవపాడు తహసీల్దారుగా పనిచేస్తున్న ఆమె బదిలీపై కందుకూరుకు వచ్చారు. కందుకూరు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఇక్బాల్‌ను సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏవోగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అరువు తెచ్చుకున్న వ్యక్తితో

కాకర్లపై అసత్య ఆరోపణలు

జలదంకి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై నియోజకవర్గంలో విమర్శలు చేసేందుకు వైసీపీ నాయకులు లేకపోవడంతో ఆపార్టీ ఉదయగిరి ఇంచార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నెల్లూరు నుంచి అరువు తెచ్చుకున్న వ్యక్తితో అసత్య విమర్శలు చేయించాడని జలదంకి టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపాలెంలో టీడీపీ నేత కరియావుల అప్పలయ్యనాయుడు నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్లపై అవినీతి ఆరోపణలు చేసే నాయకులు ముందు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎవరేమి చేశారో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి బయటపెట్టేది చాలదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో తొమ్మిది నెలల్లో ఎంత అభివృద్ధి జరిగిందో కాకాణికి స్వయంగా చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఐదేళ్ల పాలనలో మీరు చేసిన అభివృద్ధి చూపించేందుకు సిద్ధమా అని వైసీపీ నేత రాజారెడ్డికి సవాల్ విసిరారు. సోమశిల ప్రాజెక్ట్ వైస్‌ఛైర్మన్ పి.మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో తెలుగురైతు అధ్యక్షుడు పీ.భాస్కర్‌రెడ్డి, నాయకులు మందపల్లి మాల్యాద్రి యాదవ్, జాజుల శివరామయ్య, జాజుల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కావలిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని కచ్చేరిమిట్టలో వెలసివున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు బుర్రా శేషాచార్యులు యాజ్ఞక నిర్వహణలో ఉదయం స్నపన హోమం పూజలు జరిగాయి. ఉత్సవమూర్తులకు అభిషేకాలు, చందన అలంకరణ, పూలంగి సేవ నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆలయ కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్ దంపతులు అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారికి ఏకాంత సేవ కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమాలను బ్రహ్మోత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, నరహరి హరిబాబు, రామకృష్ణ, గోపాల్, నరసింహరావు, ఏ.శ్రీనివాసులు, మధుసూదన్‌రావు పర్యవేక్షించారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న దాత తిరివీధి ప్రసాద్

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు!

కలిగిరి మండలం వీర్లకొల్లు, నాగసముద్రం, కమ్మవారిపాలెం, కలిగిరి గ్రామాల చుట్టుపక్కల చెరువులు, ప్రభుత్వ భూములు, వాగుపోరంబోకు భూముల్లో రాత్రి వేళల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే అధికార పార్టీ అండదండలున్నాయి జాగ్రత్త- అంటూ హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెరవులు, ప్రభుత్వ భూముల్లో మట్టి మాఫియా 10 నుంచి 20 అడుగుల మేర లోతు తవ్వుతుండడంతో ఎద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో పశువుల కాపరులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా వీర్లకొల్లు, నాగసముద్రం, కలిగిరి చట్టు పక్కల ప్రాంతాల్లో సెలవు దినాలలో మాత్రమే రాత్రివేళల్లో మట్టి తరలిస్తుండాన్ని గుర్తించామని, ఈ విషయపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

- కలిగిరి(ఆంధ్రజ్యోతి)



కలిగిరి సమీపంలోని వాగు పోరంబోకులో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు



చావనైనా చస్తాం
పరిశ్రమలకు భూములివ్వం

కావలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 'చావనైనా చస్తాం. కానీ మా భూములను పరిశ్రమలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేది లేదు.' అని కావలి రూరల్ మండలం అనెమడుగు రైతులు తేల్చి చెప్పారు. బలవంతంగా భూములు లాక్కుంటే 28వ తేదీ నుంచి ఆందోళనలు చేపడతామని వారికి మద్దతుగా నిలిచిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేపట్టారు. గ్రామసభలు పెట్టకుండానే తమ అనుమతితో 758 ఎకరాలు సేకరించినట్లు పత్రికల్లో ప్రకటించడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. ఏడాదికి మూడు కారులు పండే తమ భూములను ఎకరాకు రూ2 కోట్లు ఇచ్చినా తాము ఇవ్వమని స్పష్టం చేశారు. తమ భూములను తీసుకోవాలనుకుంటే రైతులకు తలా కొంత విషం ఇచ్చి తమ ప్రాణాలు తీసిన తర్వాత ఉచితంగా తీసుకోవచ్చని తెగేసి చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2013, భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణ ధర్నా వద్దకు వచ్చి రైతుల సమస్యలను విన్నారు. భూసేకరణలో తమ ప్రమేయం ఏమీ లేదని చట్ట ప్రకారమే జరుగుతోందన్నారు. ఎవరి భూములను బలవంతంగా తీసుకోలేదని చెప్పారు. ఈ ధర్నాలో నాయకులు పుల్లయ్య, వెంకమరాజు, తాళ్లూరు మాల్యాద్రి పాల్గొన్నారు.

రంగనాథుడికి అశ్వవాహన సేవ



నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం తిరుమంజనం సేవ, గంగాళాల తిరుమంజనం జరిగాయి. రాత్రికి స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కిడాంబి వెంకట నరసింహాచార్యుల కుటుంబం, ఆత్రవణం కుటుంబీకులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

దళితుల భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం మండలం ఊటుకూరులో దళితుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఉంచిన నిషేధ బోర్డును తొలగించి, వారికి యాజమాన్య హక్కు కల్పించాలని అఖిల భారత్ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య మాట్లాడుతూ భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ బంజరు, మిగులు, పోరంబోకు భూములను దళితులకు, ఇతర పేదలకు పంచి పెట్టాలన్నారు. పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పందిటి వెంకటయ్య, కే రమేష్, బీ మమత, పీ.అనుష, ఏ.నాగమణి, పీ.పెంచలయ్య, పీ.కోటయ్య, పీ.శ్రీను, పాల్గొన్నారు.



యోగి వేమన వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా అల్లం



వెంకటాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో వీసీగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గవర్నర్ ఆదేశాల మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఈ ఉత్తర్వులను విడుదల చేశారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలసుధాకర్



నెల్లూరు (వైద్యం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తలారి బాలసుధాకర్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సోమవారం ఎంపిక చేశారు. ఆయనతో పాటు 27 మంది కమిటీ సభ్యులను కూడా నియమించారు. బాలసుధాకర్‌ను ఎంపిక చేయడంలో సహకరించిన జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సుధాకర్ కలిసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు కొప్పుల రాజు, పీసీపీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్‌లకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియచేశారు.



భారతీయ శాస్త్రీయ సంగీత వాద్య పరికరాల్లో ఉత్కృష్టమైనదిగా గుర్తింపు పొందిన వీణా వాద్యంలో ఆమె దిట్ట. ఏడు తంత్రులతో సప్త స్వరాలను రసరమ్యంగా వినిపించే విదుషీమణి. విపంచిపై ఏ రాగాన్ని అయినా అలవోకగా పలికించగల అద్భుత వైణికురాలు. తల్లి నుంచి అబ్బిన సంగీత జ్ఞానానికి సాధనతో సానబెట్టి విద్వాంసురాలిగా ఎదిగిన వాగ్దేవీ రూపం. ఎన్నో ప్రదర్శనలు, ఎందరి నుంచో ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటున్నా అంతటితో ఆగక తనలాంటి మరెందరినో వీణా వాద్యకారులుగా, సంగీత కళాకారులుగా తీర్చిదిద్దుతున్న గురువు. ఆ విద్యా లక్ష్మియే నెల్లూరుకు చెందిన చావలి వెంకట శ్రీలక్ష్మి.

గాత్ర లక్ష్మి.. వీణా వాణి!

- సంగీత విదుషీమణి వెంకట శ్రీలక్ష్మి
- వీణ వాద్యంతో ఎన్నో ప్రదర్శనలు, ప్రశంసలు
- దేశ, విదేశాల్లోని వారికి శిక్షణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వెంకట శ్రీలక్ష్మి కాకినాడలో సంగీత కుటుంబలో జన్మించారు. ఆమె తల్లి సుచర్ల అన్నపూర్ణ గాయని. ఆమె ప్రేరణతో శ్రీలక్ష్మి సంగీతంపై మక్కువ పెంచుకున్నారు. తల్లి మర్గనిర్దేశానికితోడు విజయనగరం సంగీత కళాశాలలో చేరి మరిన్ని మెలకువలు నేర్చుకుని సంగీత విద్వాంసురాలిగా, వాద్యకారిణిగా ఎదిగారు. వీణా వాద్యంలో చెన్నైలో డిప్లమో సాధించారు. 18 సంవత్సరాలుగా ఎన్నో ప్రదర్శనలిచ్చారు. ఆమె తమ్ముడు యజ్ఞతేజ కూడా గాయకుడు, వాయిద్యకారుడు కావడం విశేషం. షేర్ మార్కెట్ కార్యాలయంలో పని చేసే చావలి మిత్ర రామకృష్ణను వివాహం చేసుకున్నారు. భర్త ఉద్యోగ రీత్యా ఆమె నెల్లూరు వేదాయపాళెంలో స్థిరపడ్డారు.

సంగీత పాఠశాలతో శిక్షణ

చావలి శ్రీలక్ష్మి 2007 నుంచి సంగీత పాఠశాల నిర్వహిస్తున్నారు. డాక్టర్ ఎస్‌బీఎస్ సంగీత కళాపీఠం పేరుతో ఆ పాఠశాల నడుపుతూ వీణ, సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం కళాపీఠంలోనేకాక ఆన్‌లైన్ ద్వారా కూడా దేశ విదేశాలలోని వారికి శిక్షణ ఇస్తున్నారు. ప్రతిభ కలిగిన శిష్యులకు బొబ్బిలి వీణ, నూజివీడు మధుర వీణ వంటివి బహూకరించి మరింత ప్రోత్సహిస్తున్నారు. ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లో వీణ, గాత్ర కచేరీలు చేస్తున్నారు. తన స్వరార్చనతో భక్తులను అలరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖుల నుంచి ప్రశంసలు, పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. శ్రీలక్ష్మి శిష్య బృందం యువజనోత్సవాల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడం విశేషం.



విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీలక్ష్మి



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పోటీలకు న్యాయ నిర్ణేతగా హాజరై సన్మానం అందుకుంటూ..



ఎండను సైతం లెక్కచేయక
వినతుల వెల్లువ

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఆర్వో, ఇతర ఉన్నతాధికారులు

- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండే ఎండను సైతం లెక్కచేయకుండా సోమవారం జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వందలాదిగా అర్జీదారులు తరలివచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ ఆనంద్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగాభవానీ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో ధాన్యం ధరలు రోజురోజుకి తగ్గిపోతున్నాయని, వెంటనే రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని అఖిలపక్ష రైతు సంఘం నేతలు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు పుట్టికి రూ.16,500 మాత్రమే ఇస్తున్నారని, తేమ పేరుతో 70 కిలోల ధాన్యాన్ని తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మిల్లుకు తీసుకెళ్లేందుకు జీపీఎస్ ఉన్న ట్రాక్టర్లు దొరకడంలేదని, జీపీఎస్ ఏర్పాటు చేసుకున్నా అది యాక్టివేట్ కావడం లేదని చెప్పారు. ఇంకా ధాన్యం ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. సమస్యలు పరిష్కరించి రైతులకు మంచి ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

- భూములు కాపాడాలి

జిల్లాలో మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన భూములను కొంతమంది ఆక్రమించి, ఇబ్బందులు పెడుతున్నారని, వారి భూములను కాపాడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- భూకుంభకోణంపై విచారణ జరపాలి

నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు సర్వే నెంబరు 3లో తహసీల్దారు ఇచ్చిన భూములను రద్దు చేయాలని ఆమంచర్ల పంచాయతీ రైతులు, రాచమల్లి రమేష్ కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు.

- అవకాశం ఇవ్వాలి

బయో మెడికల్ వ్యర్థాలు సేకరించడానికి తమ సంస్థకు అవకాశం ఇవ్వాలని ఏవీఐ బయో కేర్ అనే స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

- బకాయిలు చెల్లించాలి

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు ఐ.లక్ష్మీనారాయణ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిం చారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- ఎస్పీని కోరిన బాధితులు

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 'నమ్మి మోసపోయాం.... మీరే ఆదుకోండి సార్... అంటూ జిల్లా ఎస్పీ జీ. కృష్ణకాంత్‌ను పలువురు బాధితులు కోరారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు ఆయనకు అర్జీలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 75 మంది వినతులు అందించారు. ఎస్పీకి అందిన ఫిర్యాదుల్లో కొన్ని పరిశీలిస్తే...

- నగరంలోని వేదాయపాలెంకు చెందిన ఓ వ్యక్తికి వాట్సాప్ ద్వారా జ్యోతిర్నాథ్ పరిచయమయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.2.10 లక్షలు తీసుకొని మోసం చేశాడు. నగదు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.
- వేదాయపాలెంకి చెందిన వ్యక్తికి అదే ప్రాంతానికి చెందిన వెంకటరావు పరిచయం అయ్యాడు. బీవీ నగర్‌లో స్టీల్ కంపెనీలో డీజిల్ మోటర్స్ ఇప్పిస్తానని నమ్మించి రూ.4.20 లక్షలు తీసుకున్నాడు. మోటర్స్ ఇప్పించకుండా, నగదు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని కోరాడు.
- వేదాయపాలెంకి చెందిన మరోవ్యక్తి వద్ద తమిళనాడుకి చెందిన లక్ష్మీనారాయణ, రావి సెల్వంలు ప్రముఖ వర్సిటీలో పీజీ మెడికల్ సీటు ఇప్పిస్తానని నమ్మించి రూ.20 లక్షలు తీసుకున్నారు. అయితే సీటు ఇప్పించకుండా మోసం చేశాడని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.
- బుచ్చికి చెందిన వ్యక్తికి విజయవాడ వాసులు రామకృష్ణ, దివ్య, జగిత్యాల వాసులు శ్రీనివాస్, రిజ్వాన, అస్సులు అబుదాబిలో వర్కింగ్ వీసా ఇప్పిస్తామని, నెలకు రూ.80 వేలు వస్తుందని నమ్మించారు. వారిని నమ్మి రూ2.70 లక్షలు ఇచ్చాడు. విజిటింగ్ వీసా ఇప్పించి మోసం చేశారని న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

- కాంట్రాక్ట్ బేసిక్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని అనంతసాగరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదే ప్రాంతానికి చెందిన ఎస్‌డీ ఖాజామోహిద్దీన్ నమ్మించి రూ.5.62 లక్షలు తీసుకుని మోసం చేశాడు. న్యాయం చేయాలని బాధితులు కోరారు.
- అల్లూరుకు చెందిన బత్తల బ్రహ్మారెడ్డి ఇతరుల పొలంలో గడ్డి కొనుగోలు చేసి, కట్టించుకుంటూ ఉంటే అదే ప్రాంతానికి చెందిన సుమంత్, శూలంతో ఘర్షణ జరిగింది. స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారం గడిచినా కేసు నమోదు చేయలేదని, విచారించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

పంటలు అమ్ముకునే అవకాశం ఇవ్వండి

నెల్లూరు (వైద్యం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మహిళా రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను అమ్ముకునే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నేతలు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఈ మేరకు వినతిపత్రం అందించారు. అనంతరం కాంగ్రెస్ సిటీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, సుధీర్ మాట్లాడారు. మహిళలు పండించిన పంటలను రోడ్డుపై అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద అమ్ముకుంటున్నారన్నారు. అయితే కొంత మంది టాక్సుల పేరుతో దోపిడీ చేస్తున్నారని, అలాగే కొందరు పోలీసులు దౌర్జన్యాలతో మహిళలు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో స్వేచ్ఛగా మ హిళలు పంటలు అమ్ముకునేలా అవకాశం కల్పించాలని కోరారు.



కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అరుదైన కణితిని నగరంలోని జీజీహెచ్ వైద్య నిపుణులు తొలగించారు. వివారాలు.. సోమవారం తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన తాటిపర్తి శశికళ (35) జీజీహెచ్‌కి వచ్చారు. ఆమె ఎడమ కాలు విపరీతమైన నొప్పితో ఆసుపత్రికి వచ్చారని ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ కాలేషా బాషా వెల్లడించారు. పూర్తిగా పరీక్షించగా ఎడమ కాలిలో కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఐదేళ్లుగా పలు ఆసుపత్రులకు తిరిగినా ప్రయోజనం లేకపోవటంతో ఆఖరికి జీజీహెచ్‌ని సంప్రదించారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బాధితురాలికి శస్త్రచికిత్స నిర్వహించి, ఎడమకాలిలో ఐదు కిలోల కణితిని తొలగించామన్నారు. బాధితురాలు ప్రస్తుతం కోలుకుంటుందని వివరించారు. డాక్టర్ సుహాసిని, డాక్టర్ ఉమామహేష్, మత్తు వైద్యనిపుణులు డాక్టర్ శారద ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించామని తెలియచేశారు. కాగా శస్త్రచికిత్స విజయవంతం పై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ డాక్టర్లను అభినందించారు.

ఏపీపీగా చెంచుకృష్ణ

నెల్లూరు (లీగల్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నగరానికి చెందిన న్యాయవాది ఎం చెంచుకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పదవీ కాలం మూడేళ్లు. నెలకు రూ.40వేలు గౌరవ వేతనం చెల్లిస్తారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని గేదెల మృతి

ఉదయగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై ఎస్ఎల్‌సీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఐదు గేదెలు, మూడు దూడలు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతా రామపురం నుంచి హైదరాబాదుకు వెళుతున్న బస్సు అతివేగంగా వస్తూ కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతున్న గేదెలను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఐదు గేదెలు, మూడు దూడలు మృతి చెందాయి. బస్సు గేదెలను ఢీకొట్టి సుమారు 50 మీటర్ల మేర లాక్కొని వెళ్లడంతో రోడ్డుపై గేదల మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. మృతిచెందిన గేదెలు సీతారామపురం మండలం సంజీవరెడ్డినగర్‌కు చెందినవిగా గుర్తించారు. గేదెల మృతితో సుమారు రూ.5 లక్షలు న ష్టం వాటిల్లినట్లు పాడి రైతులు వాపోతున్నారు. విషయం తెలు సుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏఆర్ ఏఎస్పీ వీఆర్‌కి బదిలీ

నెల్లూరు(క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ ఏఎస్పీ జీ. ముని రాజను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది అక్టోబరులో మునిరాజా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం, వివిధ ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యి పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు.

కౌన్సెలింగ్‌లో గందరగోళం

- ఉద్యోగోన్నతుల జాబితాలో కాంట్రాక్టు ఏఎన్ఎంల పేర్లు
- ఆరోపణలతో హడావుడిగా మార్పు
- కలెక్టర్‌కు దళిత సంఘాల ఫిర్యాదు

నెల్లూరు (వైద్యం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులకు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. మెరిట్ జాబితాపై వస్తున్న విమర్శలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయటంతో రెండు సార్లు జాబితాలో మార్పులు చేశారు. ఇందులో కొందరు అధికారులు కాంట్రాక్టు ఏఎన్ఎంల పేర్లు కూడా ఎక్కించి, వారి వద్ద భారీగా ముడుపులు తీసుకున్నారననే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వారి పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు సమాచారం.

- ముడుపులు ఇచ్చినవారికే ప్రాధాన్యం

830 మంది సచివాలయ ఏఎన్ఎంలలో 289 మందికి గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ వన్‌కి ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉంది. ఇందులో నాలుగు శాతం దివ్యాంగులకు రిజర్వేషన్ కోటాలో 8 మందికి అవకాశం ఇవ్వాలి. అలాగే మెరిట్‌తో పాటు స్పౌజ్ కింద రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంది. అలాగే ఎస్సీలకు 15, ఎస్టీలకు ఆరు శాతం రిజర్వేషన్‌లు కల్పించాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలన్నీ పక్కన పెట్టి ముడుపులు ఇచ్చిన వారికి ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో దళిత సంఘాల నేతలు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.సచివాలయ ఏఎన్ఎంల ఉద్యోగోన్నతిలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కలెక్టరు స్పందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఏఎన్ఎంల ఉద్యోగోన్నతిపై కౌన్సెలింగ్ జరుగుతుందని, అది పూర్తయ్యాక అధికారులపై విచారణ జరుపుతానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

- ఆరోపణలు ఎదుర్కొన్నవారే అంతా చేశారు..

ఈ కౌన్సెలింగ్‌ను ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులే నిర్వహించటం పలు విమర్శలకు తావిస్తున్నది. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఉన్నా జాబితా తయారీలో జరిగిన అవకతవకలపై అవగాహన లేదు. దీంతో ఆమెను తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలున్నా యి.కాగా కౌన్సెలింగ్‌లో పెద్దఎత్తున ఏఎన్ఎంలు పాల్గొన్నారు. వారేకాక తల్లిదండ్రులు, భర్తలు తరలి రావటంతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



జాబితా మార్పును ఆసక్తిగా తిలకిస్తున్న ఏఎన్ఎం, సహాయకులు